UNIVERSAL
LIBRARY
OU_204654
UNIVERSAL
LIBRARY

Checked 1965
CHECKED 1950
Checked 1969

# పీఠిక

ఈ కథలు చాలకాలముక్రింద భారతిలో ప్రకటితములాయెను. అవియే యిపుడు కొలఁది గొప్పమార్పులతో పుస్తకాకారము తాల్చెను. ఇందులకు భారతికి నా కృతజ్ఞత. ఇందలి మొదటి కథను ప్రకటించిన ఆంధ్రశిల్పికిని కృతజ్ఞుఁడను.

మార్పులకు హేతు విది: నేను సుమా రేఁబది కథలు వ్రాసి నాలుగయిదేండ్లపిమ్మట మరలమరలఁ జూచి ప్రకటింపఁ దలఁచుకొని యుంటిని. కాని రెండేండ్లు దాఁటకముందే యీ కాకితము లన్నియు సగపాలు మాగృహదాహములో దగ్ధమాయెను. వానిని మరల నతుకుటలో ఎన్ని ప్రమాదములు కలుగుటకు వీలుండునో అన్నియు కలిగెను. ఉదాహరణమున కొక్కటి మాత్రమే చెప్పెదను. కొన్నికథలవస్తువును నేను మఱచితిని. లోఁగడ చదివియున్న నామిత్రులు కొందఱు కొన్నిఁటిని చెప్పిరి. నామిత్రులొకరు వ్యత్యయము మొదలగు మూఁడుకథలను పూరించి భారతి కిచ్చిరి. అచ్చయినపిదపఁగాని నాచూపు వానిపైఁ బడలేదు. కొంతకాలమునకుఁగాని నాకు వ్యత్యయమను కథయందలి వస్తువు స్ఫురింపలేదు. దానిమార్పు రెండవసంపుటమున చూడఁగలరు. వ్యత్యయ మనువేరుగూడ కొత్తదే. దాని-అసలుపే రింతవఱకు నాకు గుఱుతు తగులలేదు.

భాషోద్ధారక వావిళ్ల వేంకటేశ్వరశాస్త్రిగారయాచితముగా ఈకథలను ముద్రింపించి యొసఁగిరి. వారి ఔదార్య సింధువున నిది యొక బిందువు. శ్రీ వేంకటేశ్వరశాస్త్రిగారికి నా ధన్యవాదములు.

సూరవరము.
ఆత్కూరుటపా, కృష్ణా.

వేలూరి శివరామశాస్త్రి

# విషయసూచిక


| | | పుట. |
|---|---|---|
| నకల్ హైదరాబాద్ | ... | 1 |
| ఊరి బడి | ... | 19 |
| జన్మాంతర సంబంధము | ... | 39 |
| రాచపట్టు | ... | 54 |
| సులతానీ | ... | 61 |
| తన్మయత | ... | 82 |

# 'నకల్ హైదరాబాద్

౧

జాగీరు చిన్నది. జాగీరుదారు దానికన్న చిన్నవాడు! జాగీరు పేరు బూావంచ. జాగీరుదారు పేరు మురాద్.

బూావంచ చుట్టును మైలు రెండుమైళ్ల లోపల నున్న వన్నియు యూనియన్ గ్రామములు. బూావంచ నడుమగాపోవు దారిమీద కాంచర్ గుడిసె ఒకటి ఉన్నది. దానిముందు వస్త్రాపహారణ ధనాపహారణములు కాని మొనగాడింతవర కెవడును లేడు.

నిజాం సంస్థానమున రజాకార్లు రాజ్యముచేయుట మొదలిడిన పిదప బజ్జుసాహెబు మురాద్ తలలో కొన్ని అభిప్రాయములను బలవంతముగా విత్తెను. అవి అంకురించెను. దానికి ఫలముగా బూావంచ హైదరాబాదాయెను. మురాద్ నిజామాయెను; బజ్జు రజ్వి ఆయెను. పటేల్ పట్వారీలు పోలీసులుగను మిగిలినవారందరును రజాకార్లుగను మారిరి.

గ్రామమునగల సుమారు వేయి గడపలో ఎనుబదివందల గడప ఒక నూరుగడపకు గజగజ లాడిపోవలసివచ్చెను. అటులయ్యు తన సంఖ్యాబలమును చూచుకొని ఆ యెనుబదివందల

గడపయు ధైర్యము చిక్కబట్టుకొని యుండెను. ఇటులుండగా ఒకనాడు గ్రామము నట్టనడుమ గప్పాల దిబ్బమీద కాంగ్రెసు జెండా రెపరెపలాడుచు సుదూరము కనబడెను.

దివాణమున ఆలోచన లారంభ మాయెను. 'దీనిని పాతిన కాఫిర్ ఎవడు?' అని రజాక్ అనెను. అరే పార్థకాక మరెవరు? అని పీర్ అనెను. ఈ మాటలు వినుచు మురాద్ మీసాలు మెలిపెట్టుచు జెండాకేసి క్రోధముగా చూచుచుండెను.

అప్పుడు బజ్జు చేతులూపుచు-'భాయీ' మీసాలు మెలిపెట్టి క్రోధముతో జూడగా 'ఆ ఝండా ఏల పడలేదా!' యని మన నవాబుగా రాలోచించుచున్నటు లున్నారు. ఇది సత్యకాలమా? ఇది క్రియాకాలము! కాబట్టి వారి యిచ్ఛ యేల కొనసాగదో చూచుట మన వంతు. ఈ ఝండా కూల్చుటయే మన పని కాదు. 'బందరులో పోయిపడుదు'మనియే రజ్వీ యనెను. మరి మనమో కర అగ్రహారముదాటి యింకను అవలికిపోయి పడుదుమో లేక ఎక్కడికిపోయి పడుదుమో అది మనకే తెలియదు. 'అసఫ్ జాహీ ఝండాను ఢిల్లీకోటమీద పాతుదు' మని మాత్రమే రజ్వీ యనెను. మనమో మహా ఘనత వహించిన మురాద్ జాహీ ఝండా యింకను అవల నూపిటికోటమీద పాతెదము. 'బంగాళాఖాతపు నీటితో నిజాం పాదములు కడుగుద'మని రజ్వీ యనెను. ఛీ! అవి ఉప్పు నీళ్లు! మనము అక్క

రెడ్డి గూడెము ఎద్దువాండ్రులోని మంచి నీళ్లతో కడుగుదము లెండిక లెండు! మురాద్ జిందాబాద్!' అని ఉపన్యసించి మురాద్ కేసి పాము నాలుకలవలె తన రెండు చూపులను సారించెను.

అప్పుడు మురాద్ లేచి—'భాయీ! మా వంశభార మంతయు మీ భుజములపై నున్నది. అది నిలిచెనా మీరును నిలుతురు. అది కూలెనా మీరును కూలుదురు. మరియొకటి గురుతు చేయుకును. మీరు కారణములేనిదే కత్తి పట్టరుడు! అని యెదురుగా నున్న కలశములజూపి లోని కేగెను.

అంతట బజ్జు—'చూచితిరా నవాబుగారిబుద్ధి! ఇపుడు తగిన కారణమున్నదిగాన కత్తిపట్టుడను కొండంత అభిప్రాయ మీ కొసవాక్యముతో నాకు కూడిపోయినది. అది పక్కలో నున్న వారలందరకును తాను మురాద్ తరఫున మరల కలశముల జూపెను. అప్పుడందరును పానగోష్ఠి యొనరించి బయరాకరే దివాణపు ముంగిటికి వచ్చి,

'అరే నే పఠాన్
అరే నే నరచ్
మురాద్ కూ గులామ్
కరీమ్ కూ సలామ్
కల్లు తాగితే సేర్
ఒళ్లు ముళ్లు, కాఫిర్

నల్ల తాగుదాం ఫిర్
అల్లా హో అక్బర్'

అని పాడుకొనుచు జెండావైపుగా నడచిరి.

౨

గవ్వాల దిబ్బకు నలువంకల నున్న గుడిసెలలోనుండి వచ్చిన యొక యేబడియేండ్ల కొఱ్ఱజుట్టు ఆ జెండా కఱ్ఱచుట్టును నిలువబడెను. చెట్టుకొమ్మల సందులలో మరి వందమంది కోతుల వలె కూర్చుండి తలలో దూకుటకు చేయుచుండిరి. ఎఱ్ఱగంధము రాచిన ఆడువారి మొగములు గూండ్లనుండి అరుణ బింబముల వలె కనబడుచుండెను. వారి చేతులను గాలుపప్పలే అలంకరించెను.

మొదటి తాకిడిలో - రంగల ప్రమాణమును ఒజ్జ గ్రహించెను! రజాకార్ల గుంపు ముందు ముసలులకు తోసికొని పోవుచుండగా తాను వెనువెనుకనే నిలుచుండి—'పులుగుడ్డము వచ్చినను సరే, మీరు మీ ప్రాణముల నొడ్డి ఝండా పీకి చింపి మట్టి తగులబెట్టి పారవేయవలెను. నిజేపాయి మురాద్ వంశమువారి కరీంఝండా చేసి తేగలను. దానిని మీ దక్కడనే పాతవలెను. మనము మొదటనే దానిని మనతో తీసికొని రాక పోవుట చెడ్డ తప్పిదము. నేను దానిని దిద్దుకొని వచ్చెదను నేను లేనని మీరు పక్కబలము చూపుడు. అట్లు చూపు

వారు నేను తేబోవు తుపాకికి బలియగుదును' అని తన యింటి కేసి పరుగులిడెను.

రజాకార్లలో తెల్లగుర్ర మెక్కిన ముందు గుంపు ధైర్య ముతో 'తుపాకి తే, తుపాకి తే' అని యనుచు ముందడుగు వేయసాగెను. ఇంటికి పరుగులిడుచున్న బజ్జీకేసి వెనుక గుంపు ఆగ్రహముతో చూచుచున్నను ముందు గుంపుతో ముందడుగు వేయకతప్పలేదు.

అరే నేపఠాన్
అరే నే నరబ్
ఖండా పట్టితే విరాన్
ఝండా పీకితే పీర్

అని పాడుచు ఆ జనమంతయు జెండా దిబ్బనాక్రమించెను.

కను లెఱ్ఱబారిన గాలిబ్‌సాహెబు జెండా యెదు రెక్కి—'బద్మాష్! దుష్మన్! ఎవఁడురా యీఝండా పాతిన వాఁడు? వాఁడు తనచేతులతోనే దీని పీకిపెట్టునా లేక వాని యింటిలో గూడ ఈఝండా కట్టుమ నన్నే పీఁకిపెట్టుమని అనునా!' అని ఝంకరించుచు నలుదెసల జూచెను. గుడిసె లన్నియు కహకహ నవ్వసాగెను. ఊపి పారవైచుటకు మూల్వీ గడను గట్టిగాపట్టుకొనెను. వెంటనే చేతులు గబా లున లాగుకొని అతడు కెవ్వున కేకపెట్టెను. అతని చేతులనుండి

రక్తము కారజొచ్చెను. గడనిండ ఏవో సన్నని మేకులు! కొం దఱు పార్థను పట్టుకొని రెక్కలు విఱిచికట్టి లాగుకొనిపోయిరి

బచ్చాసాహెబు కోపముతో గడచుట్టు త్రవ్వదొడగెను. వాని తలకొక రాయి తగిలెను. రాలితోపా టతడు క్రింద కూలెను.

అంతలో చేతులు చేతులు కలిసెను, తలలు తలలు తాకెను.

ఇంద్రున కీగప్పాల దిబ్బమీద ఉత్సాహ మెందవెనేమో యనునటులు రాలవాన కురిసెను. జుట్టులేని తలలకును జుట్టుగల గడ్డములకును దురవస్థ కలిగెను. అపుడు గ్రామమునం దున్న రజాకార్లందఱను పరుగెత్తుకొని రాగడగిరి. పంచలలో కూరుచున్న పంచెకట్టువా రందరును లేచి వారితో కలియబడు చుండిరి. లోగడ ద్వేషము కలవార లందరకును ఇసుమంతయేని ప్రయాసలేకయే యిప్పుడు ప్రతీకారము నెరవేరుచుండెను. తనకొరకే యింతహడావడి జరగిపోవుచున్నదని కాబోలు ఆ జెండా ఉత్సాహముతో ఊగులాడి పోవుచున్నదో కొందల పాటుతో కొట్టుకొనుచున్నదో కాని అది ఊగుచును కొట్టు కొనుచును ఉన్నది.

రజాకార్ల కిపుడు సంఖ్యాబల ప్రాబల్యము తెలిసి వచ్చెను. 'ఒజ్జా ఇంకను తుపాకి తేలేదా?' అని రజాకొ అరవ దొడగెను.

తుపాకి మోతతోగాక తుపాకి మంటతోడనే యెదిరి బలమునకు బలముడిగెను. ఇంతలో నెంతో దూరమున నొక మోత మోగెను! మరల మోగెను.

బజ్జు వచ్చి ఒకరాతిని జెండాపై విసరెను. అతడు పనికి రాని పాత తుపాకికట్టె నొకదానిని జెండాకు గురిచేసి పట్టుకొనెను. వాని వెనుక నొకడొక టపాకాయ కొట్టెను. తుపా కితోపాటు జెండాతూటు అందరకును కనిపించెను.

'ఊఁ! మఱియొకతూరి పేల్చు, మఱియొకతూరి పేల్చుమ'ని మస్తాన్ అరచెను. మరల నొకమోత వినబడెను. ఎదిరివారంద రాతుపాకిని చూచి ఎగరోజు దిగరోజులుగా పారిపోదొడగిరి. రజాకార్లమీద కెగబడి దోచుకొన మొదలిడిరి.

తుపాకి తరచు మోగుచుండెను. రజాకార్ల గృహము లలో చెరపడిన ఆడువారి యేడుపులు వినబడుచుండెను. కొం దర యిండ్లు ధన ధాన్యములతో నిండుచుండెను, కొందరాడు వారు పొలముల కడ్డము పడజొచ్చిరి. రజాకార్లు పార్థసిగృహ మునకు నిప్పంటించిరి. దానిలో నతని నింకను త్రోసివేయక ముందే దాని ప్రక్కనున్న పెద్దపాక యొకటి అంటుకొనెను.

'అరెరే! మురాద్ గారి పశువుల దివాణ మంటుకొనెను, చల్లార్పుడు చల్లార్పుడు' అని బజ్జు అరచెను.

# 3

నిప్పచ్చరమగు బజ్జు-ఇల్లు ధాన్యపు కొట్టాయెను, ఇక నతని కొక్కసంవత్సరమువరకును నిశ్చింత.

బజ్జు తన వాకిట కూరుచుండి హుక్కాలాగుచుండెను. రజాకార్లొక రొకరేవచ్చి అతని యెదుట నొడ్డోలగ మొనరించిరి.

అపుడు బజ్జు బొజ్జ సవరించుకొనుచు 'అరే భాయీ! ఇంతటితో ఈ ప్రజలపని అయిపోయెను. మురాద్ జాహీకీ జిందాబాద్' అని అరచెను.

'బజ్జూకూ జిందాబాద్! మురాద్ జాహీకీ జిందాబాద్' అని ఆసభ్యు లందరును హర్షధ్వను లొనరించిరి.

బజ్జు మీసము మెలివేయుచుండెను. అపుడాసభ్యులలో కొందరు లేచి 'ఈయూరివారి పనియాయెను. నీపనియు నాయెను గాని మాపని కాలేదు భాయీ' అని యనిరి.

మీసము మీఁది చేతిని ముంగలికి పోనిచ్చి, బజ్జు—'ఈ యూరిలోనే మున్నదిరా పాగల్! తైదల్ జొన్నల్, జొన్నల్ తైదల్, తిరుగ వేసినను అంతే, బోర్లవేసినను అంతే! నైజాం లోనికిపోండు. బియ్యము, పియ్యము! ఇల్లు, ఇల్లాలు, బంగారము, బాయిజీ. అదిగో రజాకార్లు పిలుచుచున్నారు! పోండు రా! వెంటనే పోండు. ఈపిచ్చియూరిలో నేమున్నదిరా తైదల్ జొన్నల్! జొన్నల్, తైదల్.

రజాకార్లు నిజముగానే పిలుచుచున్నారని కొందరు వినుటకు చెవులు దోరబెట్టుకొనిరి. శుష్కదరిద్రులు పలువురు పరస్పరము మొగములు చూచుకొని 'బజ్జాకూ జిందాబాద్' అని అరచి 'మేము మా సంసారములతో ఇపుడే నైజామునకు రవాణా యగుదు'మని లేచిరి.

అపుడు బజ్జు మీసములమీద చేయివైచి 'అదీ మగవాని పని! అచ్ఛా! చలో నైజాంకు, నైజాంకూ చలో' అని పొడవైన తన మీసమును నైజాంకేసి లాగి 'చలో! నేచెప్పినటులు మీ రిప్పు డక్కడికి వెళ్లి నవాబులై కూరుచుందురు. అప్పుడెవరేని 'బజ్జు నెవడురా' అని యడుగుచో ఆకాశము కేసి చూతురు' అని అక్కడివారి మొగములు చూడసాగెను.

రజాకార్లు నాలుకలు కరచుకొని 'నై నై. నిన్ను మరచుటే? నీ విషయములో సైతాన్ కూడ నమక్ హరాం కాదు' అని అనిరి.

'అటులగుచో మరచిపోక యేమి చేయుదురు!' అని బజ్జు ఆకాశముకేసి చూచుచు చిటిక వేసెను.

మరచిపోక తామేమి చేయగలరో తెలియక రజాకారు లొకరి మొగ మొకరు చూచుకొని పిదప నేల జూచుచు నిలువబడిరి. వారిలో నొక గడుసువాడు—'హుంకూ బజ్జా ఆగే, అల్లా పీఛూ. ఖుదాకు బజ్జు ముందు, దేవుడు వెనుక' అని బజ్జుకు సలాం చేసెను.

బజ్జు పెద నవ్వు నవ్వి అరే పాగ్లా! సుమ్నా ఆగే, బజ్జా పిఛూ. అరె పిచ్చివాడా! బంగారము ముందు, బజ్జు వెనుక. డబ్బు లేనిచో బతుకెటులు? బతుకుచో బజ్జు. కాబట్టి డబ్బుకొట్టుకొని రండు! ఆటు తరువాత నేను. అనగా?' అని ప్రశ్నించెను.

ఈ 'అనగా' ఎవరికిని అర్థము కాలేదు అందరును 'యా అల్లా' అని కూర్చుండిరి. అప్పుడు బజ్జు—'అల్లా యట అల్లా? అల్లా యనుచు కడుపులో చల్ల కదలకుండ కూర్చున్నచో కడుపు నిండునా? బంగారము తెండు. బంగారములో అల్లా ఉన్నాడు. ఇదియే మీకు మంత్రము. సరే యిక చాలుగాని నామాట?' అని యనెను.

'ఓ అదియా? మాకు బంగారము దొరకవలయునుగాని నిన్ను విడతుమా భాయీ? నీ తరువాతనే మేము. మేము తెచ్చినదంతయు నీ ముంగలనే ఉంచెదము. నీవే పంచుము' అని అందరును ఒక్కరై పలికిరి.

'అచ్ఛా' అని బజ్జు లేచెను.

రజాకార్ల కచటనే కుబేరుని నిధులు కనబడెను. బహ్మ దేవుడు, అంతపాడవుగా చేతులు పెట్టలేదు గాని, అటులు పెట్టినచో వారందరచటినుండియే నిజాము నేలలోని బంగారము కాముకొనుటకు బారచాచి యుందురు.

౪

స్వయముగా మహాఘనత వహించిన మురాద్ జాహీ...

'మేము గౌరవపాత్రుడైన బజ్జు సాహెబును మహామాత్యునిగా జేయ నభిలషించితిమి. అతడు అమాత్యులను ఏర్పాటుచేసి మా ప్రజలలో విప్లవము నడగార్చి మా ప్రభుత్వమును సుప్రతిష్ఠితము చేయుగాక'

అని ఫర్మానా జారీ చేసెను.

నాటి సాయంకాలముననే గౌరవపాత్రుడు మహామాత్యుడు బజ్జు సాహెబు, మౌలా అలీని రెవిన్యూమంత్రిగను రజాఅలీని కోశమంత్రిగను చేసెను. అల్లా పిచాయ్‌ని విద్యమంత్రిగా మార్చి హిందువులకు ప్రతినిధిగా చేసెను. నిమ్నజాతులనుండి షాం బందర్‌ను మంత్రిగా తీసికొనెను.

ఈ మంత్రులందరును కలిసి ఆ మరునాటి ప్రొద్దుననే ప్రజలలో విప్లవము నడగార్చుటకు పూనుకొనిరి. యూనియన్ ప్రజలెవరును తమగ్రామమునుండి పోకూడదని ముందొక కట్టుబాటు చేసిరి.

రెవిన్యూమంత్రి మౌలాలీ యూనియన్ సరిహద్దులలో నుండు భూభాగమంతయు బూపంచ సంస్థానమునకు కలిపి, బూపంచ సంస్థానములోని కొంతపొలమును తన పొలములో కలుపుకొనెను. కోశమంత్రి రజాఅలీశాయరంతయు

దివాణమునకును చూరగొన్న ధనమంతయు తనకును ఏర్పాటు కావించుకొనెను. హిందువుల ప్రతినిధి పిచ్చయ్య పాయకారి గ్రామములోనున్న రైతుల కడనుండి శిస్తులు వసూలుచేసి వారల కిప్పుడు రసీదు లొసగుటకు వీలు లేదని కచ్చితముగా చెప్పివేసెను. నిమ్న జాతుల ప్రతినిధి పాంబందర్ నిమ్నజాతు లను పిలిచి 'మీరందరును వెంటనే రజాకార్లలో చేరుడు. మీ పొలములకు శిస్తు లేకుండ జేయుదాము' అని చెప్పెను.

వారిలో పెద్దలు లేచి 'అయ్యా మాకు పొలములే లేవుగదా! అబద్ధాల పెండ్లికి అరువది గడియలు త్యాజ్యమన్నటు లున్నది' అని యనిరి.

'ఓరి పిచ్చివారలారా! ఊరక కూరుచున్నచో పొలము లెటులుండును? పొండు! రజాకార్లలో చేరుడు! పొలములో కాలుపెట్టుడు! ఎవ డేపొలమున కాలుపెట్టునో వానిదే ఆ పొలము! ముస్లిమ్ ఫోర్సు జిందాబాద్ పొండు' అని పాంబందర్ వారల కుపదేశించెను.

హరిజనులలో పలువురు రజాకార్లలో కలిసిపోవుటవలన ప్రజలు తమకుగల ధనమును నగలను తీసికొని ప్రొద్దు గ్రుంక గనే యూనియన్ గ్రామములలోనికి వలసపోవుటకు నిశ్చయించు కొనిరి. సాహసముకలవారు కొందరు మూడు ప్రభుత్వము నేర్పా టుచేయ నుద్యమించిరి. సాహసులందరు బజ్జు చేతి టపా కాయ తుపాకీ వెదకి తమ యదృష్టమును దైవమునకు వదలిరి.

జిన్‌దార్ యంగ్ పోలీసుశాఖనంతయు తన చేతిక్రిందికి తీసికొని రజాకార్లకు రక్షకుడై నిలిచెను. సూర్యుడస్తమించెను. చీకటు లాకాశమునకు బారు పూయుగడగెను. అంతట వలస ప్రారంభమాయెను. అసంగతిచూచి అంతకుముందే రజాకార్లను వారిలో కలిసినవారును సరిహద్దులలో సాయుధులై కాపు కాయుచుండిరి.

వలసపోక అపుడు ఊరనున్నవారి కుపద్రవము కలుగ లేదుగాని నిద్ర యేమాత్రము లేదు. వారికి తుపాకి మోత మాటిమాటికి వినబడుచునే యుండెను. అనుపదమే బాలురయు వృద్ధులయు స్త్రీలయు ఆర్తనాదములు వినబడుచుండెను 'ఇది యేమి' అని ప్రతివాడును చూచుటకు లేచును. ఓహో కాయ తుపాకిమోత విని కుప్పన కూలబడును.

తెలవారునప్పటికి పటు బజ్జు ఇల్లు బంగారమాయెను. సరిహద్దులలోని శవములను నక్కలు లాగుచుండగా అచటనే గోతులు తీసి హరిజనులు వానికి అనాథసంస్కారము చేయుచుండిరి. గ్రామములో నిపుడు అపువార ప్ర జనాభారమే యొక్కట అని పటేలు చెప్పెను. ప్రజలలో శాంతి యేర్పడెనని పిచ్చుహూమాత్యుడు ప్రకటించెను.

౫

నర్మసచివుడు నజీమ్ ఆ సాయంతన సమయమున బసవన్నగౌడు ఇంటికివెళ్ళి— 'మహారాజ్! నీపంట పండినది. నవా

బుగారు నిన్ను తండ్రిగా భావించి సింహాసన మెక్కింప బోవుచున్నారు! కాటమదేవరకు ముడుపు కట్టు! కల్లుకుండకు మొక్కు. రాత్రి ప్రొద్దుపోయిన తరువాత మురాద్ జాహీమీ గృహమునకు స్వయముగా వేంచేయుదురు' అని చెప్పి నిర్గమించెను.

బసవన్నగౌడు కొడుకు గ్రామాంతరమున నుండెను. బసవన్నగౌడు మూడుకాళ్ల ముదుసలి. అతడు సింహాసన మెక్క బోవుముందు కుక్కిమంచ మెక్కెను.

మురాద్ మూలపురుషుడు కరీంహాయామములో 'కొత్తకోడంప్రు నవాబు కొకరేయి నజరానా' అను ఫర్మానా అసలులో నుండెను. పాతబడిన ఆ ఫర్మానా బజ్జు నిర్బంధముచే మురాద్ మకల అసలులోకి తేబడెను.

మురాద్ పట్టమహిషి ఫాతిమా ఈ సంగతిని మృత్యువు జుట్టు పట్టుకొనెనని గ్రహించెను. చెప్పినచో వినువాడుకాడు మురాద్. అతనికి దెబ్బతగులవలెను, అప్పుడు వినవలెను. కావున 'ఆడువారి సంఘమును పోగుచేసి మగవారి కెదురుగా నొక యుద్యమమును సాగించుచో నెంత లెస్సగనో యుండునుగదా! అది నెరవేరుచో హిందువులకును ముసల్మానులకును నడుమనిపుడు కలుగు కయ్యములు కనబడకుండ పోగలవు' అని దీర్ఘముగా నాలోచించుచుండగా కారుమబ్బులు కమ్మిన ఆకాశము పళపళమని ఉరచెను.'

హఠాత్తుగా ఫాతిమాపాదములమీద రెండు చల్లని చేతులు.

ఫాతిమా తెల్లబోయి చూచెను—గౌడు కోడలు గౌరమ్మ! బంగారపు బొమ్మ!

'ఆహా! నాకు చెల్లెలగుచో......' అని ఫాతిమా లోపల ననుకొని—'బేటీ! బెదరకు! నీవుపోయి చక్కగా గది అలంకరించు! ఊదువత్తులు వెలిగించు! ఫూల్‌దానలో పూలుంచు! అత్తరుతో గది యలుకు...' అని యిటులు చెప్పుకొనుచు పోవుచుండగా గౌరమ్మ 'ఇదేమిటమ్మా? రక్షింపుమని రాగా భక్షింతునని అనుచున్నావు' అని ఫాతిమా కేసి చూచెను.

ఫాతిమా నవ్వి 'కాదు! విను, నీకు ధైర్యమున్నచో ఆ మంచముమీదనే పడుకో, నేను సమయమునకు వచ్చి నీ మంచము మీద శయనింతును. ఆపైని ఏమి తమాషా జరుగునో చూతువుగాక!' అని యనెను.

ఇదియంతయు జరగుపని కాదనితలచినటులు గౌరమ్మ నేల చూడదొడగెను.

'ఫాతిమా కనిపెట్టి ఇది యథార్థము. నీకు ధైర్యమున్నచో నేచెప్పినటులు చేయుము. లేనిచో మీ పుట్టినిల్లు నూపేడు కూతవేటుదూరమేకదా! అటకు పారిపొమ్ము' అని చెప్పెను.

గౌరమ్మకీ రెండును అసంబద్ధములుగనే కానిపించెను. అయినను ఈ రెంటిలో మొదటిదే సాధ్యము. కావున తనకు నమ్మిక కలుగుటకు 'అవసరమగుచో నుపయోగించుటకు నా కొక కత్తి యిత్తువా ?' అని యడిగెను.

'ఓసి పిచ్చితల్లీ! విూగీత కట్టకంటె పదనైన కత్తులెచట నుండును ? పోయి దానిని దగ్గర పెట్టుకో ! అంతగా అక్కర అగునేని అదిగో ఆ చేకత్తిని గూడ మొలలో దాచుకో' అని ఫాతిమా గోడకు వ్రేలాడు నొకకత్తి తీసియిచ్చెను. గౌరమ్మ ఏనుగెక్కినట్లై వానిలో తడిమికొనుచున్నను చాటుచాటుల నక్కి ఇంటికి వెళ్ళిపోయెను.

మెరుపులు భరతనాట్యమున నుపక్రమించెను. మబ్బులు మద్దెలలు వాయించగడగెను. కారుమబ్బులు చిమ్మచీకటితెర కట్టెను.

గౌండ్లపాలెమునందలి నడివయసు వారందరును లాఠీలు పుచ్చుకొని యథాసమయమున బసవనగౌడు ఇల్లు చుట్టునున్నట్టి యొక కొట్టములో కూరుచుండిరి. వారిలో నొకడు 'మనము బజ్జు తుపాకిని ముందు లాగివేయవలెను' అని అనెను. ఇంకొకడు నవ్వి 'నేటికి తెలిసెను, అది టపాకాయలతో తుపాకి అయెనురా' అని యనెను. అంతట నందరకును ధైర్యము కలిగెను. 'నైజాములోనికి పోయిన యేబదిమంది రజాకార్లు నేడు తిరిగి వచ్చిరి; వాండ్రువచ్చిపడినచో కేవలము మనము నిభాయింప

లేము' అని మరి యొకడనెను. 'ఒరే వాండ్రకు మంచి శాస్తి జరిగెను. వారి యాలుబిడ్డల నందరను పఠానులెత్తుకొని పోయిరి. వీండ్రు అడ్డము పోయి కన్నులు లొట్టలుపడి కొందరును కాళులు సొట్టలుపడి కొందరును బండ్లమీద ఇండ్లకు చేరిరి' అని వేరొకడు చెప్పగా అచటనున్న అందరకును మూపులు మూడాయెను.

గౌరమ్మగదిలో సాంబ్రాణిపొగ యూదకవెల్లులవలె చీకటులలో పాకిపోవుచుండెను. మంచిగంధపు పరిమళము సుద్య భాండమును సుదార్ చెప్పుచుండెను.

అప్పుడు ఫాతిమా బసవగౌడుగారి వేషము తాల్చి తాటాకుల గొడుగులో గౌరమ్మ ఇంటి ముంగిటికి వచ్చెను. అరగుపై కుక్కి మంచములో కుళ్ళుచున్న బసవన్న కనులెత్తి చూచెను. కొడుకు [illegible]!

బసవన్నకు సగము బరువుపోయెను. 'ఇంత ప్రొద్దుపోయి వచ్చితివి! ఇప్పుడేమిటిరా? నాయనా! వెచ్చగా పడుకొమ్మని అతడు తన మిగిలిన బరువును కూడ పోగొట్టుకొనెను. కాటమయ్య వేషములోనున్న ఫాతిమా ఆ సాంబ్రాణిపొగలనుబట్టి సూటిగా గదిలోనికివెళ్ళెను. గౌరమ్మగుండెలు ఝల్లుమనెను. ఎదుట మగడు! ఆమగడు వేషము తొలగించెను. ఫాతిమా!

పలువురు రజాకార్లతో రెండువందల టపాకాయలతో ఒక తుపాకి కట్టెతో బజ్జవచ్చి వానను తిట్టుకొనుచు బసవగౌడు

ఇంటిచుట్టును కాపెను వేసెను. మరికొంతసేపటికి మహాఘనత వహించిన మురాద్ జాహి బసవనగౌడు వాకిటినుండి వచ్చు అగలుపొగలకు సొగసి ఒక్క అంగలో గదిలోనికిపోయిపడెను. ప్రక్కమీదినుండి పామువలె ఫాతిమా లేచెను.

మురాద్ కుప్పున కూలబడెను. వాకిట బజ్జు లేచెను, రజాకార్ల తలలు పగిలెను. టపాకాయలు వింతగా మోగెను. బజ్జు వానలో బద్ధుడాయెను.

అప్పుడు ఆ కూడెములోని కొందరు బజ్జు తో కత్తులతో బసవగౌడు గదిలో ప్రవేశింపబోయిరి. ఫాతిమా ద్వారమున కడ్డముగా నిలిచి 'ఎం. ఐ. ఎస్. ఓ'ను అప్పీలు పోలీసొకన్నదే మీరు మా నిజాంగారిని బందిగా చేయుటలేదే' అని అడిగెను.

సరిగా అదే సమయమునకే—'నిజాము హిందూస్థాన్ సేనలను తన సంస్థానములోనికాహ్వానించెనని రేడియో చెప్పెను.

వానలో వాకిట పడియున్న బజ్జు 'నిజాం గారికి ఒక కన్ను హిందువు; ఒక కన్ను ముసల్మాన్' యని యరచెను.

లోపల పడియున్న మురాద్, 'నేను కంఠమువరకు హిందువును, ఆపైని ముసల్మానును' అని అందరకును సలాము కొట్టి మరల నమస్కారము చేసెను.

# ఊరిబడి

## తెలవారుజాము

పాలకుండలు స్తుత్యగీతవాద్యములతో మేజువాణి చేయు సమయమున తిరుమలాచార్యులు శ్రీ సంపాదించుటకు వడి వడిగా బడికిఁ బయలుదేరెను. రెడ్డిగారి అరుగుమీఁద బడి.

అతఁడరుగెక్కి చూచెను. చీకటిలో ఏమియు నతనికి కనఁబడలేదు. అతఁడు గోడలు తడిమిచూచెను. ఎవరును లేరు. శ్రీ యంతయు తనకే యుంచారా అనునట్లతఁడు సంతసించెను. రెడ్డిగారి కొడుకును పిలిచెను. ఎవరును పలుకకుండుటచే అతఁడు కూరుచుండెను. శ్రీ మదము నెత్తికెక్కినట్లతనికి కునికిపాటులు వచ్చెను. నిద్రాదేవత అతనిని భూశయనము చేయించెను.

ఊరిచివర నున్న యొక్క యింటిలో జనార్దనము ఉలికిపడి లేచెను. చీకటులు పారిపోవుచు వెనుదిరిగి చూచుచున్నట్లుండెను. జనార్దనము శ్రీ సంపాదించుకొనుటకు ఇంతకచ్చికను బలపముల సంచిలో నించుకొని నీరు సిరాబుడ్డిలో పోసికొని బడికిఁ బయలువెడలెను. కాని తన శ్రీ యంతయు దోచుకొని యొకఁడచటఁ బరుండియుండెను.

జనార్దనమునకు ఒడలు మండిపోయెను. జనార్ధనము కాలు తిరుమలాచార్యులమీఁద మూరెఁడెత్తు లేచి ఆఁగి పోయెను. అప్పు డతనికి ధర్మయుద్ధము చేయవలెయునని సద్బుద్ధి పుట్టెను. ఎత్తినకాలు దించి జనార్దనము పలుదోముకొనుచుఁ గూరుచుండెను.

పలుదోముకొను సమయము ఆలోచనలకు పుట్టినిల్లు గదా! అతనికి అనేక-ఆలోచనలు కలిగెను. అతఁ డాయాలోచనతో క్రిందట్టుమీఁదట్టయి యుట్టునకొనెను. 'తిగుపులిగాక్షి తన్నగూడదు; యుక్తి పన్ని వీడి శ్రీ లూటీచెయ్యాలి.'

జనార్దనము కొట్లాఁ డయినను మెప్పుకొనఁదగినవాఁడు. ఏలయనఁగా సర్వానువారి పశుబల ప్రదర్శనము రోసి స్త్రీ దగ్గఱ బుద్ధిబల ప్రదర్శనమునే యతఁడు స్వీకరించెను. ఆ బుద్ధిబలప్రదర్శనమునకు ముందది దర్శితముగాక!

ఇంతట రంగము రొంజుకొనుచు ఒడికి వచ్చెను. రెండవ దృశ్యము లాంబాలిక యచటఁ గనఁబడెను. అంత నాబాలిక తన యప్ప ముద్దునకున్ను తనకు నేర్పిన కొన్ని సుశీలములను ఆ యప్పమీఁదనే దగ్గ కూఁడఁబడెను.

జనార్దనము గడగడగా సిరంబుడ్డితో ముఖము కడిగి కొని నవ్వె—'రంగీ' నిన్న అటుకులు పెట్టలేదు కాదూ, చూస్కో ఇవ్వాళ నీ చెయ్యి ఎల్లా పేఁకొటతానో. నాది శ్రీ ఆపడకమోతుడి చుక్క. నీది దెబ్బ కాస్కో?' అనెను.

దెబ్బలుకొట్టు అధికారము ముందరగా వచ్చిన వానిది. జనార్దనము బాలురను మర్దించుటకు సర్దారు. అట్టి జనార్దన మిట్లు లనఁగనే రంగమ్మగుండెలు గుభేలు మనెను. ఆబాలిక అప్పుడేడ్వవలసిన యే డ్పిప్పుడే యేడ్చి 'నేనిహ బడి మానేస్తాను' అని యింటిదారి పట్టెను.

జనార్దన మిటు లనెను—'పోనీ కొట్టనులే. నాదే శ్రీ అని పంతులుగారితో చెపుతావా?'

రంగమ్మ రంయిన వెనుదిరిగి యిటు లనెను—'శ్రీ నీది కాదా యేమిటి?'

జనార్దనము రంగమ్మను తన అంతరంగకోటిలో చేర్చుకొని యిన్నదున్నటులు చెప్పి — 'నీవు నాదే శ్రీ అని చెప్పు! అలా చెపితే ఈవేళే కాకుండా ఎప్పటికీ బెత్తం ఎత్తుగా ఎత్తి నీ చేతిమీద మెల్లింగా ఆనిస్తూ ఉంటాను' అనెను.

'నిజంగా?'

'నిజంగా.'

'భేష్ భేష్ అల్లాగే. నీదే శ్రీ అని చెపుతాను.'

అంతట బాలు రొక రొకరే రాఁదొడఁగిరి. రంగమ్మ వచ్చిన ప్రతిబాలుని కడకును వెళ్లి జనార్దనముది శ్రీ; తిరుమల య్యది చుక్క; నాది దెబ్బ అని చెప్పి తన సాక్ష్యమును వల్లించుకొనుచుండెను.

బాలు గండలును వర్ణసాంకర్యము లేకుండ కలిని దండించుచుఁ గూరుచుండిరి. జనార్దనము పలకమీఁద ఇటులు వ్రాయుచుఁ గూరుచుండెను:—

'జనార్దనం—శ్రీ

తిరుమలాయి—చుక్క

రంగి—దెబ్బ

ఉళక్కు—రెండు......'

ఇటులు క్రమక్రమముగా ఆపలక నిండుచు వచ్చెను.

---

## ప్రాతఃకాలము

కరకర ప్రొద్దు పొడిచెను. కర్మసాక్షి సాక్షిగా రావులపాటి రాజయ్య పంతులుగారు చెలువుకట్టమీఁదఁ గూరుచుండి మూరెఁడు పుల్ల నోటఁ బెట్టుకొని జేనెఁడు చేసి అయిదారు చెంబులతో ముఖమండలమునకు తాత్కాలిక సత్కారము చేసిరి. ఒడ్డున నున్న దొడ్డిలోనికిఁ జని ప్రొయిలో నున్న విలువలేని ఒకానొకపదార్థముచే తమ ముఖమునకు విలువ కల్గించుకొనిరి. తూరుపుగా తిరిగి చేతులు దగ్గఱకుఁ దెచ్చి సూర్యుని ప్రార్థించిరి. పిమ్మట గజగమనముతో బడికి బయలుదేఱిరి.

తిరుమలాచార్యులు తన చేతిలోని పలకను లాగికొని చెఱిపివేయుటచే పశుబల ప్రదర్శనము కూడదనుకొనిన జనార్దనము చేతులే కాక దంతములుగూడ ఉపయోగింపవలసి వచ్చెను. జనార్దనము యోగించిన ఆయుధములే కాక తిరుమలాచార్యులు కలములను పలకలను ఉపయోగింపవలసి వచ్చెను. రంగమ్మ జనార్దనమునకు బాసటయై చేతినున్న దస్తరము లందిచ్చుచు పడెయ్ పడెయ్ అనుచుండెను. బడి యంతయు రెండు తెగలుగా చీలి వారి యిరువురకును జయజయ నాదము లుగ్గడించుచుండెను. ఇటు లాపాఠశాల యంతయు సంతపాలై నుండెను.

పంతులుగారు మెల్లగా వచ్చి ఖర్జూరపు ఆకు చాప మీదఁ గూరుచుండి గోళాకారములయిన ఎఱ్ఱని గ్రుడ్ల నొకతూరి అటు త్రిప్పఁగనే ఆ సంతయంతయు పూర్తయి పోయెను. పంతులుగారిచూపు బడిలోని బాలురకే కాక ఊరిపెద్దలకుఁ గూడ—ధూమకేతువు.

లా, అడ్డరులు చక్కఁబడఁగానే బడిపెద్ద యగు ఎల్లమంద

'సరస్వతి ! నమ స్తుభ్యం వరదే కామరూపిణి !
విద్యారంభం కరిష్యామి సిద్ధి ర్భవతు మే సదా'

అని యొక్కొక్క పాదమే చెప్పఁగా మిగిలినవారందఱును అనువదించుచుండిరి.

రాజభక్తికీర్తన లప్పటి కెవరును కనిపట్టి యుండలేదు. గురుభక్తి కీర్తనలు కలవు కాని అవి గ్రంథములందును బెత్తము లందును మాత్రమే కలవు. గతిలేక వారిటులు సరస్వతిని ధ్యానించి నిమ్మకు నీరెత్తినటులు కూరుచుండిరి.

అంతట పంతులుగారు ఉత్తరీయపు కొంగుముడి విప్పి తాటాకులసంచినుండి ముక్కద్దములు తీసి కన్నులకు కళ్లెము తగుల్చుకొనిరి. బడియందలి పరమశాంతివలన పంతులుగారు వచ్చిరని గ్రహించి పొరుగింటినుండి పొన్నాడనాగయ్య మడిసంచితో వచ్చి కూరుచుండెను.

బడికి రాఁగానే రామకోటి వ్రాయుట పంతులుగారి మొదటిపని. నన్నయ్యకు నారాయణభట్టు వలె పంతులుగారికి నాగయ్య సహాలేఖకుఁడు.

పంతులుగారి రామకోటి దస్తరము తెచ్చుట బండ సుబ్బని పని. ఆ బండసుబ్బఁడు గైర్‌హాజర్. పంతులుగారు వాని కొఱకు చూడఁగనే జనార్దనము తడిగోఁచి తాల్చి మూలలోని దస్తరము తెచ్చి ఆనల్లనిపుణ్యమును బయటఁబెట్టెను.

అంతట నాగయ్యయును నువ్వులు పఱచినటులున్న తన రామకోటిని విప్పెను. వారిరువురును ఇటులు సిరాకాగితముల మితవ్యయముతో అనల్పమగు పుణ్యశిల్పమును చేయుచుండిరి.

బాలురందఱును మౌనముద్ర తాల్చి తమ ముఖకత్యమును హస్తపాదాదులతో నెఱవేర్చుకొనుచుండిరి. జనార్దనము

మెల్లగా పాఱిపోయి బుడిపెలుగల ఈఁతబరికె చేతికి దొరకించుకొనెను. తిరుమలాచార్యులు బస్త్రవ లాగుకొనెను. శ్రీకంటె చుక్కకంటె దెబ్బకంటె వేఱయిన దొకటి తనచేతికి అంటుకొనుటచే జనార్దము కెవ్వుమనెను.

ఆకేకచే నాగయ్యరామకోటిమీఁద అప్రయత్నముగా రామభక్తాగ్రేసరుఁ డయిన ఆంజనేయులవారి లంకాదహనము నాఁటి తోఁక యొకటిచిత్రింపఁబడి పోయెను. రిప్పున మొగ మెత్తఁగనే పంతులుగారి కన్నెము పుటుక్కుమని తెగెను. బాలు రందఱును జరుగఁబోవు ప్రమాదమునకు వెంటనే జాగ్రత్తపడ్డ నిశ్చయించుకొనిరి.

పంతులుగారు మీసములలో చిక్కుకొనిన అద్దములను నేర్పుగా తీసికొనకముందే జనార్దన మిట్లనెను—'నాది శ్రీ అయినా తిరుమలాయిబెత్తం లాక్కుంటున్నాడు చూడండి.'

జనార్దనము తనను సాక్ష్యము కోరకముందే రంగమ్మ లేచి తనసాక్ష్య మొప్పగించెను. పంతులు ముక్కద్దములు క్రిందఁబెట్టి 'ఆమాట నిన్నెవ రడిగారు? ముందు నివ్వెట్టారా' అనిచూపుడు వ్రేలాడించెను. రంగమ్మగుండెలు కొట్టుకొనెను. రంగమ్మ నిలువఁబడినచోటునుండి ఒక యంగుళ మేని కదలలేదు. 'రమ్మంటే రావేం' అని పంతులు కాండ్రుమనెను. రంగమ్మ బావురుమని కూర్చుండెను.

ఇట్టి అరాచకపు సమయములందు స్త్రీలకుఁగూడ పోలీసు ఉద్యోగములు తరతరముల నుండియు వాక్కుభుక్తములలో నున్నవి. కావున ఆబాలికకు దాపటను వెలుపటను ఉన్న ఇరువురు బాలికలు శాసనసమ్మతముగా రంగమ్మచట్టల క్రింద చేతులు వేసి శ్రీకృష్ణభగవానులు కుబ్జకుఁ జేసినపని చేసిరి. పిదప తమ వాక్కులో కీపపాలేని పోఁగొట్టకొనకుండ రంగమ్మను ముందుకు నడచునటులు చేయఁదొడఁగిరి. కాని పంతులుగారి తేజస్సు ఆనడిపించువారి శక్తికంటె దొడ్డది. అది రంగమ్మను వెనుకకు నెట్టఁజొచ్చెను. దానివలన రంగమ్మను రక్షణలో ఉంచుకొనినవారు వెనుకకును ప్రక్కలకును చెదరిపడుచుండిరి. ఈరీతి నానావానావస్థప్పులతో వారు మూవురును వర్ణసాంకర్యము కలిగించి కొందఱ మెడమలమీఁదుగా దస్తావేసి నాగయ్య రామకోటి మీఁదను శరీరముమీఁదను సిరాచిమ్మి రామునిదయ వలన తమకు మాత్రము దెబ్బ తగులకుండ నాగయ్యను శయ్యగాఁ జేసికొనిరి. ఉపాధ్యాయులవారు సాహసించి ప్రక్క అరుఁగుమీఁదికి లంఘించిరి. ఏలనఁగా వారపుడు రామకోటి మడిలో నుండిరి. మైలపడిన తరువాతఁగాని వారిని శిక్షింప వీలు లేదు.

బాలికలు తనమీఁద పడినందులకు నాగయ్య యిసుమంతయు కినియలేదు. కాని తానును రామకోటియు మైలపడుటవలన నతఁడప్పుడుపయోగించిన మాటలు ఎన్నఁడును

విన్నవి కావుకావుగ బాలు రెండఱును పంతులుగారున్నారను మాటగూడ మఱచి పొట్టలు చేతులతోఁ బట్టుకొని పకలఁ బడఁగనే నాగయ్య రామకోటితో చెఱువుకుఁ బరువెత్తెను.

ఒకయపరాధమున కిటులు రెండుమూఁడుపిల్లలు పుట్టుటచే తాము మైలపడకుండ పంతులుగారాబాలికను బెదరింపఁ దలఁచి ఈఁతబరికెకొనను ఎడమచేత సవరించి ఫెళ్లు మనిపించిరి. బెత్తము తాఁకకముందే రంగమ్మ బావురుమని వెనుకకు విఱుచుకొనిపడి తన్ను పట్టుకొనినవారికిఁగూడ ఆ ఉత్సవమున భాగము పంచిపెట్టెను. ప్రక్కలఁబడిన బాలికలు రివ్వున లేచి తమబలమును ఇతోధికోత్సాహముతో ప్రకటింపగనే రంగమ్మ— 'జనార్దనం తనదే శ్రీ అని చెప్పుచున్నాఁడండి.' అని అనెను. ఈమాటలు వినుచు జనార్దనము రంగమ్మ మీఁద నిప్పులు కురిపించెను.

'ఏమిరా జనార్దనమ్! ఈమాట నీవన్నావా లేదా?' అని పంతులుగారడిగిరి.

'ఉత్తది, ఉట్టిది.'

'అయితే ఇంతకూ శ్రీ యెవరిది ?'

నేను ముందొచ్చి పళ్లు తోముకుంటుంటే తిరుమలాయి వచ్చి నిద్దరోయాఁడండి' అని జనార్దన మనఁగనే తిరుమలాచార్యులు లేచి—'అల్లాయితే నేను రాంగానే వంచేశానో చెప్పు'

అనెను. జనార్దన మిపుడు బుద్ధిబలము నుపయోగింప నాలోచింపఁదొడఁగెను. దాని కందఱును వెంటనే సంతసింపఁదొడఁగిరి.

'నీదే శ్రీ' అని పంతులుగారప్పటికి చెప్పి బడిని ఆపూఁ టకు ముగించి అందఱును చలిదియన్నమునకుఁ బోవ నియమించి రామకోటిని పూర్తిచేయుటకుఁ గూరుచుండిరి.

పంతులుగా రొకటి రెండుతూరులు వీథిలోనికి వచ్చి చూచిరిగాని నాగయ్యదర్శనము లేదు. పిలిచిరిగాని పలుకు లేదు. ఇటులు నిస్పృహాకులై వా రొకరే మెలమెలగా తమవిధిని అనుష్ఠింపఁదొడఁగిరి.

## మధ్యాహ్నము

బాల బాలిక లందఱును అన్నము తిని జట్లుగను ఒంటి యొంటిగను వడివడిగా బడికి బయలుదేఱిరి. ఏలనఁగా శ్రీ చుక్కల రహస్యమును తెలిసికొనుటకు వారినోరూరుచుండెను.

ఆపూఁట వారికి సామాను ఎక్కువ. ఎడమచేత నొక కొయ్యపలకయు పెద్ద - లేక చిన్న - బాలశిక్షయు, కుడిచేతిలో సెనగపప్పో కందిపప్పో అటుకులో యేదే నొక తినుబండము, వెనువెంట భూమిమీఁద నాలుగయిదు కుక్కలు, ఆకాశమున పది పదియేను కాకులు.

అప్పుడు నాగమ్మ ముష్టియెత్తుకొనుట ముగించి కట్టె పొదుచుకొనుచు ఇంటికిఁ బోవుచుండెను. నాగమ్మ కెనుబడి యేండ్లు. ఆమె తనమగని నెఱుఁగదు. కాని ఆమె తనమగని గుఱుతుగా క్రిందటి యేఁటివఱకును తలవెంట్రుక లుంచుకొనెను. నాగమ్మ తనమగనిగుఱుతును విడిచి యిటులు సనాతనమత మవలంబించిననాఁటనుండియు 'కొబ్బరికాయ' అను బిరుదు వడసెను. ఇట్టి నాగమ్మ విద్యాబుద్ధులను నేరికొనుటకు బడికరుగుచున్న యీ బాలురను చూచి చూడనటులు చూచి తలకొంగు ముందుకి లాగికొనుచు వడివడిగా అడుగులు వయిచెను.

సత్తినాగులు పాపకాలును లాగి—'కొ కొ కొబ్బరి ముక్క పెట్టవురా?' అని ధాటిగా అడిగెను.

'కొబ్బరి యేమిచుండిరా? చెనగలు' అని పానకాడెను.

ఈబిరుదు వినఁబడఁగనే నాగమ్మ కెందు మనసుగుండుట ఆరదు. అయినను ఆమె యీమొదటితప్పును క్షమించెను.

దవ్వుగా నున్న పర్వతాలు 'ఆచెనగలలో కొబ్బరి కలపు' అని అఱచెను.

'నీ తలకాయగల' అని నాగమ్మ నోరు విప్పి నిఘంటువులలో లేని కొన్ని సుభాషితములను ప్రచారములోనికి తీసికొని రాఁగనే బాలబాలిక లందఱును గలసి—

'నాగమ్మనాగమ్మ-బోడినాగమ్మా!
నాగమ్మతలకాయ-కొబ్బరికాయా!'

అని పాడి తమకవితాప్రతిభను వెల్లడించిరి.

నాగమ్మ ఊరకుండలేదు. కసుచూపు మోములో దేవుఁడిచ్చిన ఆయుధములను ప్రయోగము చేసి ఈయెనుబదేండ్ల యేటఁగూడ తన శరీరవైధవ్యమునకు ఫలితమయిన లక్ష్మీసిద్ధిని బాహుశక్తినిగూడ బాలు రందఱకు నగపఱిచెను. ఇటులు నాగమ్మ మొద్దగలు తిని వా రందఱును బడికి పరుగెత్తుకొని పోయిరి.

పంతులుగారు వచ్చుడే రాముకోటిని ముగించుచు-'బండ సుబ్బఁడు రాలేదా?' అని అడిగిరి. రాలేదని వినఁబడఁగనే బండ సుబ్బఁడు చేయవలసిన పనులను పానకాలుకు అప్పగించిరి.

బండసుబ్బని పని తనకు దొరకఁగనే పట్టరాని సంతోషముతో పానకాలు పొంగిపోవుచుట్లాడెను పనిగత్తె. అది అందఱు కానిచుండెను. పానకా లదిచూచి గంభీరుఁడై చెను. వీలయినంగా గురుభక్తి తెలుపుటకు కన్న మంచిసమయము పానకా లిటులు తమ దాకాలనుకును పనిచేసితేఁగనే బాలు రొకరొకరే పలకలతో వచ్చి పంతులుగారిముందు నిలువఁబడిరి. పంతులుగారు ఒకొక్క పలక పుచ్చుకొని—

క. ఇంతలు బదరీఫలములు
ఇంతలు మా రేడుబండ్లు ఈడకు జోడా...'

అని చదివికొనుచు పెద్ద పెద్ద అక్షరములతో ఒరపడి పెట్టి పంపుచుండిరి. కొంతవడికా పని ముగియఁగనే చింతబెత్తము తెప్పించి దాని మొదలును సూదివలె చెక్కి పంతులుగారు జనార్దనుని తిరుమలాచార్యులను దాపునకుఁ బిలిచి—'శ్రీ యెవరిది?' అని యడిగిరి.

జనార్దనము బెదరుచు 'నాదే' యనెను. తిరుమలాచార్యులు 'నాది' అని ఖంగున పలికెను.

'వెధవ! నీ దెట్లా అవుతుంది? సిద్ధగాకో నీ శ్రీజనార్దనం కొట్టుకోపోతే' అని పంతులు జనార్దనము - అఱచేతిని తనయొడమ అఱచేతిమీఁద పెట్టించి బెత్తము మొదలును ఈఁతబెత్తముచే చీకుకొనిపోయియున్న అఱువడిలో గ్రుచ్చి, యెన్నఁటికిని మాయని శ్రీ పెట్టిరి. పిదప 'నీకు శ్రీ కావలెనా?' అని తిరుమలాచార్యుల నడిగిరి. 'వద్దు' అని అతఁ డనఁగనే తన చేతికిఁ గలిగిన స్పర్శవలన ఆనాఁడు శ్రీకంటె చుక్కయే దొడ్డదని అతఁడు తెలిసికొనెను. పిమ్మట రంగమ్మచేయి శ్రీలో సగముసౌఖ్య మనుభవించెను. పిమ్మట దెబ్బలుకొట్టునధికారము తిరుమలయ్యకు సంక్రమించును.

హనకాలు దిగ్విజయము చేసికొనివచ్చి తిరుమలాచార్యులదెబ్బలకు అలితుఁడై ఒకమూల కూరుచుండి కాలి బొటనవ్రేలిలావునను జేనెఁడు పొడవునను చుట్టలు చుట్టి గురుదక్షిణ యిచ్చెను. పంతులు సంతసించి 'పొగాకు 'ఎక్క

డిది!' అని అడుగఁగనే ఆప్రశ్నకే మొగమువాఁచుకొనియున్న పానకాలు 'మాదుకాణములోనిదే చాటుగా తెచ్చాను' అని తన హస్తకౌశలమును తెలుపుకొనెను.

'ఎక్కడి సరుకు?'

'కిష్టయ్యగారి పాటితోటలోది'

'గుమ్మడితోటలో దేమయినా పట్రమ్మని బండసుబ్బడికీ చెప్పాను, నీకూ చెప్పాను. ఏఁలాభం?'

'వీడితో మీరు చెప్పలేదండీ; పానకాలుకు చెపితే ఇన్నాళ్లా?'

'సరలే రేపు చూడు; అయితే ఇంటిలో నీవేమిగా దాఁచుకోలేదు గద?'

'లేదండీ లేదండీ' అని పానకాలు లేచి బట్టలూ దులిపి నగ్నమయిన సత్యమును ప్రకటింపఁగనే పంతులుగారు చుట్టను నోటఁబెట్టుకొని, రెడ్డిగారి కుమారుఁడు ఇంటిలోనికిఁ జని కొఱవి తెచ్చెను. పానకాలిత్తడిచెంబిచ్చెను. పంతులుగారు ఆహ్నికమునకు వెళ్లిరి.

పొన్నాడ నాగయ్య చెఱువునుండి యింటికి మరలి మఱచి వచ్చిన సిరాబుడ్డికి బడిముందరకు వచ్చెను. పంతులుగారు లేరని తెలిసిపోయెను, అట్టి సమయమున తానచటకొంటరిగా వెళ్లుట తనకును తన సిరాబుడ్డికిని అంత క్షేమమయిన పని కాదనుకొని అతఁడింటికే వెళ్లిపోయెను.

## సాయంకాలము

బడిచిన్న యగు బాపులు తొంగిచూచి చేతులు త్రిప్పి కంఠమును అడఁచుకొని అడఁచుకొని ప్రకటించిన స్వరవిశేషముచే పంతులవారు వచ్చుచుండి రని ఇంటఁజనము తెలిసెను. అంతట బడి యంతయు గప్ చుప్ అయిపోయెను.

భుక్తాయాసమును మడిబట్టచే పోఁగొట్టుకొనుచు పంతులుగారు అరుదెంచిరి. కరసహాకారముచే కాల్చినది మైలబట్ట. ఎంగిలి కాకుండ అంగిటిలోనికి విసరివేసికొనునది మడిబట్ట. వారు మడిబట్టను మడిగానే విసర్జించి తాము తెచ్చికొనిన చెంబెఁడు నీటితో గళక్ గళక్ మనిపించి లోనికి వచ్చిరి. పానకాలు చాఁప దులిపి గద్దించుటతో అయ్యవారికి శయ్య యేర్పఱచెను. పంతులుగారు ఉత్తరీయము పఱచఁగనే అందఱును ఇండ్లకు వెళ్ళిరి. పంతులుగారు కనులు మూయఁగనే మూలుగుచున్న నిద్రాదేవి వారి నావేశించెను. వారు గుఱ్ఱు కొట్టుచు నిదురించిరి.

పంతులుగారి ఉదరగోళమునుండియో లేక దహారాకాశమునుండియో కాని తిత్తిమ్రోఁతలు బయలుదేఱి రాటపుమ్రోఁతలుగా మాఱఁదొడఁగెను. రెడ్డిగారి యింట దూది యేకించుచుండి రనుకొని దూదేకుల సాహెబు కొడుకు కొందఱు వచ్చి హతాశులయి వెళ్ళిరి. నడుమ నడుమ రాయియు రాయియు కొట్టుకొనినటులును మబ్బు లుఱిమినటులును వినఁ

ఖణఁదొడఁగెను. కొంత వడికి ఈధ్వను లన్నియు నాఁగిపోయెను. గాలిమర పుప్పుస మొకింత విశ్రాంతి దీసికొనెను.

పంతులు గారి కప్పుడు పరివర్తనై కాదశ. వారు ఈప్రక్క నుండి ఆప్రక్కకు పొరలిరి. మఱియొక నిమిషములో విచిత్ర ధ్వని యొకటి బయులుదేఱెను.

రెడ్డిగారియింట తన యిజారాలో నున్న పాలకుండలను కొల్లగొట్టుటకువచ్చి తనజాతిలోని దొకటి తనను ధర్మయుద్ధము నకు రమ్మని గర్జించుచున్న దేమో యని తలఁచి గోడమీఁదినుండి గండుఁబిల్లి యొకటి అమాంతముగా పంతులుగారి ప్రక్కకు దూఁకెను. పాపమాపిల్లి భూమ్యాకాశములు వెతకెను. తన దిను నెచటను లేదు. అది యంతట విస్తుపోయి ముంగాళ్ల మీఁద నిలిచి పంతులుగారి ముఖమును నిరీక్షించుచుండెను.

అంతలో ఆధ్వని మాసెను. పిల్లి ఆత్మరక్షణ మొనర్చు కొనుటకు సిస్సుకునెను. కాని దాని విరోధి జంతువు దానికి కానరాలేదు.

రెడ్డిగారి యింటికుక్క యింటినాలుగుమూలలు పరికించి వచ్చెను. దాని జూచి పిల్లి చెంగున గోడమీఁది కెగిరెను.

మోర యోరగాఁబెట్టి ఆకుక్క పంతులుగారిని జూడఁ దొడఁగెను. ఉఁహూఁ. దానికిని ఈముడిపడలేదు. తుదకది మోర ఆకసముమీఁది కెత్తి పంతులుగారి ధ్వనితో తనధ్వనిని అప్రయత్నముగా కలిపెను

బాలురొక్క రొక్కరే వచ్చి యీతుక్కును బయటికి గొట్టిరి. క్రమక్రమముగా అరుగు నిండెను. అంత పంతులుగారేమియు నెఱుఁగనటులు లేచి 'పిల్లలందఱూ వచ్చారా?' అని యడిగిరి.

బడిపెద్దయగు ఎల్లమంద లేచి—'బండసుబ్బఁడు, నత్తి నాగులు, ఉళక్కి, పాతాళంగాడు, పర్వతాలు, జనార్దనంగోరు, రంగమ్మగోయ, చుక్కమ్మ, సుబ్బి: వీరిరువురును రంగమ్మను నెత్తుకొని వచ్చినవారు. ప్రొద్దునఁ గలిగిన అలసటకు వీరీపూఁట గైరుహాజరు. వీరు రాలే' దని చెప్పెను.

వీరిని పట్టి తెచ్చుటకు వెంటనే హుకుమాయెను. అబద్ధాలు, సత్యం, గున్నయ్య మొదలగు కొందఱు యోధులతో ఎల్లమంద దాటి వెడలెను.

జనార్దనుతండ్రి వారితో నిటులనెను—'బళ్లోకి ఈపూఁట జనార్దనమే కాదు, నేనూ రావాలి; పంతులుగారి సంగతి కనుక్కోవాలి.'

ఈయోధుల కీమాటలు చాల ఆశాజనకములాయెను. కాని అబద్ధాలిటు లనెను—'ఈ పెద్దముండావాళ్లు ఇల్లాగే అంటారు కాని చివరకి వాళ్లు పంతుళ్లను కనుక్కోక పోవటం అటుండఁగా బళ్లోకి పోవేమని తామే మళ్లా పిల్లల్ని కఱ్ఱచ్చుకుని వెంటడతారు?'

అంతట వారు బండసుబ్బనికొఱకరిగి దుకాణముమీఁద నున్న గురివిసెట్టిని జూచి అతని మరియాదను, తమ మరియాదను నిలువఁబెట్టి— 'సుబ్బిసెట్టియేఁడీ!' అని యడిగిరి.

'బళ్లో బండకొయ్యలో కూకున్నాఁడేమో అనుకున్నాం. అన్నంకూడా తినలేదు నాయనా! కొంచెం వెతికిపెట్టండి' అని గురివిసెట్టి యనఁగనే వారందఱును ఒకరి నొకరుచూచి కొని వీథిలోనికి వచ్చి ఒకచిన్న సభ చేసి రెడ్డిగారి మామిడి తోఁటలోనికిఁ బోయి చూచిరి. తోఁటమాలి లేఁడు. మామిపిందె లపుడప్పుడే ముదురుచుండెను. వారందఱును చెట్లెక్కి యింకొక్క పదార్థమును నములుటకు వీలుకలుగకుండఁ జేసికొని దిక్కులు చూచుచుండిరి.

'అడుగో బండసుబ్బఁడు' అని ఎల్లమంద యనెను. 'ఎక్కడెక్కడ!' అని అయిదారు కంఠములు మ్రోఁగెను. 'అడుగో గుమ్మడితోఁటసట్టనడుము!'

అందఱును క్రోఁతులవలె క్రిందికి దిగిరి. వంగి కొంత దవ్వును, కూర్చుండి కొంతదవ్వును, పొట్టమీఁద ప్రాఁకి కొంత దవ్వును వెళ్లిరి.

గుమ్మడితోఁట యను పేరుగల ఆపొగాకుతోఁట చక్కఁగా పిలకతొడిగెను. గురుభక్తి గల బండసుబ్బఁడు ఎన్నికయగు వాని నేరి ఒకొక్క ఆకేకోయుచుండెను. అపు డయిదారు

శరీరములు తన మీఁదఁ బడుటచే నతఁడు తోఁటకాఁపు లను కొని రెండు విదిలింపులు విదిలించెను. ఈ యోధులందఱును తోళ్లవలె నేలకుఁ గఱచుకొని లేచి—'మాస్కో అయ్యవారికి చెప్పకపోతే' అని అదలింపఁగనే అతఁడు సులభముగా లొంగి పోయెను.

పిమ్మట బండసుబ్బఁడు, కోసిన యాకును పచ్చితాటాకునఁ గట్టుకొని తానును ఒకయోధుఁ డాయెను. వీరందఱును కలిసి వెళ్లి బల ముపయోగింప నక్కఱలేని బక్కవారిని వెంటఁ బెట్టుకొనియు, ఉక్కుముక్కలవంటి ఉళక్కి మొదలగువారికి పాదబల ముపయోగించి ముందుంచుకొనియు బడికి నడచిరి.

చెప్పుమన్న రంగులపద్యముల నాఁపివేసి పంతులుగారు బండసుబ్బని బహుమతిని స్వీకరించి మిగిలిన వారికి గోడ కుర్చీయో, బండికొయ్యయో, కోదండమో, నిలువుజీతమో తగిన యొకబహుమతి నొసంగిరి.

అంతట బాలు రెక్కములు చెప్పుటకు లేచిరి. అప్పుడు గ్రామములోనివా రొకరిద్దఱు వచ్చి పంతులుగారిచే దస్తావేజులు వ్రాయించుకొనిరి. అది ముగియఁగనే పంతులుగారు లేచి—

దీపం జ్యోతిః పరంబ్రహ్మ దీపం జ్యోతిః పరాయణమ్
దీపం హరతు మే పాపం సంధ్యాదీప! నమోఽస్తు తే.

అని చెప్పి బాలురచే చెప్పించి కూరుచుండిరి. వారి కిక రెడ్డి గారికి కాతా వ్రాయు సమయము.

బాలు రందఱును వెళ్లిపోయిరి కాని జనార్దనమును వెంటనిడుకొని అతనితండ్రి యెపుడు వచ్చునా యని అబద్ధాలు కాక కొందఱు బాలురు వీథినిచూచుచు వెళ్ల లేకవెళ్ల లేక యిండ్లకు వెళ్లిరి.

# జన్మాంతర సంబంధము

లక్ష్మీనారాయణకు ఇద్దరు కుమారులు. పెద్దవాఁడు సూరన్న.

సూరన్న కడు చలాకీవాఁడు. ఊరిలో జట్టునకు ఏకచ్ఛత్రాధిపతి. ఊరంతయు మాటుమణఁగిన తరువాత దొడ్లలో దూరి దానిమ్మకాయలు పొట్లకాయలు వంకాయలు మొదలగు వానిని ఎత్తుకొనివచ్చి తమలోతమకు పంచుటలోను, ఇతరులకు విందులు చేయుటలోను అందెవేసిన చెయ్యి. వినాయకచతుర్థినాఁడు ఇండ్లమీఁద రాలురువ్వుటయు దీపావళినాఁడు భయగ్రస్తులమీఁద చిచింద్రీలు పాఱవేయుటయు ఈ మొదలగు పోకళ్లతో 'వీడు గొప్పవాడు' అని లోకములో కీర్తిగొనెను.

రెండవకొడుకు మంచన్నకు నాలుగేండ్లకు నాలుగైదు జ్వరములు తక్కువగా నాలుగుబడులును వచ్చిపోయెను. గుంట ఓనమాలు దిద్దుటచే చూపుడు వేలిలో ఒకకణుపే మిగిలెను. పిల్లలందఱును మొట్టికాయలువేయఁగా అతఁడు వారికడనుండి పాఱిపోయి దాఁగికొనును గాని తల్లి భవానితో కూడ ఆ హింసను చెప్పికొనఁడు.

అతఁడు ఇప్పుడు కట్టుచో పండ్రెండు మూళ్లకు తక్కువ బట్ట కట్టఁడు; లేనిచో జేనెఁడు కొల్లాయగుడ్డ. చుట్టుచో ఇరువది మూరల తలపాగ; లేనిచో బందెము. ఇటులయినను జనాభా లెక్కలలోఁగూడ నతనిపేరు ఎక్కలేదు.

మంచన్న యన్నచో తండ్రికి తలపోటు. మంచన తండ్రి యెట్టెదుటి కెప్పుడును పోయి యెఱుఁగఁడు. తండ్రి తనపంక్తిలో వానికి ప్రవేశము రద్దుపఱచెను. అందఱి భోజనములు అయిన పిదప తల్లి అతని నొకమూల కూర్చుండఁబెట్టి అన్నము పెట్టును. విస్తరిముందునుండి లేచుట యనునేమో అతఁ డెఱుఁగఁడు. 'నాయనా! చాలు!' అని తల్లి అనలేక అనలేక అని మంచనను విస్తరిముందునుండి లేవఁదీయుచుండును.

మంచన శరీరమున కంతటికి ఇకను లలంకారము. ఒక విధముగా వికారము. ఏలయనిన ఆపొట్టయు, ఆకాళ్లును, ఆచేతులును ఆయొడలును కల ఆమనుజునకు కన్నులుకూడ చింతాకులవలె నుండుచో ఆశిల్పము చతురస్రముగా ఉండెడి దని అనవచ్చును. కాని ఎవఁడేని క్రొత్తవాఁడు కన్నులుచూచి 'వీనిలో ఏదియో విశేషమున్న'దని అనుకొనకమానఁడు.

లక్ష్మీనారాయణకు పూర్వార్జితము నాలుగెకరములకంటె ఎక్కువలేదు. ఆ క్షేత్రముమీఁద వచ్చుపంట వారికి బొటాబొటిగా సరిపోవును. సూరన్న చెట్టుక్రింది ప్లీడరుగా ఉండి ఇప్పుడు కొంచెము అర్జకుఁ డాయెను. కాబట్టి తండ్రి యధికా

రము సూరన్నకు సంక్రమించెను. మంచన్నను ఛర్దన మర్దనములు చేయు నధికారము తండ్రి వదలిపెట్టుటలేదు. సూరన్నకు సంక్రమింపకపోవను లేదు. తల్లి అడ్డమువెళ్లి మంచన్న దెబ్బలలో కొన్ని పంచుకొనుచుండెడిది. దానిచే 'మీ అమ్మకుఁ గూడ దెబ్బలు తెచ్చుచుంటివి విధవా' అని తిట్టులును, రెట్టి దెబ్బలును మంచన్నకు ముట్టుచుండెడివి. మంచన్న ఈ దెబ్బలు కూడ అన్నముతోపాటు జీర్ణము చేసికొనుచుండెడువాఁడే కాని కేవలము తండ్రియే యగుచో ఊరకుండువాఁడే. ఏలనఁగా చిన్ననాఁటనుండియు తండ్రి చేతిదెబ్బలు అమ్మ ఆనుఁదము రాచుటతోపాటు అభ్యాసమయిపోయెను. క్రొత్తగా అన్నగారిదెబ్బ లధికమగుటవలన అతనిలో అభిమానదేవత నూతనముగా జాగరిల్లెను.

చిన్ననాఁట అన్నదమ్ములు ప్రేమయుగళము. అన్న తమ్ముని శిక్షించును; తమ్ముఁడు దెబ్బతిన్న పామువలె దానిని సహించి చూచుచుండును. అతని కనుకూలమైన యౌవనము ప్రాపింపఁగా వారిరువురు శత్రుయుగళ మయిపోదురు. పాపము! అపుడు అన్న తనప్రేమను క్రమ్మరించునుగాని తమ్ముఁడు దానిని ఈర్ష్య యని తలఁచునంతపగ పెట్టుకొనును.

అన్నదెబ్బల కావేదన పడలేక ఇంట నెవరికి చెప్పక మంచన్న దూరదేశములోనున్న బంధుజాలము నంతయు తిరుగ వేయ మొదలిడెను. అతని కిపుడు స్వర్గమున నున్నటు లుండెను.

తనవాలకమును, తిండిని చూచి వరుసఅయినవారు అనుమాటలు కానుపడుట, మరల వారికి సమాధానము చెప్పుట అనునదియే ఇపు డతనికి స్వర్గసుఖము. అతఁడే బంధువులయిండ్లలోను ఉండఁదలఁప లేదు. బంధుగృహము లన్నియు తిరుగవేయుటలో అతని ఉద్దేశ మేమనఁగా మంచన యను పిల్లవాఁ డొకఁడు లోకమున నున్నాఁడనియు, అతని కింకను పెండ్లికాలేదని వారందఱకు తెలియవలయు ననియు.

అతఁ డటులు తిరిగితిరిగి బంధులోకమునకుఁగూడ తన యందు దయలేదనియు తండ్రికే తనపై నెక్కువ దయ కల దనియు తెలిసికొనెను. ఏలనగా బంధువులు 'మీరాబంచన్న ఇక్కడికి తప్పించుకొని వచ్చినటులు తోఁచుచున్నది. వెంటనే తీసికొనిపొండు!' అని లక్ష్మీనారాయణకు వార్తలు పంపఁగా అతఁడు మంచన్నను రావించుటకు ఏమి ఏర్పాటును చేయకుండుటయేకాక వారికి ప్రత్యుత్తరమేని పంపలేదు.

తండ్రి కెప్పుడేని తనపై దయతప్పిపోవు నేమో యనియు ఏబందువేని తనపై ద్వేషముచే తండ్రి కప్పగించి పోవునేమో యనియు మంచన బంధులోకమును విడిచిపెట్టెను. ఏకాంతములో ప్రవేశించిన యోగివలె అతడు లోకములో ప్రవేశించెను. సత్రము అగపడుచో సత్రమున, పిండు ద్వార కుచో విందున, బ్రాహ్మణార్థము కుదురుచో నచట, లేనియెడల ఎవరియింటనో ఒకరియింట భోజన మొనరించుచుండెను. ఎవరిని

ఎర్రని ఏగాని అడుగఁడు; కావున లోకుల తిట్లుకాని దెబ్బలుకాని అతఁడు చవిచూడలేదు.

ఇటులు సమస్తలోకమున ఆదర మనుభవించుచు అభిలషించుచు తిరిగి తిరిగి మంచన్న శైలారామ మనుగ్రామము ప్రవేశించెను. ఆ సంధ్యాసమయమున వానచినుకులు ఉదాసీనముగా పడుచుండెను. భోజనమునకు లేవవలసినదను భార్యల పిలుపులనభిలషించుచు కొందఱును, పగటి నంతయు సోమరితనము వలనఁ గలిగిన బరువును మోయుచు కొందఱును వాకిటి అరుఁగులపై కూర్చుండిరి. లంబోదరము, గజగమనము, స్మితముఖము, దీర్ఘనేత్రములు వీని కన్నిటికి కిరీటముగా నున్న తలపాగ, బుజముపైనున్న చిన్న కొల్లాయియు కల ఆమంచన్న యాకారము వారి నాకర్షింపక మానలేదు. ఏయూరు మీదన్నచో ఎక్కడ ఉండు మనవలసివచ్చునో యని ముందుచూపు గల కొందఱు అతనిని పలుకరింపలేదు; కాని సంసారపు జంజాట మెఱుఁగని బాలురు అతనిని 'మీదేయూరు? ఏయూరినుంచి రాక? ఎక్కడికి పోక? ఎందుకు వచ్చుచున్నావు?' అను వివిధ ప్రశ్నలు వేయక మానలేదు. కొందఱుబాలు రతనివెనువెంటనే నడచుచు మీఁది కొల్లాయియు, గోఁచియు తుదకు కిరీటమును లాఁకక విడువలేదు.

మంచన్న కా ప్రశ్నలు మహానందముగా ఉండెను. "వీరెవరో బంధువులే; కానియెడల ఇన్నిప్రశ్న లేలవేయు

దురు? విశేషించి మీదేయూరనియు, ఏయూరినుండి రాక యనియు, అడుగుట కేమిపని? ఇంక గుడ్డ గోచులు తొడుగుట కేటియక్కఱ?' అని మనస్సులో తనతో వారి కేవో సంబంధ మున్నదని నిర్ధారించుకొనెను. అతఁ డెవరికిని ఏమియు సమాధానము చెప్పకుండ బజారువెంట పరిక్రమించుచుండెను.

అరుఁగుమీఁద అరమోడ్పుకనులతో పడుకొన్న అనంతుఁడు అతని యాకారమును, వెంటఁబడి బాలురతనితో చేయు పరిహాసమును, చూచుచుండెను. అది యెల్లయు నతనికొక స్వప్నమువలె నుండెను. తనయెదుటనుండి పరిక్రమించుచున్న ఆ వికారాకార మొక మనుష్యుఁడే యనియు అది కల కాదనియు తెలిసికొని అనంతుఁడు లేచి 'మాట, మాట; మీదేయూరు?' అని అడిగెను.

ఇదివఱకెవరికిని సమాధానము చెప్పని మంచన్న 'మాది రామాపుర'మని ప్రత్యుత్తరము చెప్పెను. అనంతుఁడు 'ఎక్కడికి వెళ్లుచున్నా'వని యడుగఁగా మంచన్న ఇక్కడికే అనెను. 'అరుగుచో రమ్మ'ని అనంతుఁడనఁగా మంచన్న వచ్చి ఆవలి యరుఁగుమీఁద కూర్చుండెను. అనంతుఁడు 'మాయింట నుందువా' యని యడుగఁగా 'మహారాజువలె' నని మంచన్న అనెను.

'ఇఁక ఈజన్మము నిర్విచారముగా గడపవచ్చు'నని మంచన్న అనుకొనెను. వెంటవచ్చిన బాలురందఱకు ఆశ్వాసము కలిగెను. అనంతుఁ డతని లోనికిఁ దీసికొనిపోయి 'ఓయా

అల్లుఁడు వచ్చెను; కాళ్లు కడుగుకొనుటకు నీరుపట్టుకొని రమ్మని రాయెను. మంచన్న లోలోపల ముసిముసి నవ్వులు నవ్వుకొనెను. అమల నీరుదెచ్చి పలుపురు బాలురచే పరివేష్టితుఁడైయున్న మంచన్నను చూచి చేయి నోరి కడ్డముపెట్టుకొని నిశ్చేష్టయై నిలువబడిపోయెను. అనంతుని పెద్దకూఁతురు బృంద తలుపు చాటుచేసికొని గదిలోనుండి తొంగిచూచుచు కోపముఖముతో నిర్గమించి నిలువబడెను. బృంద చెల్లెలు కామోద 'బావా బావా' అని కిలకిల నవ్వుకొనుచు దాపునకేఁగి తెల్లబోయెను. బాలు రందఱు పెద్దపెట్టున అఱచిరి. మంచన్న కామోదను చూచుచు 'ఈపిల్లనే నాకిత్తురా?' అని అనెను. అందఱు నవ్విరి. ఈరీతిగా మంచన్నకాయింట ప్రథమప్రవేశము కలిగెను.

నిత్యసభలతో నిటులు పదనాళ్లు కడచెను. రెండుపూఁటలు తిని కూర్చుండుచున్న మంచన్నకు ఏమియును తోఁచుటలేదు. ప్రతిదినము 'కామోద కేమియి నగలుపెట్టెద' వని యడిగి 'మంగళసూత్రము పెట్టెద' నను సమాధానము తనకు క్రొత్త వింత కలిగింపమి అనంతునకును ఏమియు తోఁచుటలేదు. పిల్లలకుమాత్ర మిసుకంతయేని తీరిక లేకుండెను.

అనంతుఁడు డొకనాఁడొక కావడిబద్ద, మట్లుతెచ్చి 'మంచన్నా! ప్రతిదినము దీనితో మనయింటికి కావలసిన నీరు తెచ్చుచుండుము! ఇది లెస్సగా మోసినతరువాత సంసారము మోయుదువుగని' అని అనెను.

మంచన్నకు సరిగా ఆపని వచ్చినట్టులాయెను. అతఁడు బుజాన కావడిపెట్టుకొని నీళ్లుమోయు నారంభించెను. మొట్ట మొదట యూఁపునకు బిందె ఇటు నిటు యూఁగి కాళ్లకు కొట్టుకొని క్రిఁదపడుట, బుజములపై కాయలుకాచి బాధపడుట జరిగెను. కాని కొన్నాళ్లలోనే ఆవిద్య అతనికి జన్మాంతరవిద్యవలె సంపూర్ణముగా వచ్చెను. పిమ్మట మంచన్న చేతులతో కావడిబద్ద పట్టుకొనకయే నీళ్లుమోయుట కలవాటు పడెను. పిల్లలంద అతనికి 'మంచినీళ్ల మంచన్న' అని పేరుపెట్టిరి. కామీద నిచ్చి పెండ్లి చేయుదు మన్నచో నెంతసంతోసమో మంచినీళ్ల మంచన్న అని యన్నను అతని కంతే సంతోసము. కావడి బాగుగా మోసినఁ గాసి సంసారము మోయుట తెలియు దని అతని నమ్మకము.

మంచన్నను ధన మెన్నఁడు ఆకర్షింపలేదు. అతఁ డెన్నఁడు అన్నవస్త్రములు కొని యెఱుఁగఁడు. వానికంటె వేఱేమియు నతని కక్కఱలేదు లోకు లన్నివిధముల ధనము కూడఁబెట్టి కాపాడుకొందురని అతఁ డెఱుఁగఁడు. నియతప్రకారము మంచి నీరు తెచ్చుట, అనంతుని చేతను అతని జ్ఞాతులచేతను 'అల్లుఁడా' యని యనిపింపుకొనుట, బాలికలచేతను బాలురచేతను వినోదింపఁ జేయఁబడుట, భోజనము చేయుట, వీథిచే మధ్యాహ్నమును, ఉప్పుపిసు చేడుట, తనకు తగినవారితో సంభాషించుట, తలపాగ చుట్టుకొని ఊరేఁగుట వీనితో సాయంకాలమును నిర్విచారముగా అతనికిఁ గడఁచుచుండెను. కాలము మెల్లగా గడచుటగాని, త్వరగా పరుగులెత్తుటగాని యీరెం

డును అతని కనుభవములో లేవు. అతఁడు రాత్రి ప్రక్క వేయుచో సూర్యోదయమువఱకు కర్రవలె పడి నిద్రించును.

కామోదకు పెండ్లియీడు వచ్చెను. సంబంధము కుదిరెను. లగ్నము నిశ్చితమాయెను. మంచన్న ఆనాఁడు కావడిబద్ద బుజానఁ బెట్టలేదు. గదిలో మూలుగుచు కూర్చుండెను. వంటవేళ ఆయెను. నీళ్లు లేవు. ఎన్ని మాఱులు పిలిచినను పలుకఁడు. కొంతసేపటికి శ్యామ గదిలోనికి పోవఁగా కనులవెంట నీరు రప్పించుకొని మంచముక్రింద కూర్చున్న మంచన్న కానిపించెను. శ్యామ 'మంచన్నా! ఏల యేడ్చెద' వని యడుగఁగా 'కామోదను నా కీయరఁట!' అని విలపించెను. 'అయ్యయో నన్ను చేసికొందువుగాక!' అని శ్యామ అనఁగా 'నిజము! నిజము?' అని మంచన్న అనెను. 'నిజంఘా' అన్నది శ్యామ. దానితో మంచన్నకు ఎక్కడలేని సంతోషము వచ్చెను. చాటుగా నుండి వినుచున్న అమల 'మంచన్నా! నీళ్లేవి?' అని అడుగఁగా శ్యామ 'అమ్మా! కామోదను ఈయరని మంచన్న ఏడ్చుచున్నాఁడు' అని చెప్పెను. అమల 'అయ్యో, పిచ్చి అల్లుఁడా! శ్యామను నీ కిచ్చెదము' అనువఱకు మంచన్న అమాంతము లేచి కావడి బుజానఁబెట్టుకొని చెఱువునకు బయలుదేఱి యెదురైనవా రందఱితో 'నాకు శ్యామ నిత్తురు, నాకు శ్యామ నిత్తురు' అని చెప్పికొనుచువెళ్లెను. వారు 'శ్యామనూ ఇత్తురు, పద్మనూ ఇత్తురు' అని అతని సంతసము ఇనుమడింపఁజేసిరి.

అతఁడీసంతోషములో మునిఁగి తేలాడుచుండగాఁ ఇంటివద్దనుండి మఱియొకసంతోషవార్తవచ్చెను. మంచనతండ్రి మరణించెను. అతఁడావినోద మనుభవించుటకు నేఁటికి పరప్రపలనము చేయవలసి వచ్చెను. అతఁడింటికి వెళ్లెను. తాను తద్దినము పెట్టువాని తమ్ముఁడే కాన అతనికి క్లేశ మంటలేదు.

భర్త చనిపోవుటయు కుమారుఁడెందులకు కొఱగాక పెండ్లిలేక దేశాలపాలగుటయు అన్న తమ్ముని విసర్జించుటయు భవానిని మిక్కిలిబాధించెను. ఆమె ఆదుఃఖమున మంచన్నను దగ్గఱ కూర్చుండఁబెట్టుకొని 'నాయనా! ఇఁక నిన్ను అన్న కొట్టఁడు. ఏకొండ్రయో అమ్మి పెండ్లిచేసి చూడవలెనని ఉన్నది.' అని రోదనము చేయఁగా మంచన్న నగుచు 'అమ్మా! నా కచట నొకయిల్లున్నది. పెండ్లికూఁతురుకూడ ఉన్నది. పెండ్లిచేసికొని ఒకసారి నీకు చూపించి తీసికొనివెళ్లెదను చూడు' అని చెప్పి ఆమె దుఃఖమును ద్విగుణము చేసెను. కర్మ అయిన పిదప తల్లితో 'మాయింటికి వెళ్లిపోవుదు' ననిచెప్పఁగా ఆమె అతికష్టముమీఁద ఒకరోజు ఆఁపుసరికి దేవతలు దిగిరావలసి వచ్చెను.

పశువు కొన్నాళ్లు బందిలిదొడ్డిలోనైనను ఉన్నచో మఱల అది అక్కడికే వెళ్ళగోరును. వింతలతో వినోదములతో బాలికల హాస్యములతో స్వర్గసుఖ మనుభవించుచున్న మం

చన్న మరల శ్రీశైలారామమున అనంతుని యింటికి వెళ్ళఁగోరు కొనుటలో ఆశ్చర్యములేదు. అతనికి తల్లియన్నచో ప్రేమ యున్నది. కాని దానికి సూరన్న భయము మాటు. కావున అతని కనంతుఁడే తల్లి.

సూరన్న తనను మాటాడించి ఎక్కడ తన్నిపోవునో యనుభయము తొందరపెట్టఁగా తల్లితోఁగూడఁ జెప్పకయే లేచి పోవలయు నని మంచన యూహించుచుండెను. సూరన్న తమ్ముని ఒడిదొడుకులన్నియు కనిపట్టి తల్లికడ పసిపిల్లనివలె నున్న అతని కడకు వెళ్లి 'తమ్ముఁడా! నాయన పోవనే పోయెను. ఏ కొండ్రయో అమ్మి నీ కొక పిల్లను ముడిపెట్టవల సిన విధి నామీఁద ఉన్నది. కాఁబట్టి నీ వల్లరి చిల్లరగా తిరు గక ఇంటనే పడి ఉండు' మని అనెను.

ఈమాట లకాలజలదోదయము వలె భవాని కాశ్చ ర్యము కలిగించెను. ఆమె కనుల నీ రొత్తుకొనుచు 'మంచన్నా! అన్నకు నీమీఁద దయకలిగెను. రెన్నెల్లపాటిక్కడుండు!' మని బతిమాలుకొనెను. సూరన్న ఎంత గట్టిగా ఉండుమని కోరునో మంచన్న అంత వడిగా లేచిపోవు నని భవాని అను కొనలేదు.

తెలవారుకడ ఎవరికి తెలియకుండ మంచన్న మాయ మాయెను. 'వాఁడు పట్టి వెఱ్ఱివాఁడయి పోయెను. ఉండుమని అనుచో ఉండునా?' అని సూరన్న తల్లికడ సంభాషింపఁగా

భవాని దుఃఖించెను. కాని మంచన్న సూరన్నకు జంకియే వెళ్లి యుండునని ఆమె లోలోపల తలఁపకపోలేదు. ఆమె బంధువులలో పిల్లలను గురుతుతెచ్చుకొని సూరన్నతో చెప్పుచుండెడిది. సూరన్న వెంటనే వారి వారికి వార్తనంపి వారివారి అసమ్మతిని ఎప్పటి కప్పుడు తల్లికి నివేదించుచుండెడివాఁడు.

అనంతునికుమారుఁ డాదినారాయణునకు వివాహము వచ్చెను. ఇల్లంతయు మంచన కప్పగించి అందఱు తరలివెళ్లిరి. మంచన్న కది యెంతగౌరవము! అతఁడు చీకటిపడఁగనే కత్తి భుజముమీఁద పెట్టుకొని ప్రహరి తిరుగును. తలుపు లన్నియు తాళములు పెట్టి తడవతడవకు లాగిచూచును. చీమ చిటుకుమన్నచో రివ్వునఁ బాఱి సందేహము పోఁగొట్టుకొనును. ఇటులతఁ డాయింటిని యక్షునివలె రక్షించుచుండెను.

'నగలమూట యింట జాఱిపోయెననియు, మంచన దాని నపహరించు' ననియు అమల అనంతునితో పోరుపెట్టెను. ఓసి తెలివి మాలినదానా! నగ లింటనే జాఱిపోయినయెడల మంచన మన యినుపపెట్టెయే!" అని యనంతుఁ డనెను. అమల యింటికి మనుష్యుని పంపుమని రాపాడినను అనంతుఁడు చెవి యొగ్గలేదు.

పెండ్లివారు తూర్యధ్వానములతో మరలివచ్చిరి. అనంతుఁ డింట కాలిడఁగనే మంచన నగలమూట నింటిబరువుతోపాటతనిముం దిడెను. అనంతుఁడు అమలకేసి చూచెను. అమల పెదవులమీఁద చిఱునగ వగపడెను.

మంచన్న కొకనాఁడు టపావాఁ డొక యుత్తరమును మనియార్డరును తెచ్చి యిచ్చెను. అది యతని జాతకమున నొకమహాయోగము. ఏమనఁగా గవర్నమెంటు నవుకరు తనకు ఉత్తరము మోసికొని వచ్చెను. మఱియు నాలుగురూకలు బహుమతియు తెచ్చెను.

తండ్రి తద్దినము పెట్టుకొనుటకింటికి రావలసినదని వ్రాసి ప్రయాణవ్యయమునకై నాలుగురూకలు సూరన్న పంపెను. ఆపైకము సూరన్నయే పంపినాఁడని మంచన్నకు గోచరించినప్పు డతనియం దొక్క నూతనమగు భ్రాతృప్రేమతో తొణికిపోయెను. మంచన్న వెంటనే రామాపురమునకు పయనమైపోయెను. భవాని మంచన్నను చూచి నూతనముగా కనినటులే యానందించెను. అతఁ డొనరించిన కర్మమే భర్తకు ముట్టునని యామె తలఁపు.

మాసికము, ఏఁడుడి, తద్దినము సమాప్తమాయెను. తద్దినము రాఁటి నడిరేయి సూరన్న మంచన్నను వెదకికొను చుఁబోయి యతనిని లేపి 'నాయనా! ఇటుర' మ్మని పిలిచెను. మంచన్న కిన్నాళ్ళనుండియు లేని భ్రాతృప్రేమ యొక్కసారి నిండుకొనెను. సూరన్న యన్నచో పాటు మంచన్న యిప్పు డతనిని గొఱియవలె ననుసరించెను. సూరన్న తమ్ము నొకయింటి కోనికిఁ దీసికొనిపోయి 'ఈ కాగితము మీఁద వేలిముద్దర వైవు' మనియెను. అదియు కర్మలో నొకభాగమను

కొని మంచన తన చూటనవ్రేలిని నుసి కంటించి కాగితముపై దక్షిణమునుండి ఉత్తరమునకుఁ ద్రిప్పెను. అది సూరన్న యశఃకీర్తి ముద్రవలె నల్లని రేఖలతో నఁటు కొనెను.

తెలవారుకడ భవాని మంచన్నను వెదకికొని యతఁడు కానరామి పుత్రదుఃఖ మనుభవించెను. సూరన్న పుత్రోదయ మయినటులు సంతోషించెను.

కొల్లాయుగుడ్డ కొకచివర ఒక మిఠాయి పొట్లము మరొక చివర కజ్జపుపొట్లమును కట్టి దానిని బుజముపై వేసికొనఁగా ఒకటి రెండు రొమ్మును మరొకటి నీఁపును కొట్టుకొను చుండఁగా మంచన శ్రైలారామము ప్రవేశించి బాలలోక మున కానందము కల్పించి ఆనందపురుషుఁడై యుండెను.

కొన్నాళ్ళకు శ్యామానివాహమునకు లగ్నము నిశ్చిత మాయెను. మంచన్న ఆ వార్తవిన్న తత్‌క్షణము శ్యామ వద్దకు వెళ్లి 'శ్యామా! నన్ను పెండ్లాడుదు నని నీ నోటి మాఁదుగా నీవే యంటివికదా! ఇపుడు ఇంకొకనిని పెండ్లా డుదువా?' అని యనఁగా శ్యామ 'మంచనా! నీగోత్రము చెప్పు' మని అడిగెను. మంచన 'కౌండిన్యగోత్ర' మని యనఁగా శ్యామ 'మాగోత్రము చెప్పు' మని అనెను. మంచన ఆలో చించుచు 'కౌండిన్యగోత్రమే' అని 'శ్యామా! నీవు నాకు చెల్లె లవు' అని శ్యామనెత్తికొని 'అమలమ్మగారూ! అనంతుఁడుగారూ! మీరు నాకు తలిదండ్రులు; నన్ను నమస్కరింపనిండు' అని

వారికి పాదాభివందనములు చేసి బాష్పప్లావిత నేత్రుఁడై కూర్చుండెను. అందఱకు కనుల వెంట అనందబాష్పము లుదయించెను. శ్యాము 'ఓయీ! నా కూఁతునిచ్చి నీకు వివాహము చేయుదును లెమ్ము' అనెను. మంచన 'బలే! బలే! అని చిటికలు వేసెను.

---

# రాచ పట్టు

## 1

తెలుఁగుదేశమునఁ జలువ వంశమునకును గలువ వంశమునకును విలువకలదు. ఈ రెండు వంగడములవారును దరతరములనుండియు వియ్యమువారు. పరాక్రమమునను బరిభవమునను సరివారు.

మొగలాయి యేలుబడిలో కోడిపందెములతో పాటు గుఱ్ఱపుఁ బందెములకును మోజు హెచ్చెను. ఏలికల యొరవడివలనఁ 'గలువ రామారాయణింవారును జలువ వెంగళరాయణింవారును గుర్రపుఁ బందెమునకు దిగిరి. వెంగళరాయణింవారు వెనుకఁబడిరి. 'చలువమడతలవారికిఁ గోడిపందెములు గాని గుర్రపుఁబందెము లేటి' కని కలువ రామారాయణింవారు గేలిచేసిరి. 'కలువవారు పలువవారని వెంగళరావుగారు వెక్కిరించిరి.

బాపనవారికిఁ బరిహాస మిష్టదేవత, రాచవారికిఁ రణదేవత. రామారాయణింవారు కత్తిదూసిరి. వెంగళరాయణింవారు ప్రేటు వేసిరి. విడఁదీయుటకు నడుమునకు వెళ్ళిన కొందఱు భటులు వారి కత్తులకు బలియైరి. ఈ వార్త నగరికిఁ జేరెను. నగరమంతయుఁ నచటికిఁ జేరెను. వియ్యమువారును నెయ్యమువారును వచ్చులోపుగా వారిరువురును రణభూమికి బలియై

పోయిరి. నాఁటినుండి నేఁటివఱకును ఆ రెండు వంగడముల నడుమఁ బచ్చిగడ్డి పడుచో భగభగ మండిపోవును.

2

కొన్ని తరములు కడచెను. తరములు కడచినకొలఁది చలపకారము పెరిగెను. మరల వియ్యమందుటయే దీనికి మందని ఉభయవంశములవారును గ్రహించుకొనిరి. అంతటఁ గలువ వెంకయ్యమ్మారావుగారికిని జలువ పాపారావుగారికిని పెండ్లి యాలోచనలు జరగెను.

వివాహ మొక నదీసంగమము. ఆతీర్థమున సుభయవంశములును శాంతి రసము గ్రోలును. వెంకయ్యమ్మారావుగారి కిరువది దాఁటెను. సాముచే దృఢమయిన యామె శరీరమినుము; నూనె రాచిన మినుము.

పెండ్లి కుంతనమునకుఁ దలిదండ్రులే యధిదైవతములు గావునఁ గలువవారు చంద్రిక యను నొకదాసిని జలువవారి దివాణమున కంపిరి. చలువవారును చంద్రముఖి యను నొక దాసిని కలువవారి దివాణమున కంపిరి.

ఈ దాసిక లిరువురును ఈ రెండు దివాణములయందును గుత్తుకబంటిగా భుజించిరి. క్రొత్తచీరలు కట్టుకొనిరి.

అక్కడ పాపారావుగారు చంద్రిక నేకాంతమునకుఁ బిలిపించుకొని రేయి చాలఁ బ్రొద్దుపోవువఱకు మాటాడిరి.

ఇక్కడ చంద్రముఖ వెంకయ్యమ్మారావుగారి యేకాంత భాషణమునకుఁగాని ఆమె రూపమునకుఁగాని అంత సుముఖ కాలేదు. కాని సుముహూర్తము నిశ్చిత మాయెను.

3

ధర్మారావుగా రల్లున కొకయేనుఁగును రెండు లొట్టి యలును నాలుగు గుఱ్ఱములును ఎనిమిది యూళ్లను పదునాలు గురు దాసికలను నూటావులను కట్నమిచ్చి కోరికను వెలి బుచ్చిరి.

మునిముందు జయభేరియు పిదప ముఖవీణయూ వెనుక సనాయియూ తరువాత నేనుఁగులును గుఱ్ఱములును ఒంటెలును బంటులును వారాంగనలును కూడిరా పట్టపేనుఁగెక్కి పాపా రావుగారు పాణిగ్రహణమునకు బయలుదేరిరి.

పెండ్లికొడుకు యుద్ధముచేయని వీరుఁడు, రాజ్యము లేని రాజు. అతఁడూరేఁగి దిగ్విజయము చేయును. అతని మాట అపుడు శాసనము. అతఁడు విశ్రమించెనా వీచోపులు, పలుక రించెనా బహుమానము.

పాపారావుగా రసలే రాజుగారు. మరి యిపుడు పెండ్లి కొడుకు.

వివాహమంటపము లతావృక్షములచే నందనమువలెఁ బూలచేఁ జైత్రరథమువలె నుండెను. పాపారావుగారు పటా కత్తి ప్రేలాడుచుండఁగా వివాహ మంటపమునఁ బ్రవేశించిరి.

లగ్న మాసన్న మాయెను. వివాహ మంటపమున పట మంటపము బూరటిల్లి వధూప్రవేశ మెతెఁగించెను.

వియ్యంకులును వారి బంటులును ఎదురు బొదురుగా నిలుచుండిరి.

## 4

పురోహితుని తొందరవలన పాపారావుగారు పట గృహమునకు అట్టుపాఁచిరి. అందు వెంకయ్యమ్మారావుగారు కూర్చుండిరి. ఆమె కీవల చంద్రిక నిలిచియుండెను.

పాపారావుగారు వధువును జూచి తలపైకెత్తి చంద్రికనుజూచువారు చంద్రికనుజూచుచునే యుండిరి.

చంద్రిక తల వంచుకొనెను. వెంకయ్యమ్మారావుగారు తల యెత్తిరి.

మంత్ర మాయెను, తంత్రము కానిండని పురోహితుఁడు ముదలకించెను.

తాళిబొట్టు కట్టించుటకుఁ జంద్రిక క్రిందికి వంగెను. సూదంటురాయి లోహము నాకర్షించెను.

'పెండ్లి పీటమీఁదఁ గూర్చుండఁదగిన దిది; పెండ్లికూఁతు ప్రక్కనిలువఁబడఁదగిన దది' అని తలఁచుచున్న పాపారావుగారి మానసమునఁ పురాణవైరము పురాణించెను.

పురోహితుఁడు తొందరించెను. మంగళసూత్రము బంధింపఁజేయుటకుఁ జంద్రిక పాపారావుగారి చేతులను మృదువుగా స్పృశించెను. ఆ స్పర్శ వారికి ముక్తాహారములు కల్పించెను. వివాహ సభలో నవ్వులును గుసగుసలును బయలుదేఱెను. పురోహితుఁ డింకొకతూరి హెచ్చరించెను. వెంకయ్యమ్మారావుగారి మనసు విఱిగెను.

అంతలో పాపారావుగారిచేతిలోని మంగళసూత్రము చంద్రికకు త్రాడ్వేయ మాయెను. చంద్రిక చూపు లతనికిఁ దలఁబ్రాలాయెను.

వెంకయ్యమ్మారావుగారు రుద్రయ్యమ్మారావుగారై రుసరుసలాడుచు రాణివాసములోనికిఁ బరుగిడిపోయిరి. వివాహసభ దక్షయజ్ఞ మాయెను.

5

ఇదేమి దుస్సాహస మ'ని తల్లి గద్దించెను.

'అతఁడు దానికే తగినవాఁడు. నాకనుల యెదుట నతఁడు చంద్రిక మెడలో పుస్తెకట్టెను. ఇది చలపాడుచుట కాక మఱేమి? కొబ్బరికాయ తలయు కుండబొజ్జయుఁ గల యీ మన్మథుఁడు మఱి నాకు దొరకఁడా ?...

'అదియేమే, అదియేమే' యని తల్లి నోరు మూసికొనెను.

'కలువవారి రక్తము నా శరీరమున నినుకలేదు. చలువ

వారికి రణరంగమున మెఱవడిచేయుటయే పరాక్రమమునకు పాడి. ఈతులువ నాయెదుటనే నాదానికిఁ దాళి కట్టుచుండఁగాఁ జూచిచూచి నీ యానతి చొప్పున నోరుమూసికొని దైవముఖమును దేవిరింపఁబోవను.' అని వెంకయ్యమ్మారావుగా రనుచుండఁగా తండ్రి యటకు విజయంచేసెను. వెంకయ్యమ్మారావుగారు తలిదండ్రులకుఁ బ్రదక్షిణముచేసి 'వైరమునకు నన్ను లంచ మిచ్చితిరి. అతఁడు బలియిచ్చెను. ఈ మీ పొరపాటును కత్తిగాని మఱి యొకటి సవరింపఁజాలదు. ధర్మమును కాపాడఁ దలఁచుకొందురేని వెంటనే కత్తిగైకొనుఁడు. ఇఁక నిసుమంతయు నవకాశము లేదు.' అని కత్తుల బావి కడ కుఱికెను.

## 6

'వెనుకటి కసి తీర్చుకొనుటకే పెండ్లి పెట్టుకొని ర'ని బందుగులనుకొనిరి. 'పెండ్లికూఁతురు పీటవిడిచి మమ్మవమానించె' నని చెలువవారనిరి. దానికిఁ బుస్తెకట్టినవారిపైఁ గత్తికట్టితి' మని కలువవారనిరి.

వివాహ రంగము చూచుచుండఁగాఁ జూచుచుండఁగా రణ రంగముగా మాఱెను.

కర్మ మేతము. దాని కొమ్మొకతూరి మన్నుముట్టును. మఱియొకతూరి మిన్ను ముట్టును.

'వధువును బట్టుకొనుఁడు వధువును బట్టుకొనుఁ డ'ను కేకలు వినఁబడెను. 'వరుని బట్టుకొనుఁడు వరుని బట్టుకొనుఁడ'ను కేకలు చెవి చఱచెను.

పాపారావుగారు చంద్రికను గట్టిగాఁ బట్టుకొనిరి. చంద్రిక పాపారావుగారిని గట్టిగాఁ బట్టుకొనెను.

'పట్టుకొనుఁడు పట్టుకొనుఁడు.'

ఈ కేకలే యుద్ధమునకు డుత్తుచ్చి. ఇరువాఁగులవారును చేతులు కలుపుకొనిరి. బంటులును బంటులును దాసికలును దాసికలును బంధుగులును బంధుగులును వియ్యపురాలును వియ్యపురాలును వియ్యంకుఁడును వియ్యంకుఁడును ధర్మయుద్ధ మొనరించి వీర స్వర్గ మలంకరించిరి.

పాపారావుగారు రాణివాసము చొఱఁబాఱుచుండఁగా వెంకయ్యమ్మారావుగారి అసిపుత్రిక అతనిమీఁదఁ బడఁబోయెను. అంతలో చంద్రిక అడ్డము వచ్చెను. ఆ కత్తి నామె క్రిందఁ బాఱవయిచెను. అది నేలఁబడి రెండుగా తునిసెను.

—→ ←—

# సులతానీ!

౧

'సులతానీ!'

ఈపిలుపు ముగియక మునుపే సులతానీ పెదవులమీఁద చిఱునవ్వు పంచదార వలెను, లలాటమున బొమముడి అల చందవూవువలెను కానిపించెను. తనను ఇటులు పిలిచిన శాంతయ్య కడకు అది వచ్చి 'నీభాంఛను; నీ కాల్ మొక్త*, అసలు పేరున పిలవండి బాబయ్యా!' అని అనెను.

అది యిటులు వేఁడుకొనఁగా శాంతయ్య కొంత శాంత స్వరముతో 'నీ అసలు పేరు లోకు లందఱు మఱచిపోయిరి. కాని, యీవేళ అదోకమోస్తరుగా ఉంటివి, చంకలో ఆరైక ఏమిటి? బుజముమీఁద ఆ చీర ఏమిటి? ఏదో జరగినటు లున్నది' అని తేటె పాఱఁజూచెను.

దాని చేతిమీఁదను కపోలముల మీఁదను ఎఱ్ఱని కదుములు, లలాటముమీఁద ముంకెనపూవు అతికించినటులు నెత్తురు, చూచిన శాంతయ్య కనులనిండ నీరు.

ఇంటిలోనుండి శాంత వచ్చి చూచి 'ఏమిటో రగడ జరగెను చెప్పవే' అనెను.

---

* 'నీబానిసను ; నీకాలు మొక్కుతా.'

సులతానీ గిరుక్కున వెనుదిరిగి 'అమ్మా! నేను వీరా యింటిలో ఉండిపోతా' అని అన్నది.

ఆలాగే ఉండు మంచిది అని శాంత అనెను.

ఈ సమాధానము వినిపించుకొనకయే సులతానీ తాను అంట్లుతోము మావిమొక్క క్రిందికి వెళ్లి చంకలోని రైకయు బుజముమీఁది కోకయు మావిలోఁ బెట్టి కూర్చుండి అంట్లు తోమ మొదలిడెను.

శాంత లోలోపలనే నవ్వుకొనుచు 'మాఉరుసుములో మాయ' అనుకొనుచు లోనికి వెళ్లిపోయెను. శాంతమ్మయు మామిళ్ల క్రింద అల్లపు మళ్లలో కలుపు తీసికొనుచుఁ గూరుచుండెను.

సులతానీ అంట్లుతోమి ఇల్లలికి తుడిచి శుభ్రము చేసి, ఇతరుల పనికూడఁ గొంత చక్కదిద్ది ముంగిటికి వచ్చి కూర్చుండెను.

ఏమియూ తోఁచనివాఁడు ఊరక కూరుచుండినను తోఁచదు.

సెలవు పుచ్చుకొనవచ్చిన పాలేరు పోతఁడు ఊరక కూరుచున్న సులతానీని చూచి 'నీవు ఇక్కడే ఉండిపోతావా ఏమిటి? ఇంటికి వెళ్లవూ?' అని అనెను.

సులతానీ మాటాడలేదు. పోతఁడు ఎదుటికి వచ్చి సులతానీని చూచెను. ప్రతిదినము కౌతుకముతోఁ జూడఁబడు

ముఖము కా దానాఁటి ముఖము. సులతానీ చూపు నెదుట పోతఁ డాఁగఁజాలకపోయెను. వెనుకకు మరలి అతఁడు దాపున నిలిచి 'ఇవ్వేళ సులతానును వదిలిపెట్టేస్తావా ఏమిటి' అనెను.

సులతానీ మాటాడ లేదు.

మామిళ్ల క్రింద చప్పుడాయెను. పోతఁడు ఉలికిపడి చూచుచుండఁగా శాంతయ్య ముంగిటికి వచ్చెను.

పసుల పాకలోనుండి వీరఁడు మెల్లగా వచ్చెను.

'సరే మీరు అన్నాలకు పోయిరండు' అని శాంతయ్య అనఁగా పాలేళ్లిరువురును ఇండ్లకు వెళ్లిరి.

శాంతయ్య లోని కేఁగఁగనే శాంత 'దీనిని మీరు మన ఇంట ఉండనీయవలదు' అనెను. మొగము చిట్లించుకొని శాంతయ్య 'నన్ను ఉండనీయవలదని నీవు ఉంచుటకా ?' అని అనెను. శాంత 'అదేమి ? నేను ఉండనీయను' అని అనెను.

లోపలి పలుకులు ఆలకించుటకు చెవులు దోయిలించు కొని కూరుచున్నది సులతానీ.

వెనుకనుండి పిల్లులు పట్టువానివలె సులతాను వచ్చెను. ఇలు వాకిండ్లు పరికించి చూచెను. సులతానీ ముందు వాలెను.

సులతానీ రెండడుగులు వెనుకకు జరిగి కూరు చుండెను.

'నాది బుద్ధితక్కువ అయింది; నన్నుకూడా రెండు కొట్టు' అని సులతాను దవడ లప్పగించెను.

సులతానీ మెడవాల్చి కూరుచుండెను.

'నాకు చిన్నతనం లేకు. బాబుగారితో చెప్పకు. ఆలోచించి వెంటనే నా మాట పాటించు. లే ఇఁక లే. బాబుగారు చూస్తే బాగుండదు.' అని సులతాను అనెను.

సులతానీ మెడ ఓరఁజెట్టెను. నల్లఁగలువలకు మెల్ల కనులు పెట్టి సులతాను తాటుక కనులు సులతానీ కనులలోఁ బడెను. సులతానీ కనులు మెల్లమెల్లగా ముకుళించుకొని పోయెను. ఒక రెప్పపాటులో సులతానీ కనులు తెఱచెను. సులతాను లేచి దాని ముందు విచిత్రముగా నాట్యము చేసెను. గవాక్షమునుండి కాంతకును కాంతయ్యకును ఆనాట్యము కాని పించుచుండెను.

సులతానీ లేచెను.

సులతాను మామిడిమొక్క క్రిందికిపోయి చీరను రైకను తీసికొని వచ్చెను. 'రా పోదాం' అనెను.

'పద! నీవు ముందర పద! ఇఁక నో రెత్తకు!' అని సులతానీ దారికేసి చేయి చూపెను.

కిక్కురుమనక సులతాను పోయి పెండెము కడ నిలువఁబడి చూచుచుండెను.

లోపలినుండి శాంత వచ్చెను. 'అమ్మా! ఇంటికి పోతాను సెలవియ్యండి' అని సులతానీ అనెను.

'అదేమే మేకల జగడమాయెను ?' అని శాంత యనెను.

'అమ్మా, ఏమీ లేదు. ఇంటికి పోతాను' అని ప్రత్యుత్తర మవేమియుంపక సులతానీ వెళ్లిపోయెను.

౨

చుట్టును ఎఱుకల గుడిసెలు, దొమ్మర గుడిసెలు; చాకల పేట, మంగల గూడెము. నడుమ పెద్ద గంగానమ్మ వేపచెట్టు. దాని క్రిందనే సులతానీ గుడిసె.

సూర్యుఁడు అస్తమింపఁబోవు చుండెను. ఎఱుకతలు పిల్లలకు సోదె పాఠములు చెప్పుచుండిరి. దొమ్మర సానులు పాడుచుండిరి. శుద్ధిదేవతలు చాకితలు మడతలు పుచ్చుకొని గ్రామములోనికిఁ జనుచుండిరి. వరాహావతారములు, వీరభద్ర వాహనములు, ముడియెద్దులును రాకపోకలు చేయుచుండెను.

సులతాను వేపచెట్టుక్రింద ప్రేపచువ్వలతో బుట్టలల్లుచుఁ గూరుచుండెను. దాపువనే కూరుచుండి గురువు చింతయ్య సిద్ధప్పతత్త్వము పాడుచు తన్మయత్వము చెందుచుండఁగా సులతానీ ఆలకించుచుండెను. మాలపుల్లయ్య, సాలెశ్రీరాములు, మంగల మంగి, చాకల పుల్లి, ఎఱుకల మస్తాను, వీరందఱును శ్రోతలు. రాత్రివేళ మబ్బులమీఁది నగలు నక్షత్రములు నన్నిటిని తన పురిమీఁదనే మోచి ఒకనెమలి సులతానీముందు నాట్యము చేయుచుండెను.

సులతాను సులతానీతో రాజీపడిన తరువాత కల్లుత్రాగి పండువు చేసికొనెను. ఆ పండుగులోనే బుట్టలల్లుచు కూరుచుండఁగా చాకల సుబ్బఁడు వచ్చి 'రాత్రి పొద్దుపోయిందాకా యీరి రేవులో బట్టలు ఉతుకుతూంది' అనియు, మంగల శోభనాచలము 'శ్రీరాములు ఈ ఊరునుంచి లేచిపోతాట్ట; వాడికి శాస్తిచేయకుండా వెళ్లనియ్యగూడ' దనియు-ఇట్లే పలువురుపలుతగవులు చెప్పుకొనిరి. సులతాను రాజీలు చేసియు డిక్రీలు ఇచ్చియు అందఱను పంపివైచెను.

గురువు చింతయ్య మాధుకరమునకు లేచెను. ఎవరిదారిని వారు వెడలిపోయిరి.

సులతానుచూపులు పిఱుఁదులకు తాఁకుచుండఁగా బుజముమీఁద కడవతో సులతానీ చెఱువునకుఁ బోయెను.

చీపురుకట్టతో శుభ్రముగా ఊడ్చినటు లున్న ఒకసందు నుండి వచ్చి మొగలో నిలిచి సులతానుఅక్క తొంగితొంగి చూచు చుండెను. సులతాను దానిని చూచి 'బోగీ! రా!' అనెను. బోగి గుడిసెలోనికి పోయి నాలుగు మూలలు చూచి వెలికి వచ్చెను. సులతాను కూర్చుండు మని పేఁపచదరు వైచెను. బోగి కూర్చుండెను.

'నీ డబ్బంతా సులతానీ మాయంచేస్తూంది. నీకు తెలియడం లేదు.'

'ఛీ ఛీ! అబద్ధం. ఎవడు చెప్పాడే నీకు?'

'శాంతయ్యగారికగ్గర పదికాసులు దాచిందిట. ఆసంగతి శాంతయ్యగారు మునసబుగారితో చెప్తూతుంటే మా బావ విన్నాడు.

'నిజం?'

'నిజం!'

'అలా అయితే సంకురుమయ్యపండుగుసాదు బావతో జూదం ఆడానన్న మాటే. నీ కో కాసు ఇచ్చా నన్న మాటే.'

'ఆ అన్నీ యిచ్చావు. నిన్నటి అయిదురూపాయలలో నాకేమయినా అంద నిచ్చిందీ?'

'ఈ తేప అల్లాకాదు. నీకు కాసియ్యకపోతే నేను నీ తమ్ముణ్ణి కాదు.'

'చేతిలో చెయ్యి వెయ్!'

సులతాను బోగిచేతిలో చెయి వేయఁబోయి కొంచెము తూలిపడెను. పిదప లేచి 'ఇదిగో ఇదిగో ఇది చెరువునుంచి వచ్చే వేళ అయింది. నీవు మెల్లగా వెళ్లు! పోసి కూచో! పోసి వెళ్లు! పోసీ ఈ!' అనెను.

బోగి లేవఁబోవుచుండఁగా సులతానీ అడుగుబెట్టెను. రుసరుస లాడుచు దాపునకువచ్చి 'రా వద్దంటే నీ వెక్కడికి ఎందుకు వచ్చావ్?' అనెను.

'పోనీ రానులే' అని బోగి పోఁబోయెను. సులతాను కొంచెము గుక్కతిప్పుకొని 'వస్తేయేం? రాకూడదా?' అనెను.

'రాకూడదు ముమ్మాటికి రాకూడదు.'

'వస్తుంది ముమ్మాటికి వస్తుంది.'

'వస్తే నీ గుడిసెకు నిప్పెట్టి లేచిపోతా బాబయ్యగారు నాకు కూడా గుడ్డా ఇస్తానన్నారు తెలిసిందా? అది ఇక్కడికి వస్తుందా మానుకుంటావా చెప్పు. వస్తే ఈకుండ ఇక్కడే పగలేసి ఈదారినే బాబుగారింటికి పోతా. ఏమాటా చెప్పు.'

సులతాను ముఖము జేగురుగడ్డ.

'మహా వారింట్లోనే ఉంటానంటావు ఏమాత్రం తిండి పెడతారో చూదాం. పో లేచిపో!'

'నా వెళటంమాట అటుంచు! బోగి ఇక్కడికి రాకతప్పదా? నాడబ్బంతా నాకు గాకుండా నీకు గాకుండా తప్పదా!'

'మన ఇద్దరికీగాదు, బోగికీ గాదు. శాంతయ్యగారికి కాక తప్పదు. నీవు ఆయనకు గాకతప్పదు.'

'ఛీ ఛీ. బాబయ్యగారివద్ద డబ్బు ఉంచుకుంటే కడుపులో ఉంచుకున్నట్లే.'

'అయితే ఎంత ఉంచావు.'

'ఎంతో కొంత. నేను లేచి వచ్చేటప్పుడు నాపాత మొగడు ఇచ్చాడు నా కాడబ్బు. దాన్ని గురించి నీవు అడుగ వలసిన పనిలేదు.'

'వాడు పట్టి వెధవ. వాడిపేరు నాదగ్గర చెప్పకు. నీవు నాదగ్గిఱకు ఎప్పుడు వచ్చావో అప్పుడే అది నాడబ్బు. నాడబ్బు నాకు తెచ్చి ఇయ్యి, ఇయ్యి!'

'ఇయ్యను ఇయ్యను ఇయ్యను.'

సులతాను అల్లుచున్న బుట్ట నావలఁబాఱవైచి ఒకనిదుడ చువ్వతో సులతానీని వేసెను. చువ్వ పొడుగునను తోలు లేచెను. మూఁపుమీఁది కడవ లక్ష చిల్లు పెంకులై నేలనావరించెను. సులతానీ నేలవాలెను.

'దొంగవేసం' అని బోగి మెల్లగా ననెను.

'వేసాలూ గీసాలూ నాదగ్గిరా!' అనిసులతాను సులతానీని ఎడపెడ గొట్టెను.

బోగి మెల్లగా జాఱెను. సులతాను సులతానీని కదిలించి తెల్లఁబోయెను. మోసు !

నలుగురును చేరిరి. తలాయొక మాట అనిరి. సులతాను గబగబ గుడిసెలోనికిఁ బరుగెత్తి మంచముక్రింద దాఁగుకొనెను.

పదిమంది చూచుచుండిరిగాని వారి కేమిచేయును తోఁచలేదు.

సులతానీ మొదటి మగఁడు పరమానందాయియు ఆగుంపులో నుండెను. ఒక ముంతతో నీరుతెచ్చి దానినోటఁ బోసెను. చెమటతుడిచి బట్టతో విసరుచు కూరుచుండెను. 'వెళ్లిపొం'డని అందఱను అనుశాసించెను.

క్రమక్రమముగా ఒకరొకరే వెళ్లిపోయిరి. లోపల దాఁగియున్న సులతాను గీఁతకత్తితో తొంగితొంగి చూచుచుండెను.

కొంతసేపటికి సులతానీ మో మెత్తెను. ఎదుట పాఁతమగఁడు పరమానందాయి!

'ఛీఛీ, లేచిపో! ఊ! వెంటనే లేచి పో! చస్తావు పో' అని సులతానీ అనెను. అని వెనుకకు విఱుచుకొని పడి పోయెను.

మునసబుకరణములు వచ్చిరి. సులతానును పట్టుకొని పోయి బండకొయ్యలోఁబడవైచిరి.

3

శాంతయ్య మోసాలకుముందు సులతానీ తనను తాను మరల తెలిసికొనెను. తనమీఁదనున్న మట్టికొమ్మలు విసిసకత్తి చేయు పనిని చేయుచుండెను. ఏఁటిరింతలు బాలసూర్యునకు బాకా లూఁదుచుండెను. పడ్రంగిపిట్టలు ఎఱ్ఱతలపాగలు పెట్టుకొనిన పోలీసులవలె చెట్టు పైకొమ్మలనుండి చూచుచుండెను

సులతానీ మట్టియూడ పట్టుకొని లేచికూరుచుండెను. శాంతయ్య ఎదురుగా వచ్చెను.

'బాబయ్యా! మీకు దణ్ణం. మీరే నాకు తండ్రి. మీరే నాకు తల్లి' అని సులతానీ లేచి శాంతయ్యకు కేశ పెట్టెను. శాంతయ్య మోమును అటులెప్పుకొనెను. సులతానీ,

గుమ్మముకడకు వెళ్లి 'అమ్మా! అంట్లు వెయ్యండి! తోలిచి పుతే పోతాను' అనెను.

శాంత లోపలినుండి వచ్చి నివ్వెఱపోయి 'ఈరాత్రి నీకు తెలివిలేదు' ఒడలంతయు కదుములు కట్టిపోయె. అప్పుడే పని చేయుటకు నీకు సత్తువ ఎక్కడినుండి ఊరెనే!' అనెను.

'చేయకపోతే ఎల్లాగమ్మా!'

'నేఁడు నేనే చేసికొందును గాని పాలేరును తీసికొని నీవు ఇంటికి వెళ్లు!'

'నేనే పాలేళ్లను ఇంటికి పంపగలను, కాని అంట్లు వెయ్యండి తోలుస్తాను.'

శాంత ఏమనుకొనెనో ముఖము ముఱికటించుకొని అంట్లు పడవైచి లోనికి వెళ్లిపోయెను. సులతానీ అంట్లన్నియు తీసికొని మామిడిమొక్క క్రిందికి వెళ్లి కూరుచుండెను. లోఁగడ కుండలో పోసియుంచుకొనిన నీటిలో గిన్నెలు తోలుచుచు తోలుచుచు 'అబ్బ' అని అనుకొనెను. చేతినుండి గిన్నె జాఱెను. తల గిఱ్ఱున తిరిగెను. మావి మోక కానుకొనెను.

కొంతసేపటికి ఒడలెల్ల పరికించి చూచుకొనెను. కనుల వెంట నీ రోడఁదొడఁగెను. అతిప్రయత్నమున వెక్కు లాఁపుకొనెను. శాంతయ్య ముంగిటికి రాఁగనే గిన్నెలు చేతఁబుచ్చికొని సులతానీ ఎదురుగా వచ్చెను. దానిపచ్చనిశరీరముమీఁద చబుకు దెబ్బలు శాంతయ్యకు కానిపించెను. శాంతయ్యకనుల

నీరు గ్రమ్మెను. సులతానీ కనులును నీటఁదోఁగెను. ఒక రొకరు మాటాడకుండ కొంచెముసేపు అటులు నిలువఁబడిపోయిరి.

'సులతానీ! నిన్ను మా అమ్మవలె పోషింతును. మా యింటఉండిపో! కూడుగుడ్డలిత్తును. భగవంతుని తలఁచుకొనుచు కాలము గడుపు!' మని శాంతయ్య అనెను.

'అయ్యా! దేముఁడింకా నా తలలోకి దిగలేదు. నాకు సులతానే దేవుఁడు. కాని తమరిని ఒకటి వేడతా ' అని సులతానీ అనెను.

శాంతయ్య ఈమాటలతో కొంతవిరక్తి కొంతరక్తియు చెంది 'ఏమి టావేడికోలు ?' అని అనెను.

'మీవద్ద నేను దాచికొన్న సొమ్ము నేనుచచ్చినాసరే సులతానుకు ఇవ్వద్దు; ఇది ఒకటే నాకోరిక' అని సులతానీ అనెను.

శాంతయ్య మాటాడకుండెను. శాంతవచ్చి 'మీదగ్గఱ ఆకాసులు ఉంచవద్దు; దానికే ఇచ్చివేయుఁడు, సులతానే దీనికి దేవుఁడైనపుడు ఈకాసులు ఆదేవునకే నివేదన చేయవలసి ఉండును. మీదగ్గఱ ఉన్నచో, ఆడబ్బుకోసము కూనీలు అయిపోవును' అని అనెను.

సులతానీ శాంతను ఆచి చూచెను. పిదపశాంతయ్య కేసి తిరిగి 'అయ్యా! అలాగైతే ఆబాధ నేనే పడాలి; నాకే ఇచ్చివెయ్యండి' అనెను.

'సరే, ఆలోచించి మరల చెప్పు! ఇచ్చివేయుదును.' అని శాంతయ్య అనెను.

సులతానీ, గిన్నె లన్నియు వానివాని తావులలోఁబెట్టి ఇంటిపని యొల్లయు మెల్లగాఁజేసి శాంతయ్యకడకు వచ్చి 'బాబూ! నేనిఁక మీపాదాలకడనే ఉండిపోతా' అని అనెను.

'సులతానును వదిలివేయుదువా?'

'వదిలేస్తా.'

'భేష్. అలాగే ఉండిపో! ఇఁక నీకు శ్రీరామరక్ష' అని శాంతయ్య అనుచుండఁగా శాంత వచ్చి నీవేపుని రాత్రిచూచి కొందువుగాని. ఈపూఁట ఇక్కడే అన్నముతిని పొద్దుక్రుంకు దాఁక ఉండు!' అని అనెను. సులతానీ జేజేపెట్టి 'సరే నమ్మా!' అని అనెను.

ప్రొద్దు గ్రుంకుచుండఁగా మునసబుకడనుండి తలారి శాంతయ్యకడకు వచ్చెను.

వచ్చుచు వచ్చుచునే తలారి — 'ధొరగారూ! సుల తానుగాడు చంక కింద కత్తి దాచుకున్నాడు. రాత్రి ఎవరికీ కనబడలే. పొద్దున్నే కనబడింది. మీకు కాస్త ఈకబురుచెప్పి తీసుకో రమ్మన్నారు'

ఈమాటలు వినుచు శాంతయ్య సులతానీ మోమును జూచెను. ఆముఖమునఁగాని ఆకనులఁగాని ఇసుమంతేని భేదము లేదు.

'సరే వచ్చుచున్నాను పద' అని శాంతయ్య అనెను. ఇటులు అని వెంటనే కఱ్ఱ దీసికొని తలారి ముందు నడుచుచుండఁగా శాంతయ్యకచేరీచావడిలోనికిఁ జనెను. ఎదురుగా బండ కొయ్య లో సులతాన్. వానిని జూచుచు వాని ప్రక్కనే పరమానం దాయి. వాని ప్రక్కనే ముసికోల పుచ్చికొని గ్రుడ్డిగురవాయి.

౪

గ్రామమున నేదేని విశేషము జరుగుఁగాక అది అంద ఱకును పిలువని పేరంటము.

ముందర ఒక ఎల్లయ్యయు పిదప నొక పుల్లయ్యయు వచ్చి దూరముగా నిలువఁబడి చూచిరి. పిదప నొక ఎల్లమ్మ పిమ్మట నొక పుల్లమ్మ. తరువాత తట్టాయ బుట్టాయ కట్టాయ కంపాయ. పిమ్మట మేఁకలు గొఱ్ఱెలు ఆవులు బఱ్ఱెలు— ఇది యెల్లయు నొక మహాసభ. రమ్మనువాఁడు లేఁడు; పొమ్మను వాఁడును లేఁడు—స్వారాజ్యము. అచటి స్థలము సార్వజని కము, కాలము సార్వజనికము, కొంతగుండా రాజ్యము.ఒకఁడు 'కొట్టు' అనుచో రెండవ వాఁడు 'పొడు' అనియు చెప్పును. దానితో తేనెపెర కదిలినటులు అందఱును 'కొట్టుకొట్టు,పొడు పొడు!','పాపం' అని ఒకఁడనుచో రెండవవాఁడును 'అయ్యో పాపం! వదిలెయ్యండి'. అందఱును కలిసి 'వదిలెయ్యండి వది లెయ్యండి వదిలెయ్యండి వదిలెయ్యండి.

సూర్యుఁ డీ మహాసభ నుండి ఎవరికిని తెలియకుండ

తప్పుకొనెను. అది పిరికితనమో మంచితనమో యెవరికిఁ దెలియును! చీఁకటి జడవలె అల్లుకొనియెను.

మానసబుగారు లేచి అందఱను చూచి వీడు సులతానీని కొట్టాడు కాబట్టి, వీడికిన్నీ అదే శిక్ష. 'ఒరే గుడ్డిగురవా! వీణ్ణి గదిలోకి తీసుకపోయి తడికె మూసి ఇరవై దెబ్బలుకొట్టు! కళ్లు కనబడక గోడలను కొట్టేవుసుమీ' అని అనిరి.

గురవాయి లేచి గ్రుడ్లుత్రిప్పుచు మునికోల సవరించుచు— 'ధొరగారూ! అంధరికీ మొహంమీద కళ్లుంటే గురవాయికి చేతులమీద ఉన్నాయి' అని అనెను.

పరమానందాయియు నందాయియు సులతానును బండకొయ్యనుండి తీసి గదిలోనికి తీసికొనివెళ్లిరి.

చూడవచ్చిన మహాజను లందఱు 'సరియయిన శాస్తి అయిన'దనిరి. కొందఱు వెళ్లిపోఁదొడఁగిరి. జంతుజాలము కొంత అటు, కొంత ఇటు, పోఁదొడఁగెను. పిల్లలు నలిఁగిపోవుచుండఁగా పెద్దలు రెక్కలు పట్టుకొని అవలికి ఈడ్చుచుండిరి.

ఆ గందరగోళములో ఎవరికిని దెలియకుండ తడక మెల్లగా తొలఁగించి సులతానీ గదిలో ప్రవేశించెను. సులతానీని చూచి సులతాను ఆవురు మనెను.

'కొట్టినప్పు డిల్లా లేదేం?' అని గురవాయ అనెను.

సులతానీ తన కుడి అఱచేయి పైకెత్తి ఎడమచేతి

చూపుడువేలు పెదవులమీఁద నిలువుగా వేసికొని గుర్తు జూపెను.

సులతాను తెలిసికొని కిక్కురు మనకుండెను. 'చేయి చాఁపు!' అని గురవాయి గద్దరించెను.

సులతానును ఒకమూలకు త్రోసి సులతానీ తన కుడి చేయి చాపి ఎడమచేతి వ్రేలితో సులతానును పొడిచెను. తెలిసికొని 'చాపాను' అని సులతాను అనెను.

'ఏదీ?' అని గురవాయి పట్టుకొన వచ్చెను. వెంటనే సులతానీ సులతాను చేయి అందిచ్చెను. గురవాయి తడవి చూచుకొనెను. సరిగా వెనుకకు నడచెను. చేయెత్తి దైవమునకు మ్రొక్కుకొనెను.

వెంటనే సులతానును మూలకు త్రోసివైచి సులతానీ తనచేయి చాఁపెను.

సులతానీ చేతిమీఁద దెబ్బలు ఫళఫళ మోఁగెను. ఆ చేతినుండి రక్తమే జాఱెనో, రాగమే జాఱెనో ఆచీఁకటిలో ఎవరుచూచిరి? దాపుల నున్న సులతాను చూచెనా!

గురవాయి తనపని ముగించుకొని తడక తెఱచెను. సులతానీ సులతానును ముందులకు త్రోసెను. గురవాయి ముందు నడవఁగా సులతానూ వెనుక వెళ్లెను.

'ఎక్కడి దొంగ లక్కడ గప్ చిప్' అని మనసుబుగా రనిరి.

తుమ్మెదలవలె సంగీతములు తీసికొనుచు ఎక్కడివా రక్కడికి పోఁదొడఁగిరి. సులతాను తపకకేసి చూచుచు ముందు ముందులకు నడచెను. వాని వెనుకనే శాంతయ్య.

సులతాను వెనుక వెనుక చూచుచునే నడచుచుండెను. 'దుతెవరును కాదు; నేనేరా' అని శాంతయ్య అనెను. సులతాను ఏడుపు నాఁపుకొనలేకపోయెను. వెక్కి వెక్కి ఏడ్వమొదలిడెను.

'పాపము! దెబ్బలు బాగుగా తగిలెఁ గాఁబోలు' అని శాంతయ్య అనెను.

'కాదండి బాబూ! ఆ దెబ్బలు తిన్నది సులతానీ' అని సులతాను వెక్కి వెక్కి యేడ్వఁ దొడఁగెను.

శాంతయ్య నిర్ఘాంత పోయెను. జరిగిన సంగతి యంతయు సులతాను చెప్పెను. శాంతయ్య ముక్కుమీఁద వేలు వైచికొని నిలువఁబడెను

శాంతయ్య కొంతసేపటికి 'వెంటనే సులతానీని ఇక్కడికి తీసికొనిరా!' అనెను.

సులతాను వెనుకకు కాలు పెట్టుటకు కొంత తచ్చాడెను. శాంతయ్యకు విరక్తి కలిగెను. 'నేనేవెళ్లి తీసికొని వత్తును' అని అతఁడనెను.

మొగసాలనుండి ఈ ప్రసంగము నంతయు వినుచున్న శాంత ఎలుఁగెత్తి--'సులతానీ ఇక్కడికి వచ్చెను' అని అనెను.

శాంతయ్య గబ గబ లోని కేగెను. వెనుకనే సులతాను. వాని వెనుకనే మెలమెల్లగా పరమానందాయి.

౫

వాకిట వ్రేలాడుచున్న దీపమముందు సులతానీ నిలువఁబడి యుండెను. దీపములో నున్న జడతేజస్సును ఒకతూరి, సులతానీముఖములోనున్న చేతన తేజస్సును ఒకతూరి, శాంతయ్య రెండుమూఁడుసారులు చూచెను.

సులతానీ తనచేతిని వస్త్రములో దాఁచికొనెను.

ముందుకు మెలమెల్లగా అడుగులు వేసికొనుచువచ్చి సులతాను నిలువఁబడెను. వాని వెనుక పరమానందాయి.

'చూచితివా నేఁటి తమాషా? చెప్పెనా నీకు సులతానీ?' అని శాంతయ్య శాంతతో అనెను.

'ఆ దానిదేవుని సులతానును రక్షించెనని మీరును సంతోషింతురేమి' అని శాంత యనెను.

'పనికిమాలినదానా! నీకెప్పుడును తొందర! ఇవ్వేళ వానికి బదులుగా ఈ దెబ్బలు తిన్నదియు సులతానీయే' అని శాంతయ్య అనెను.

శాంత కనులు రెండును ఏకాగ్రము లాయెను.

సులతానీ వెనుదిరిగి చూచెను—దూరముగా సులతానును పరమానందాయియు! సులతానీ, ముఖమును మరల

ముందులకు త్రిప్పుకొనెను. దాని ముఖమున కూర్పేమియు లేదు.

ఇంతలో ప్రకృతికి వచ్చి శాంత అది యేమిటి?' అనెను.

'సులతానీ! ముసుఁగునుండి నీచేయి తీసి చూపు' అని శాంతయ్య అనెను.

సులతానీ చూపలేదు.

'సులతానీ! నీలో ఒకతేజస్సు ఉన్నదని నాకు మొదటి నుండియు తెలియును. కర్మ చాలక ఇక్కడ పడితివి. నీవిఁక మాయింటివద్ద ఉండిపో. నిన్ను మాఅమ్మవలె చూచుకొందును. భగవంతుని తలఁచుకొనుచు కాలము గడుపు!' మని శాంతయ్య అనెను.

శాంత చేరువకు వచ్చి 'సులతానీ! చేయేది చూపు చూపు!' అనెను.

సులతానీ ఏమి యోచించుకొనుచుండెనో శాంత మాటలుగాని శాంతయ్యమాటలుగాని వినలేదు. అపుడు తలయెత్తి చూడఁగా తన యెదుట శాంతయు శాంతయ్యయు నుండిరి. అది వెంటనే వారి యిరువురికి సాష్టాంగనమస్కారము చేసెను. దాని చేతినుండి రక్తము స్రవించుచుండెను.

సులతానీ సొమ్మ దోఁగెను.

శాంతయ్య నీరుతెచ్చి మొగము మీఁద కొట్టి చేతికి కట్టుకట్టెను. శాంత విసరుచు నిలువఁబడెను.

సులతాను దగ్గఱకు వచ్చి—'అమ్మా, మీరు విసరఁ గూడదు, నేను విసురుతాను, అని అడ్డము వచ్చెను.

'అంట్ల వెధవా! ముల్లా దెబ్బలు కొట్టించడానికి నడుము చేరావా?' అని పరమానందాయి దగ్గఱకు వచ్చెను.

సులతాను గుడ్లుఱిమెను. పరమానందాయి పండ్లు పట పట గొఱికెను.

సులతానీ లేచెను. చూపుడువేలితో వారిరువురిని బెదిరించెను.ముడియెద్దులవలె ఇరువురును ఎకముగా నిలువఁబడిరి.

సులతానీ శాంతయ్యనుజూచి 'అయ్యా! నా దోమనవి' అనెను.

'ఏమిటి?'

'తమవద్ద నా కాసు లిప్పుడు సిద్ధంగా ఉన్నవా?'

'ఉన్నవి.'

'పరమానందయ్యవద్ద నేనుండగా కూలీ నాలీ చేసి సంపాయించాను. అవి ఆయనవి. ఆయనకు ఇచ్చెయ్యండి బాబూ!'

'మంచిది.'

'నేను తమ యింట్లో ఉంటే తమకూ బరువే అవుతుంది' ఈమాట సత్తెం'

'కాదు' అని శాంత.

సులతానీ శాంతమాట వినిపించికొనక శాంతయ్యను చూచుచు, 'అయ్యా దేవు డింకా నాతలలోకి దిగ లేదని పొద్దున తమతో అన్నాను. ఇందాక దెబ్బలకుముందు నాతల లోకి దిగాడు.'

శాంతయ్య పెదవులపై చిఱునవ్వు కానిపించెను. శాంత తెల్లపోయి చూచుచుండెను. సులతానును పరమానందాయియు ఆశ్చర్యపడిరి.

'ప్రాణాలయినా ఇచ్చే నేస్తం నాది. మళ్లా నాకు మళ్లే ప్రాణాలిచ్చే నేస్తం నాకు దొరకక లేదు. ఇక అక్కర్లేదు'

సులతానును పరమానందాయియు తలలు వంచుకొని నిలువబడిరి

'బాబూ! నేస్తంలో చేదు విఱిచి తీపి సంపాయించాలి. నేను తమకూ బరువు మోపను. నేనూ బరువు మోయను. చిచ్చు మెత్తుకొనే బికారినయి పోతా. తిరుపతి వెంకన్నకు కానిస నవ్వుతా. నా కిక వెయ్యి నామములవాడితోనే నేస్తం. నాకు మీరందరూ సెల విప్పించండి.'

# తన్మయత

౧

"ఇంకను రాలే దేమి?" అని రాజకుమారి ఇందుకీర్తి అనెను.

"ఇంత జాగేల!" అని మహారాజాధిరాజు ఇందుకేసరి అనెను.

ఈచబుకులతో భటు లందఱును వెలికిఁ బరుగిడి చూచి వచ్చి "ఇదె వచ్చి రిదె వచ్చి" రని మనవి చేసిరి.

కోమటిపెద్దయు, కోటీశ్వరుఁడును, వృద్ధుఁడు నగు విజయమాలియు, నతని కుమారుఁడు మలయమాలియు, వడివడిగా సింహాసనముకడకు వచ్చిరి. విజయమాలి తూలిపడి దానిని సాష్టాంగదండప్రణామముగా పరిణమింపఁ జేసెను. మలయమాలి రాజకుమారికి కనులప్పగించి నిలువఁబడిపోయెను.

రాజ్యలక్ష్మి, వీరలక్ష్మి అను దాసికలవలన మలయమాలి ఇందుకీర్తిసౌందర్యమును పలుమాఱులు వినియుండెను. "చూడనపుడు చెవులే దొడ్డవి" అని యతఁ డనుకొనెను.

కొందఱు భటులు కొన్ని పెట్టెలు తెచ్చి విజయమాలి కనుసన్నలచే సింహాసనముముం దుంచి ప్రక్కల నిలువఁబడిరి.

---

*చూ. కథాసరిత్సాగరము ౧౨ లం. ౫ తరం. ౨౮౮—౩౧౦ శ్లో.

ఇందుకేసరి కోమటిపెద్దను చూపులచే గారవించి "సముద్రయానము సంతోషకరమాయెనా ?" అని అడిగెను.

"దేవరవారి దర్శనమువలె" అని విజయమాలి ప్రత్యుత్తరించి, రాజకుమారిని రెప్పవాల్పక చూచుచున్న కుమారునిఁ జూచి, "నాయనా! ఆ పెట్టెలో... అల్లదిగో... ఆ పెట్టెలో"

మలయమాలి ఉలికిపడి తండ్రిని జూచెను. విజయమాలి "-ఆ పెట్టెలోని ఆణిముత్తెములు తీసి యిమ్ము" అని యనెను.

మలయమాలి పెట్టె తెఱచి అందలి యాణిముత్తెములఁ దీసి యిందుకీర్తికడకుఁ బోఁబోయెను.

"ఆఁగు మాఁగుము. నీ చేతులు మలినముగా నున్న" వని విజయమాలి తా నాముత్తెములఁ దీసికొని రాజసన్నిధికేఁ జని "మహారాజా, ఇవి శుక్తిపేశికలు: మఱి యివి కావేరిలోని ఆణిముత్తెములు. ఇవి దేవరకు కానుక" అని యనెను.

"ఇవి బుద్ధభగవానునకే తగిన" వని ఇందుకీర్తి యనెను

"తల్లీ! నా గర్భమున నీవే జనించితివి, కావేరీగర్భమున నివియే, జనించినవి" అని యిందుకేసరి యనెను.

"రాజకుమారికంఠశుక్తికిఁగాక మఱే దేని కివి తగును?" అని అనఁబోయి మలయమాలి వెంటనే నిగ్రహించుకొనెను.

"వీని కేమిగాని ముందు బుద్ధదేవుని జూపుము" అని ఇందుకీర్తి యనెను.

"జరాజీర్ణమగు నా యీదేహము భగవానుని మోయ నోఁచుకొనలేదు. నాయనా! చేతులు దులుపుకొని నీవే చెప్పి చేయించిన బుద్ధదేవుని పదిలముగాఁ దీసి నీవే దేవరవారికడ నుంపుము" అని విజయమాలి యనెను.

మలయమాలి సంతసించి, బుద్ధుని పైకిఁదీసి సింహాసనము నం దుంచి, తెర తొలఁగించి యిందుకీర్తిని జూచుచు నిలువఁబడెను. మలయమాలి లోఁగడఁ దాను జూచివచ్చిన సముద్రము లవణరాశి యనియు, యిందుకీర్తి లావణ్యరాశి యనియు ననుకొనెను.

ఇందుకేసరియు, ఇందుకీర్తియు వడివడిగా గద్దె డిగి బుద్ధునకు మోఁకరించి లేచిరి.

"ఇది యేమి రాయి?" అని యిందుకీర్తి యడిగెను.

"సింహళపు పాలరాయి" అని మలయమాలి అనెను.

"మేలుమేలు. ఇట్టి విగ్రహము చెప్పి చేయించి తెచ్చినందులకు నీయభిజ్ఞతను కొనియాడ కూరకుండఁజాలను" అని మలయమాలిని ప్రశంసించి యిందుకీర్తిని జూచి "నా భావనకిది ప్రతిబింబము. ఈ దేవుని వేణువనమునఁ బ్రతిష్ఠింతము" అని యిందుకేసరి యనెను,

"ఆప్రదేశమే సార్వజనికము. ఇంతియకాక అది మలయమాలివనమున కెట్టెదురు." అని యిందుకీర్తి యనెను.

"వేణువనము మా కానుకగానియుండుటచే మేమును ధన్యులము" అని మలయమాలి యనెను.

ఇట్లు అనుచుండఁగా చరాలున నటకు వినయజ్యోతి విజయంచేసెను. ఎల్లరు నతనికిఁ బ్రణమిల్లిరి. అతఁడా ప్రతిమను రెప్పవాల్పక చూచి "బుద్ధుఁడే యిచట నవతరించె" ననెను.

"ఈ యవతారమునకుఁ దగిన తావు?" అని యిందు కేసరి అనెను.

"వేణువనము."

ఈ యేకవాక్యత కందఱ మోములను వికసించెను.

"తమ సెల వగుచో శిల్పుల రావించి విహార మొనరించు యత్నము నాది" అని వినయజ్యోతి యనెను.

"నిర్మాణ మెంత కాలములో నగును?" అని యిందు కీర్తి యడిగెను.

"అయిదారేండ్లలో" అని వినయజ్యోతి పలికెను.

"తామిఁక ఆ ప్రయత్నమున నుండుఁ" డని యిందు కేసరి యనెను.

దివాణపు మొగసాలలో పదునాలు గంటలు మ్రోఁగెను. ఎల్లవారల మోములందును సంతసము మోసులెత్తఁగా మలయమాలి మోమున విచారము తాండవించెను.

"జీవకళ యుట్టిపడుచున్నటు లీవిగ్రహమును జేయించినందులకు మలయమాలి శిల్పజ్ఞుఁడు. ఈ కళాభిజ్ఞున కీహారము

పురస్కార మగుఁగాక" అని యిందుకీర్తి తనహార మొకటి తీసి యిచ్చి, "మలయమాలీ! నీకౌశల్యము మా విహారనిర్మాణము నకుఁ గూడఁ దోడ్పడుఁగాక. మఱి మాతో సఖ్యతయున్నపు డెల్లపుడు మీకు మాప్రసాదము ముక్తద్వారము" అని యిందు కీర్తి అనెను:

"తమ రసికత కెతఁడఁ ధమర్ణుఁ" డని మలయమాలి అనెను.

ఇందుకీర్తియు, ఇందుకేసరియు వినయజ్యోతిని భిక్షుకు లోనికిఁ గొంపోయిరి. మలయమాలిచూపుల కొసలు ఇందు కీర్తి మువ్వలువతుకలఁ దాఁకి విధురము లై పోయెను.

"నాయనా! పద" అని విజయమాలి అనెను.

"నీవు నడవవయ్యా" అని మలయమాలి తండ్రి వెనుక తడఁబడుచు వెనుజూచుచు నడవఁదొడఁగెను.

౨

మఱునాఁడు మలయమాలి పచ్చలతివాచిమీఁద దిండు వానుకొని కూరుచుండెను. సిద్ధుఁ డను భటుఁడు త్రాసు లోనగు పరికరములను దుడిచి లోపలి గదులనుండి అయాయా వస్తువులఁ దెచ్చి సెట్టిముందుఁ బెట్టుచుండెను.

"ఎక్కడి రాజకుమారి, ఎక్కడి మలయమాలి? అది మంగళముహూర్తము." అని మలయమాలి లోలోపల నను కొనుచు, ఆ రంగము నంతయు మనోనయనమునఁ బిలకించు చుండెను.

బేరగాండ్రు వచ్చుచుఁ బోవుచు నుండిరి. అందఱకును వెలలుచెప్పు మలయమాలి యిప్పుడు తన మానసమున నెలకొనిన మన్మథాకారణమున ఇందుకీర్తివెల తెలిసికొనుచుండెను.

విశ్వబ్రాహ్మణుఁ డొకఁడు వచ్చి మలయమాలిని జూచు చునే యతని పోలిమి గనిపట్టి యచట నిలువఁబడెను. 'కూరు చుండుఁ' డని సిద్ధుఁడు మరియాదచేయఁగా నతఁడు కూర్చుండి- "సెట్టిగారూ! చిన్నమువెల ఎటులున్నది ?" అని యడిగెను.

మలయమాలి ఉలికిపడి చూచెను. బేరగాఁడు మరల నడిగెను.

"ఏమీ ?"

"బంగారమువెల ఎటు లున్నది బాబయ్యా ?"

"మామూలే."

అపుడు బంగారువెల రెట్టికిరెట్టిగా నుండెను. విశ్వ బ్రాహ్మణుఁడు మఱి బేరమాడక "నూఱు చిన్నము లిప్పింపుఁడు" అని అడిగెను.

మలయమాలి మేలిమి దీసి ఒఱపిడిరాత గీచి చూచి "సింహాసనమునుండి లేచినపు డిందుకీర్తి యిటులే మెఱసిపోయి" నని యనుకొని దాని బేరగానిముం దుంచి ఆచి చూచుచుండెను.

"తూఁచి యిండు."

ఈమాట వినియు చూపు మరల్చుకొనఁజాలకున్న మల యమాలి బేరగాని మందలింపు విని విసుపుతో త్రాసెత్తి తూఁచుఁ

దొడఁగెను. "ఇటు లెంత బంగారము వైచినను ఇందుకీర్తితోఁ దులతూఁగునా!" అని తలఁచుచు మలయమాలి బంగారు కణికల నూరక త్రాసులోఁ గురిపించుచుండెను. నేలఁ దాఁకు చున్న యాబంగారము "న న్నింతగాఁ వ్యర్థముంపవల" దని ప్రాణాచారము పడుచున్నటు లుండెను. మలయమాలి యామే లిమిని బీఱకాయలటులు తూఁచి బేరగానిముందు పడవైచెను. బేరగాఁ డామేలిమిని మూటగట్టుకొని వడివడిగా రూకలు లెక్కించి కుప్పవోసి పయనిడెను. మలయమాలి యాకుప్పను జూచి "ఇటు లెంత కుప్పవోసినను ఇందుకీర్తి యగునా?" అని అనుకొనుచుండెను.

ఇంతలో నింకొక బేరగాఁడు వచ్చి "అరతికర్పూరము ఉన్నదా?" అని అడిగెను. మలయమాలి తల యూఁపి "ఇందు కీర్తి నాకు దాపుగా వచ్చి మాటలాడినపుడు పచ్చకర్పూరమే యాయెను" అని యనుకొనెను.

"ఏఁబది తులము లిప్పింపుఁడు."

మలయమాలితలలో పచ్చకర్పూరమే యుండెను. కావున బేరగాని చేతిలో పచ్చకర్పూరమే పడెను. అరతికర్పూరపువెలయే మలయమాలిపెట్టెలోఁ బడెను.

ఇంతలో మఱియొకఁడు వడివడిగా వచ్చి "కస్తూరి ఉన్నదా?" అని అడిగెను. మలయమాలిమానసము ఇందు కీర్తిశరీరసౌరభ మాఘ్రాణింపఁదొడఁగెను.

"అయ్యా, కస్తూరి-కస్తూరి?"

"ఆఁ."

కస్తూరి: ఆలస్యం చేయకుఁడు బాబయ్యా. వినఁబడ్డదా?"

"ఆఁ. వినఁబడ్డది. రాజకుమారీహృదయ సౌరభము నాఘ్రాణించుచునది, రాజకుమారీసుఖచంద్రుని చేఁ గోరఁబడు నది..." అని యిటు లాఁగక మలయమాలి చెప్పికొనుచుఁ బోవుచుండఁగా బేరగాఁడు "సెట్టిగారూ! రోగి దర్భలమీఁదికి పోవుచున్నాఁడు. నారాయణస్మరణమున కిది సమయము. తొందరగా కస్తూరి యిండు" అని అనెను.

మలయమాలి తన ధోరణి మాని ఇంత కస్తూరిఁ దీసి యిచ్చి "వెల యక్కఱలేదు" దని చెప్పి యాతనిని బంపివైచెను.

దివాణపుదాసి వచ్చెడు వేళ యగుచుండెను. అతఁ డత్తరొత్తి యాకసము దెసఁ జూచి, "ఓరీ సిద్ధా! ఇంటికిఁ బోయి క్రొత్తగాఁ దెచ్చిన మలయచందన మెత్తికొని రమ్ము" అని యాజ్ఞాపించెను.

ఆసందులో కొందఱు కొంటెబేరగాండ్రు వచ్చి కొన్ని వస్తువులఁ గొని ధనమొసగకయే మలయమాలిని మోసగించి వెడలిపోయిరి.

వీరలక్ష్మి సెలయేటివలె వచ్చి "సెట్టిగారూ! నాకు బజారులో చాల పని ఉన్నది. పెండ్లికొమార్తెగారి చీటి ఇదిగో! ఈవస్తువు లన్నియు కట్టింపుఁడు" అని ఒక చీటి మలయమాలి మీఁదఁ బడవైచి గబగబ వెడలిపోయెను.

మలయమాలి యాచీటిని కనుల కద్దుకొని యందలి ప్రతి అక్కరమును పరిశీలించెను. తరువాత దాని నతఁడు ముద్దులతో ముంచియెత్తెను. పిదప దాని నతఁ డెట్టెదుట నిడుకొని ఆలోచనలపాలాయెను.

వీరలక్ష్మి వచ్చి నివ్వెఱపడి "ఏమయ్యా, ఇంకను ఇటులె కూర్చుంటి వేమి?

"ఈ చీటి వ్రాసిన దెవరు?"

"క్రొత్తగా అడిగెద వేమిటయ్యా? పెండ్లికూఁతురు గారు మీకుఁ దప్ప మతొకరికి స్వయముగా చీటి వ్రాయరు. మలయమాలిగారియెడ వారి కంత అభిమానము. వారి అభిమానము. నిలుపుకొనుటకేని మీ అయ్య అసలు సరకీయఁడేమి?"

"ఏమిటీ? ఈ సరకులు చూడు." అని కొన్ని వస్తువులు వీరలక్ష్మిముందు పడవయిచి, మలయమాలి చీటిలోని వస్తువుల నన్నిటిని అనఁటియాకులలోను, సదాపనసయాకులలోను కట్టెను.

వీరలక్ష్మి వానిని దీసికొని రాజవీథి నంతయు గుమగుమ లాడించుచుఁ బోయెను.

అపుడు బేరగాండ్రు పలువురు రాఁబోదఁగిరి. మలయమాలి యుత్తడికిబదులు పుత్తడిని, గవ్వలకుబదులు రవ్వలను ఇచ్చి సిద్ధుఁడు రాకముందే దుకాణము మూసి యిలుదారిఁ బట్టెను.

3

మలయమాలి చేయించి తెచ్చిన బుద్ధవిగ్రహముచే రాజ ప్రాసాదమే విహారముగా మాఱెను. నాగరకులే కాక నాగరులంద అును బుద్ధునిఁజూచి మలయమాలికడకు వచ్చి యతనినిఁ బ్రశంస చేయకుండఁ బోవుటలేదు. ఇటులు మలయమాలి మేడగూడ నొక క్షేత్రమాయెను. కాని వారి ప్రశంసలుమాత్ర మా ప్రతి ఱకువలెనే యతనికిని వినఁబడుటలేదు. మలయమాలి నగరము నందే విద్య నభ్యసించెను. అతని కన్ని దర్శనములందును సహా ధ్యాయులు కలరు. అన్ని శిల్పములందును సహపాఠులుకలరు. "యోగికి వలయు నేకాగ్రతయు, జ్ఞానికి వలయు వివేకమును, దార్శనికునకు వలయు సూక్ష్మబుద్ధియు, కవికివలయు ప్రతిభయు ఈ ధనపిశాచమున కేలరా?" అని అనుకొనినవాఁ డొకఁడేని వారిలో లేఁడు. చదువుకొనునపుడు ప్రక్కలఁ బదివేల డప్పులు మ్రోఁగినను అతఁడామ్రోఁతయెడ బధిరుఁడు. ఎట్టెదుట సూర్యో దయమైనను అతఁ డంధుఁడు. అట్టి మలయమాలిని సహాధ్యా యులు, నుపాధ్యాయులును గొందఱు 'రాయి' యనియు, మఱికొందఱు 'గూబ' యనియు నేఁటికి నుపహసించుచుఁ బ్రశంసించుచుఁ బోవుచుందురు. నేఁ డతనిఁ జూడవచ్చిన సహా ధ్యాయులలో కలశుఁ డను కాసీఁడును, మంథరకుఁ డను చిత్రకారుఁడును నతనిఁ జూచి "నీవు తెచ్చిన బుద్ధుఁడు సర్వజ్ఞుఁ డయినచో నీవు కళాభిజ్ఞుఁడ" వని ప్రశంసించిరి. మంథరకుఁడు మలయమాలికి సహాధ్యేతయే కాక మిత్రుఁడు. ప్రకృత మితఁడు

రాజశిల్పి. ఇట్టి యీతని ప్రశంసగూడ మలయమాలిచెవి నాట లేదు. కావున వీరందఱును మహాబధిర బిరుద మొకటికూడ మలయమాలికిఁ బ్రసాదించి నిర్గమించిరి.

మలయమాలి తన ఉపవనమునకుఁ జనెను. ఎట్టెదుటి వేణువనమును విలోకించెను. అచట పలువురు పనిబాగులవాండ్రు విహారమునకు పునాదులు తీయుచుండిరి. అతఁడు తోటమాలిని చూచి "ఓయీ, ఈ తీయఁబడుచున్న పునాదుల కెదురుగా మన తోటకఱ యంతయుఁ దీసివైచి యిసుకకొటకొటా లెత్తింపుము" అని యాజ్ఞాపించి లోనికేగెను.

పలుతావులును, బలురంగులును గల పూవులు వనదేవతకు కచభార్యములై యంగరాగములై యలంకారములు నిండారించెను. తుమ్మెదలు కొమ్మకొమ్మకుఁ దిరుగు త్రిమ్మరు లగుటయకాక గాయకు లయిపోయెను. మలయమాలియు నిటులు గాయకుఁ డయిపోయెను:

పచ్చనివారిలో మిగులఁ బచ్చని చెంతయును నెమ్మనంబులన్
ముచ్చిలువారిలో మిగుల ముచ్చిలఁ గల్గిన దండకత్తెలం
దెచ్చగువారిలో మిగుల నెచ్చగునట్టిది నాదు డెందముం
బిచ్చి యొనర్చుచున్నయది పిన్న దదియ్యెడ నేడ నున్నదో !

ఏటిరింత లెవరి యింగితమునో యీలలు వేయుచుండెను మలయమాలియుఁ దన యింగితమును దెలుపుట కీలలు వేసెను. కోయిలలు కోకో యనెను. మలయమాలి చేతులు చాచి

ఆర్త్రార్తి మాని ఊచ్చునడి నిట్టూర్చెను. నాలు గడుగులలో నతని కొక కాటుకపిట్ట కానిపించెను. దాని కతఁడు చేమోడ్చి కనులు మోడ్చెను. పిదప ఇందుకీర్తి వచ్చుచున్నటులు భావించి యిటులు పద్యమల్లెను :

నీవు వచ్చుచుండఁగ నీముందు వరియాలువన్నె బంగరుడాలు పర్వులెత్తు
నీవు నిల్చినచోట నింగిపై నేలపై నెత్తావు లొలసి వెన్నెలలు కాయు
నీవు పోవుచువేసి నీ వెక్కు విశ్వంబు నీ చెంగు పట్టి నిన్ వెంబడించు
నీవు కన్నెత్తిన నివ్వెఱ నెల్ల చుక్కలు మోఁకరించు నీ కాలిముందు
నీవు కూర్చుండు నెడలను నీదు క్రింద, కాంతిచక్రంబు పీఠమై కానిపించు
నీవు నవ్వుందు నెడలను నెవ్వెలుంగు, పాపపూపాను వగును లావణ్యమూర్తి!

చంద్రుఁ డుదయించుచుండెను. అతఁడు దిగుడుబావికడ కరిగెను. దానిచుట్టును ఆకుఁబచ్చని పొదరుటీకములు. వానిలో ఎలపులుఁగుల యెలుఁగులు నీటిలో నంచలుఁగొంచలు. కనుసెవ్వలకు తగిలిన-మిగిలిన వేడుక.

అంతలో సశబ్దమగు వేణువనము నిశ్శబ్దమాయెను. కర్షకరు లందఱును శాకులవలె నెగిరిపోయిరి. పిమ్మటఁ గొంతసేపటికా ప్రాంతమును దిలకింప రాజకుమారి వచ్చుచుండెను. వైశ్యకుమారుఁ డామెరాకను గ్రహించి పొంచిచూచి——

వనదేవతవె మేలిపసిమినూకుంబచ్చ పట్టుచీరను మేనఁ గట్టినపుడు
రాయంచవే యందెరవళితో నడుగును బెట్టి వేఱడుగును బెట్టినపుడు
వీణవే చెలులతో విరిదమ్మినెత్తావి యసివాఱు తిరుగ మాటాడినపుడు
శారదపూర్ణిమాచంద్ర మోబింబంబవే యెట్టయెదుట మోమెత్తినపుడు

భాద్రపదమాసమున నమావాస్యవేళ, మాలధమ్మిల్ల ! వెనుకకు మరలినపుడు
హృదయదేవతవే యెట కేఁగినప్పు డేమి చేసినయపు డేమి యెంచినపుడు

అని పద్య మల్లి వెంటనే తనమీఁద నున్న సన్నని యుత్తరీయముఁ దీసి వేణువన ద్వారమునఁ బఱచి తా నావలి కేఁగి పరికించు చుండెను.

మునిముందు వచ్చిన యిందుకీర్తి యావలువను జూచి చుట్టుప్రక్కలఁ జూచెనుగాని యామె కచట నెవరును గానరా లేదు. 'అమ్మాయిగారనిన దేవత అని తలఁచుకొను వా రెవరో పఱచియుండురని' వీరలక్ష్మి అనెను.

"చూడవచ్చినవా రెవరో పాఱవేసుకొని పోలేదుకద!" అని రాజ్యలక్ష్మి ఆ యుత్తరీయమును దీసి దులిపి బుజముమీఁద వేసికొనఁబోయెను.

"ఇటు లిమ్ము" అని యిందుకీర్తి దానినిఁ దీసికొని వేణువనమున బ్రవేశించెను.

మలయమాలిహృదయము నృత్యమొనరించెను. తన యనురాగలతిక యిందుకీర్తి బుజలముఁలమీఁద ప్రాఁకిపోయె నని యతఁడనుకొనెను. తన ప్రేమయే యుత్తరీయమై యిందుకీర్తి నాచ్ఛాదించెనని యతఁడు మురిసెను. ఉత్తరీయమే మూక దూతియాయెనని యతఁడు సొగసెను. పునరుక్తులకుఁగాని, సంభావనలకుఁగాని విసువులేని కుతూహలముచే నతని హృదయమా గారయాయెను.

రాజ్యలక్ష్మియు, వీరలక్ష్మియు వెనుదిరిగి చూచిరి. ఇందుకీర్తి వెనుకఁబడియుండెను. చలువవెన్నెల వలువచేఁ గప్పఁబడి దవ్వుల నుండి వచ్చుచున్న యిందుకీర్తి మలయమాలి కొక రహస్య దేవతవలెఁ గానిపించెను. ఆలోచనము దెలుపు పాదవిక్షేపము లతో నామె దారితలకు వచ్చెను.

ఇందుకీర్తిబుజములమీఁద తన యుత్తరీయము మలయ మాలికిఁ జక్కఁగాఁ గానిపించెను. ఇందుకీర్తి యచట మఱొక మా అంతటఁ గలయఁగాంచెనుగాని, వృథా.

ఇందుకీర్తి ముందునడచుచుండఁగా దాసికలు వెనుక నడచి పోయిరి. ఇందుకీర్తిమూఁపుల మీఁద తానే పోవుచున్నటులు మలయమాలి తలపోసెను.

౪

సిద్ధా, ద్రవ్యముల నన్నిఁటిని సిద్ధపఱచితివా?
నా పేరే సిద్ధప్ప కాదటండీ?
అహాఁ? ఫేనక మున్నదా?
ఆఁ
దంతరాగము?
ఆఁ
వసనాంగరాగము?
ఆఁ
అలక్తకము?

ఆఁ

అంజనము ?

ఆఁ

అప్పుడచటికి వీరలక్ష్మి ఉడుకుపోతువలె వచ్చి "పెండ్లికొమార్తెగా రిప్పుడు ఓలలాడుటకు ఏటికి దయచేయుచున్నారు. గబగబ ఈ సరకులు కట్టుడు." అని మలయమాలివైపుఁగ ఒక చీటి పడవైచి "కోమటివాడలో పనిఉన్నది; ఇప్పుడే వచ్చితి నని రెండడుగులు వైచెను.

"ఉండు ముండను"

"వడిగావత్తుఁగదయ్యా, ఏమంతతొందర?" అని వీరలక్ష్మి మాట వినిపించుకొనక అంతర్ధాన మాయెను.

మలయమాలి కొంతసే పన్యమనస్కుఁడై కూర్చుండి పిదపఁ జీటితీసి చదివికొని 'సిద్ధా' అనెను.

ఆఁ

వెనుకటివి కాక స్నానోద్వర్తనచూర్ణము, దీపవర్తికలు, శిష్టాకము, శైలజముకూడ పొట్లములు కట్టుము.

సిద్ధుఁడు వాని నన్నిఁటిని చక్కని పండుటాకులలో అందముగాఁ గట్టుచుండఁగా మలయమాలి మఱొక ప్రపంచము కట్టుచుండెను. ఇంతలోఁ దనకు క్రొత్తమేడ కట్టిన పనివారలలో పెద్ద, ఒక పెద్ద బహుమతికొఱకు వచ్చి మలయమాలికి నమస్కరించెను.

మలయమాలిమానస మపుడు ఇందుకీర్తిని పూలతో పూజింప నాలోచించుచుండెను. కావున నతఁడు "మంజరీ, నీవు పూఁదోఁట కేగి పూగుత్తుల నన్నిటిని గోసికొనిరమ్ము" అనెను.

అయ్యా, నేను మంజరిని గాను. తరుమేడ గట్టినవాడను.

మలయమాలి కన్నులఁ దెఱచి చూచి "ఆఁహాఁ. ఓరి సిద్ధా, నీ వేగి వెంటనే పూలఁ గొనిరమ్ము" అనెను.

సిద్ధుఁడు నిర్గమించెను.

మలయమాలి యాపనివాని యాశ సంపూర్ణముగాతీర్చి యతనినిఁ బంపివైచెను.

అంత వీరలక్ష్మి వచ్చి "ఏమండీ సెట్టిగారూ, సుగంధాలు కట్టి ఉంపుడనిన ఇంత పరాకా!' అనెను.

నాపరాకును నీ వీమాత్రము సవరింపఁజాలవా?

ఎటులు ?

నీ విటనుండి సూటిగా ఏటికే వెళ్లినది

అమ్మో! బుద్ధఘట్టమునకు నడచిపోఁగలనా! నాకు వేయి కాళ్లున్నవనుకొంటిరా?

మలయమాలి మఱిమాటాడక సిద్ధుఁడు కట్టియుంచిన పొట్లము లన్నియు వీరలక్ష్మి ముందుపడవయిచెను.

"కట్టియునా యీమాటలు?" అని వీరలక్ష్మి వాని నందుకొని లేడివలెఁ బరువెత్తెను. మలయమాలి అంగడి మూసివైచెను.

ఈ రెండకుఁ జాఁచిన పొడవుమేడల జక్కవ లుపసంహరించుకొనెను వృక్షములు సూర్యోపాసనమునుండి లేచెను. మెఱుఁగెక్కిన సూర్యకిరణ ప్రవాహముచే నదియంతయు దర్పణసహస్రఖచితమై స్ఫటికభూమివలెఁ గనుపట్టెను. నేలయు, నింగియు పక్షుల నెపమునను, కాంతుల నెపమునను ఆనందమును చిమ్మెను. రాజప్రాసాదము నుండి సుగంధప్రవాహ మొకటి నదీప్రవాహమువలెను బ్రవహించెను. జనప్రవాహముచే నదీ ప్రవాహ మిసుమడించెను. మంద మధ్య వేగములచేఁ బ్రసరించు నదీతరంగములు సంకీర్తనముచే నామంత్రితుఁడైన వరుణుని చేతుల ననుకరించి మాలిన్యమును క్షాళన మొనరించుచుండెనో యన నొప్పెను.

అప్పు డిందుకీర్తి దాసీపరివేష్టితముగా నదిలోనికి దిగి బుద్ధుని స్తోత్రము చేయుచు ఓలలాడఁదొడఁగెను. దాసీజన మెల్లయు మాయాదేవి నోలలాడించుచు ప్రవాహముదిగువ స్నాన మొనరింప మొదలిడెను.

మునిఁగి లేచునపుడెల్ల దేవతలు పుష్పవృష్టి కురిపించిరో యన ఇందుకీర్తిమస్తకము పద్మములను, పాటలములను, మల్లియలను, మొల్లలను, వకుళములను, వంజుళములను వింతగా పైకెత్తుచుండెను. పైనున్న మోఁచేతివంపు మలుపు దిరిగి పుష్ప ప్రవాహ మొకటి సూటిగా తనమీఁదికే వచ్చుటా మె కక్కజము కలిగించుచుండెను. ఆమె స్నానము ముగించువఱకును పూవు

లామె తల సలంకరించుచునేయుండెను. ఆమె దానికి కారణ మాలోచించుచునేయుండెను. దాసీజనములు తియ్యగా పాడు బుద్ధునియోలపాటలు జలజంతువుల కహింసావ్రతము నేర్పెను నదీతీరమెల్లయు వేదికాలంకృతమై వేదికలన్నియు బుద్ధాలంకృతములాయెను. సార్వజనికమైన ధ్యాననిద్ర యొకటి వ్యాపించెను. సూర్యుఁడాయుపాసికల వేపలిచెమ్మనేకాక బ్రహ్మారంధ్రములఁబట్టిన చెమ్మనుగూడఁ దుడిచివైచెను.

సూర్యుఁడప్పుడు తల వంచుకొని నదీదర్పణమున తన ప్రతిబింబముల నన్నిఁటిని జూచుకొనెను. వాయువు రాణివాసముల నెత్తావిచే బోఁకట్టి విశ్రాంతి గొనెను. మయూరములు మధ్యాహ్నసూర్యునకు సీసములను, ఎత్తుగీతులను పాడెను. స్నాతాయాతమైన జనప్రవాహము రాజవీథికంతకును నశాంతిచే శాంతి కలిగించి ప్రాసాదాభిముఖముగా నడచెను.

ఆయెడ సులయమాలి తన మేడ నెక్కుచు—

నీటను బుట్టినట్టి నలినీదళలోచన లక్ష్మివోలె నీ
వేట మునింగి లేచుతఱి నిచ్చిన యీ యభిషేకవారితో
పాటు మహానురాగపరిపాటికిరీటములైన యీ పారిత
పాటల నీలగౌరసిత పాండరపుష్పము లేదవే చెలీ.

అని కవన మల్లెను.

౫

అన్న పానముల మఱచి మేడమీఁదఁ గూర్చుండి మలయమాలి చంద్రు నందు కొనఁగోరెను. ఆ చంద్రుఁ డెంత దవ్వులనున్న నేమి ? వెన్నెల తనమీఁదఁ బడుచునే యుండెను. కిరణములు తనను దాఁకుచునే యుండెను. వానిని బట్టి లాగినఁ జాలు.

మలయమాలికి తన మేడమీఁద గాలిలేదు. ఉన్నను అది గాలి కాదు. దానఁ జైతన్యము లేదు. ఇందుకీర్తిగాలి యతనికిఁ గావలయును. అది యేడ దొరకును ? ఆమె ప్రాసాదమునకుఁ బోవలెను, బలే.

మలయమాలి యొకసారి యాకసము దెసఁ జూచెను. చంద్రునిపై కాఱుమబ్బు. దిగంతరాళమంతయుఁ గాటుకకొండ. ఈ యవరోధము రాజావరోధమునకు మార్గభిక్ష యిడునా?

మలయమాలి రాజమార్గము పరికించెను. చూపు చొరలేదు. దిగ్గజములన్నియుఁ గలిసి ఫూత్కారించినటులు సుడిగాలి వీవఁదొడఁగెను. మిన్ను విఱిగి నటులు మేఘము లఱచెను. మహానటుని ప్రళయతాండవమునకుఁ జోటుచేయఁ బ్రమథులు జలిపించుకొరడాలవలె మెఱుఁగులు దిగంతముల ముందు నాట్యమొనరించెను. కాలరాత్రి కాలఁద్రొక్కుటవలనఁ బడిన కంతల నుండి జలప్రవాహము దొణదొణ క్రిందఁ బడుచున్నదో యన మేఘములు కుంభవర్షము కురియఁదొడఁగెను. వాయుదేవుఁడు భూగోళమును నొక్కివైచునో యనునటులు తూర్పు పడమర

గాడ్పులు ఒండొండఁ గొట్టుకొనెను. ఇట్టి భీకరసమయమున మలయమాలి పిల్లివలె మేడదిగి రాజప్రాసాదముదెస నడువఁ దొడఁగెను.

విజయమాలి యిప్పుడు తన కుమారుని వేయికనులతోఁ కనిపట్టుచునే యుండెను. కావున మలయమాలిని ఇరువురుభటులు భూతములవలె వెంబడింపఁదొడఁగిరి

మలయమాలిని గాలి వెనుకకుఁ బడఁద్రోయలేదు; భటులను వెనుకముందులకుఁ గొట్టెను. ఉఱుము లతని వెఱపింపలేదు; భటులను బావురుమనిపించెను. మెఱుపు లతనికి మిఱుమిట్లు గొలుపలేదు; భటుల కన్నులఁ జిల్లులొనరించెను. వర్ష మతనిని ప్రధర్షింపలేదు; భటుల మేనులమీఁద బాదె లొనరించెను. మలయమాలిమానసమున ఇందుకీర్తిప్రాసాద మొకటియే యుండెను. అతఁ డప్పుడు దానిప్రాకారము దఱిసెను.

"అరెరే! పిట్ట తప్పించుకొనిపోయెను." అని ఒక భటుఁ డితరుని చెవిలో నూఁదెను.

"లేదు లేదదిగో ఆప్రాకారముమీఁద."

"ఆఁఆఁ, చూడు చూడు, పిట్ట మాయమౌచున్నది"

భటు లిరువురును క్రింద మీఁదఁ బడుచు లేచుచు కొంతదూరము వెనుకకు వచ్చి యచట నిలువఁబడి యాచిచూచుచుండిరి గాని కన్ను పొడుచుకొనినను లక్ష్యము కానవచ్చుట లేదు. సాహసమునకు సంతసించి మబ్బులు మలయమాలిని జూచి

నో యన నప్పుడు తళుక్కున మెఱుపులు మెఱసెను.

"ఓరే, మేడచివర చూడు."

"ఆఁ, ఆఁ, పిట్ట మేడమీఁద వాలినది."

"సరేకాని ఈపిల్లవానికి పిచ్చియెత్తలేదు కద ?"

"కాదు. మన మిప్పు డేమి చేయుదము?"

"పోయి ముసలికి చెప్పుదము"

మలయమాలి ఆమేడమీఁది మీఁద నిలువుచుట్టును ప్రదక్షిణము చేసెను. ఒక తలుపుగాని, ఒక గవాక్షముగాని లోపలనున్నవానిని మోసగించలేదు. అతఁడు నిత్యమైనను కలమాటలు తెలుప ప్రయత్నించెను. సింహద్వారమునకును, గవాక్షములకును చెవు లంటించి చూచెను. అతనికి తన హృదయస్పందముచే వినఁగలిగెను. అతఁడొక నిమేషము ఆలోచించెను. చరాలున నొక మెఱుపు మెఱసెను. కడపటికు రంగువైన గుట్ట వేసిన జేగురుకడిక లతని కంటఁబడెను. అతఁడొక కడిక దీసికొని, ద్వారోపాంతమున గారచే పాలుగాఱు గోడమీఁద—

మిన్నులం జూడఁబోవు నీమేడ యొక్క రాగవేగముచే ననురక్తుఁ డొకఁడు
దానిచుట్టు నశేందు ప్రదక్షిణంబు చేయుచుండెంగరవి కేలయూసు చెలియ ?

అని వ్రాయు సాహసమునకుఁ బూనుకొనెను.

ఇంటికడకు భటులు తెచ్చినవార్త విజయమాలి విని అనుక్షణమును పిడుగులకుఁ దలయొగ్గి వాకిటఁ దిరుగాడు చుండఁగా మెలమెల్లఁగా మబ్బులు మాయుచువచ్చెను. అతఁడు

తుపానునఁ బడి కొట్టుకొనిపోవుటకు సిద్ధపడియుండఁగా వాయువర్షములు చెట్టాపట్టాలు పట్టుకొని వెళ్లిపోయెను. ఆ రాత్రి యంతయు నేమియు జరుగనటులు తూరుపు రేకలు కానిపించెను. పోనపోన మలయమాలి కనఁబడుడు సంతసించి విజయమాలి వడివడిగా లోని కేఁగెను. మలయమాలి వలపుసురమూయి రాచుకొనిన కనులెఱ్ఱవాఱి వచ్చి తనమేడ యెక్కెను.

రాజప్రాసాదమున పిల్లనఁగ్రోవిపాట నగారామ్రోఁతతోఁ గలిసి పత్తనము సంతయు మేలుకొలిపి మరల నిద్రాభిముఖ మొనరించుచుండెను. ఘోషములందలి ఆవులరవము, లేగలయు ప్రశ్నప్రతివచనములు విశ్వప్రేమను వెల్లడించెను.

ఇందుకీర్తి మేడలోనుండి మైత్రేయుని పాటలు విన వచ్చెను. మేడముంగలి పిట్టగోడలపై దివియలు వెలిఁగెను. పలపలని చీఁకటిపిఱియుటతోపాటు తలతల మను వెలుఁగుతెర దిగంతరముల ప్రేలాడెను.

మాయాదేవికుమారుని ఓలలాడించు పాట ప్రారంభ మాయెను. ఇందుకీర్తి స్నాతానులిప్తయై బుద్ధునకు జోలపాడి మేడయొక్క సింహద్వారముముం దాఁగిపోయెను. "ఏమి యీ వ్రాఁత ?"

ఆమె దాపునకుఁ జని చదివికొనెను. "ఎవరు ? ఎవఁ డితఁడు ? మలయమాలి! మలయమాలి!'

"ఈ ప్రాకార మెటులు దాఁటెను ? ఈ చుక్కలమేడ యెటు లెక్కెను ? 'రాగవేగమున' నా ? ఔనౌను. ప్రేమ యను నిచ్చెన పురుషోత్తముని మహోన్నతమగు మేడనే యెక్కింపఁగలుగునపుడు తుచ్ఛమగు నీమేడ నెక్కింపఁగలుగుటొక లెక్కా ? విశ్వప్రేమచే బుద్ధభగవానుఁడు కత్తులబోను నుండి కదలిపోలేదా ? సెబాసు మలయమాలీ ! నీవు ప్రేమ నెఱిఁగికొంటివి. నేనే యీవల నుంటిని" అని యిందుకీర్తి ఆ పద్యమును తుడిచివయిచెను.

పిదప ఇందుకీర్తి బుద్ధునిముంగలికిఁ జని మోఁకరిల్లెను. ఆమె లేచి కూర్చుండి ధ్యానసముద్రమున మునిఁగెను.

అటుపిమ్మట ఇందుకీర్తి ఒక దాసిచే మంథరకునిఁ బిలిపించి, ప్రసంగవశమున మలయమాలికిని, అతనికిని గల మైత్రి నెఱిఁగి "మహాశయా, సమయము వచ్చినపుడు నీమిత్రునకు నా ప్రతికృతి యొకటి బహూకరింప మఱువకుము" అని యాదేశించెను.

అర్థము కాక మంథరకుఁడు "తమసెలవు" అని నీళ్లు నమలి సెలవు తీసికొనెను.

౬

మలయమాలి కిందుకీర్తిమీఁది రక్తిచే జగతిమీఁద విరక్తి కలిగెను. అతని మానసమున ఇందుకీర్తి బలసినకొలఁది అతని శరీరము చిక్కఁదొడఁగెను. అతఁ డిందుకీర్తిని లోపలఁ బెనుచుటచేఁ గాఁబోలు నతని శరీర మిందుపాండర మాయెను.

అతని శరీరము శుష్కించినకొలఁదియు నతని కాంతి పుష్కల మాయెను. అతఁడు స్నానానులేపనముల మఱచెను. అతని కన్నపానములమీఁద అరుచి కలిగెను. అతఁ డంగడిని విడనాడెను. పరిజనము సేవగించెను. మంచ మెక్కెను.

కొడుకునఁ బొడమిన యీయొడుదొడుకునకు తలిదండ్రులు తాఱుమా రయిరి.

"ధన్వంతరి నయినను సరే తీసికొనివచ్చి అడిగిన సొమ్మొసఁగి కొడుకుఁగుఱ్ఱ కౌషధ మిప్పింపుఁ" డని తల్లి యనెను.

"ఈవ్యాధి ధన్వంతరికి లొంగ దనియు, తగినసంబంధము త్వరలో విచారింపు" మనియు తండ్రి యనెను.

తల్లి తెల్లఁబోయి చూచెను.

తండ్రి నిట్టూర్చెను.

తమతోఁ దులతూఁగఁగల చక్కనిసంబంధ మొకటి తల్లి యేఱుకొనివచ్చెను. కొడు కా వియ్యమును వ్యర్థ మొనరించెను. తల్లి అందగత్తెల వెదకఁ బంపెను. కొడుకు లోలోపల కుమిలిపోఁజొచ్చెను.

విజయమాలి కోటికి పడగయెత్తినను కొల్లాయిగుడ్డతోనే కాలము గడపెను. అతనికి మహారాజాధిరా జధమర్జుఁ డైనను అతని ఇల్లు రాజప్రాసాదముకడ వినయము నేర్చికొనియే యుండెను.

మలయమాలిమానస మాకాశమున విహరింపఁబోడఁగిన దాడి అతఁడు కూడ నాకాశ మెక్కవలసివచ్చెను. కావున నతని మేడ రాజకుమారి మేడతోపాటు త్రిభూమముగా మారెను.

“పై కెగురకుము, పై కెగురకు” మని తండ్రి యాదేశింపఁగా “రెక్క లుంటకు ఫలమేమి?” అని కుమారుఁడు బదులాడెను.

మలయమాలి జాబిలి జూడఁగా అతనిమేడ చుక్కలఁ జూచెను.

మలయమాలి మంచమెక్కిన దిపు డాచుక్కలమేడలో. విజయమాలి రోఁజుకొనుచు మేడమె ట్లెక్కెను. “ముదిమిలో మేడయొక్క టొక శిక్ష” అని అనుకొనుచు అతఁడు మూఁడవ నిలువు జేరెను.

తలుపు బిడాయించియుండెను. ‘అయ్యా’ యని పిలిచెను. ‘అయ్యా లేదు, కొయ్యా లేదు.’

విజయమాలి కుమారుని నిరుత్తరతచే శిక్షను పూర్తిచేసికొని, బీగము మంద్రగబ్బవలె మొలనుండి వ్రేలాడ నంగడికి బయలుదేరెను. అతని కొంటిబాపఁ డెదురాయెను. అతఁడు వెనుకకు వచ్చి ఆచమించి కట్టుపాడుచుకొనుచు వీథిలోని కేఁగి అంగడి తెఱచెను. అంగడి తెఱవఁగనే బేరగాండ్రీఁగలవలె మూఁగిరి. వారు మలయమాలి నపేక్షించుకొనియుండఁగా వారికి లోపలఁ గనఁబడినవాఁడు విజయమాలి, పెద్దపులి!

"రండు, దయ చేయుఁడిదిగో తివాచి" యని విజయమాలి మరియాద చేయుచుండఁగనే ఇదె వత్తుమని దొరగాండ్రు పిట్టలవలె పాఱిపోయిరి.

పిదప విజయమాలి అంగడిలోని పెట్టెలన్నియుఁ దెఱచి చూచెను. అతని ధైర్యముతో పాటవి పట్టుపోయెను. తరువాత తాటాకులకవిలె తెఱచెను. ఒక పద్దేనియు వ్రాన లేకుండెను.

మలయమాలి పద్దు వ్రాయమాలి తానిచ్చిన సంచకరము లన్నియు మఱచెను. దాన నష్టము కలుగు సరకెల్లయుఁ బుచ్చికొనక తప్పకపోయెను. లాభము వచ్చు సరకు రాక పోయెను. ఇటులు అడిసాటా బేరమంతయు నడవిపాలాయెను.

విజయమాలి నోరు మూసికొనుటతో పాటంగడి మూసివేయుఁ దలఁచికొనినను తేనికి వెఱచి సిద్ధనంగడిమీఁదఁ గూరుచుండఁబెట్టి తా నింటికేఁజనెను.

అటుపిమ్మట విజయమాలి సరాసరి వెలయాండ్ర వాడలోనికేఁ జనెను. బాల్యసఖి మధురవాణి యెదురువచ్చి "మాకు నేఁడు తిరునాళ్లు" అని అతనిని లోనికిఁ గొంపోయెను.

"ఆఁ. కంచిగరుడసేవ మా మొగములనే ప్రేలుచున్నది."

"ఇప్పుడు మీకేమి హాని?"

"ఆఁ. అటు లడుగుము. ధనహాని, మానహాని, ప్రాణహాని, ఈ మూఁడును ఒకే సారి వచ్చి కూర్చున్నవి."

"అటు లగుచో మాయింట మకాము పెట్టెఁడు, మా వీధికి వచ్చి నలుబదియేండ్లు దాఁటెను"

"మన వాడలో ఇప్పుడు అందములో నందఱి తలదన్నినదియు, చదువుకొన్నదియు నగు ప్రౌఢ యొకతె యున్నదా?"

"ఇది యిప్పుడు ముదియ కాఁబోలు?"

"నీ నా మాట లగునెడల నేను మాత్రము ముదుసలిని కానా?"

"ముప్పది యేండ్లకే ఆఁడుది ముదియు. మగవానికి ముసలితన మేమిటి? నిన్న కాక మొన్న అబ్బిసెట్టి అఱువదవయేట కన్నెరికము పెట్టలేదా?"

"ఆకన్నెరికము పెట్టిన దబ్బిసెట్టి కాదు. ఒకటి—అబ్బిసెట్టి డబ్బు; రెండు—అబ్బిసెట్టి జబ్బు."

ఈ చివరమాట విని మధురవాణి విజయమాలి దవడ మీఁద చిటకరించి కోటీశ్వరునకుఁ ఇన్నాళ్ళ కట్టి జబ్బు ప్రవేశించినదా?" అనెను. విజయమాలి మఱి సైఁపలేక మధురవాణి చెవిలో తన కుమారుని సంగతి యంతయూ సంగ్రహముగాఁ దెలిపెను. మధురవాణి మొగము సుద్దయాయెను. విజయమాలి తల వాల్చి కూర్చుండెను.

కొంతసేపటికి మధురవాణి "బేజారుపడకు! మావాడలో ఇప్పుడు మనీష అని ఒకతె ఉన్నది. దానిని చూచుచో భీష్ముఁడయినను పెండ్లాడ వలయును" అనెను.

ఏమా భీష్ముఁడు ?

ఏమా భీష్ముఁడు రాజకుమారిని కాలఁ దన్నును

బిగ్గఱగా అనకు, బిగ్గఱగా అనకు. గోడలకు చెవులుండును. సరికాని, దాని నీరాత్రి పంపఁగలవా ?

ఇప్పుడే పంపఁగలనుగాని దానికి తగిన డబ్బు—

డబ్బులకేమి ? నీ వెంత వెలపెట్టిన నంత వెల యిచ్చెదను.

పెట్టె యిప్పు డట్లె అనును. చివరకు ఉప్పుఁగల్లు పెట్టి పంపును

అది లేనిదే రుచియే రాదు కదా ?

ఓహో ! చింత పితిగినను చేవ విఱుగలేదు. సరికాని, నీవు కుబేరుఁడవు; అది రంభ. ఇక నలకూబరుని అదృష్టము చూచుకో వచ్చును.

విజయమాలి తమలము పుచ్చుకొని గృహాభిముఖుఁ డాయెను.

౭

దైవము పేరు చెప్పి తల్లి ఆరేయి తొలిజామున మలయమాలిని మహానసములోనికిఁ దీసికొనివచ్చెను. ఆ సందులో మునీప మలయమాలి మేడ యెక్కెను.

"అన్నరసముకన్న ఆదరణరసము మే" లని అతనితల్లి యెఱుఁగును. కావున నామె కొడుకుమనసున నుల్లాసము కలుగు

వ్యాపారములయెడల జాగృతి వహించెను. మలయమాలి తల్లిదెస కొంచెము సుముఖత చూపెను.

అతఁడు ఆకు నాకి పాలు మూసూచి పంక్తు చేఁబూని తల్లికడ సెలవుగైకొనెను. తల్లి అందులకే సంతసించెను.

మలయమాలి మేడయంతయు సుపరిష్కృతమై స్నాత ధౌతుఁడైన వాస్తుపురుషునివలె నుండెను. అతని గడి దేవతలకుఁ గూడ కాలిడ జంకు కలిగించెను. అతని పాన్పు వెన్నెల నేకి నేయఁబడినటు లొప్పెను. ఒకమూల పాలరాతి ప్రమిదలో రత్నదీపము వెలుఁగుచుండెను.

మలయమాలి ఒక్కొకతలుపే మూసికొనుచు పైభాగమునకుఁ జేరి యిందుకీర్తి మేడకు సూటిగా నిలిచి చూచెను. భావనయను ఐంద్రజాలికుఁడు అతని యెట్టెదుట ఇందుకీర్తిని నిలిపెను. అతఁడామెకు స్వాగత మొసఁగెను.

ఇందుకీర్తిమేడలో దివ్వె వెలిఁగెను. మలయమాలినయన భ్రమరము దానిచుట్టును చాంద్రాయణ మొనరించెను.

వెలుఁగారెను. అతఁడచటనే అటులనే నిలువఁబడి పోయెను. అతని మానసము తన్మయమగుకొలఁది ఆతనిశరీరము పులకలచే కంటకితమై క్రమక్రమముగా నిట్రాడువోలె నిట్ట నిలుచుండెను. అపుడతని హృదయరంగమున ఇందుకీర్తి నిశితములగు తన చూపుల కందని పరువులతో బ్రహ్మాండము

చివర కేగి నిలువఁబడెను. ఇందుకీర్తి అవ్యక్తములోనికి దుమికెను. అతఁడు కుప్పన నేలఁగూలెను.

ఈ నవ్యప్రపంచానుభవము మనీషకిదియే మొదలు. కాఁక మిగిలి నేలఁగూలిన లోహవిగ్రహమువలెనున్న మలయమాలి ముంగలికి వచ్చి యామె నిలువఁబడెను. ఆమె జడప్రాయమయిన యాశరీరమునఁ బ్రేమసమాధిని గనులారఁ గాంచెను. భయభక్తులచేఁ, త్రాసకంపములచే, సమరాగనిర్వేదములచే శబలితమైన మనీషకపుడు పరిచర్యయే చేయవలయునో, ప్రేమాంజలియే యొత్తవలయునో యేమియుఁ దోఁపలేదు. చూపులో లీనమై యామెయును, ఆమెలో లీనమై చూపును ఆవిగ్రహము ముందు మఱియొక విగ్రహమై ఏకాంతమయిన యా మేడను దేవళ మొనరించెను.

రాచనగరిలో నడిరేయి నగారా మ్రోగెను. పారావారి హెచ్చరికలు దిగంతములఁ బ్రతిధ్వనించెను. నిశాదేవి తలవెండ్రుక లాఱఁబెట్టుకొనినటులు, వేఱులతో నేలఁ బాతుకొని పోయినటులు చీఁకటులు దట్టమాయెను.

మలయమాలి కొంచెము కదలెను. మనీష గదిలోనికి వచ్చి చాటున నిలువఁబడి చూచుచుండెను. మలయమాలి కొంచెముకదలి కనులుదెఱచి ‘ఇందుకీర్తి’ యని పిలిచెను. మనీష కీర్ష్యాప్రేమము లొక్కపెట్టునఁ బైకుబికెను. “ఎక్కడఁ జూచినను ఇందుకీర్తియే” యని యనుకొనుచు మలయమాలి

తన పానుపుకడకు వచ్చెను. అంత నతఁడు దానిని సౌగన్ధ్య మొనరించి యుద్యానము సౌగన్ధ్యము కావించెను.

"ఆహా! వలచినచో ఈ ప్రేమమయునే వలవవలయును" అని యనుకొనుచు మనీష తలుపుచాటునుండి రెండడుగులు ముందులకు వైచి నిలువఁబడెను.

మలయమాలి చూచి "ఓహో యిందూ! నీహృదయ మిసుమంత ప్రఫుల్లమయినచో రెక్కలు కట్టుకొని నేనే నీమేడ మీఁద వ్రాలెడివాఁడనుగదా" అనుచు చేతులు చాఁపి రెండడుగులు ముందులకు వైచి అది చూచి స్తబ్ధుఁడయిపోయెను. మనీష తొట్రుపడెను.

"ఓయమ్మా! నీ విందుకీర్తి కక్కవా, లేక చెల్లెలవా? ఆమె నిన్నిటకుఁ బంపెనా? అగునెడల నీ విపు డిచట కెటులు రాఁగలిగితివి?"

"వలచి వచ్చిన కసుమాల వెలయాలి కిటకు వచ్చుటకు దారియే లేకపోయినా!"

"నన్నా వలచితివి!"

మనీష తలవాల్చి యూరకుండెను.

మలయమాలి యొకసారి ఆమెను కలయఁ గాంచెను. ఆమెలావణ్య మతనిలోని యిందుకీర్తిని ప్రజ్వలింపఁజేసెను. అతని కిందుకీర్తి నుండియే స్త్రీత్వమును, లావణ్యమును ఉత్పన్న

మాయెను. అతని కిప్పు డిందుకీర్తికిని మిగిలిన స్త్రీలోకమునకును గల భేదాలు విశదముగా గోచరించెను. అతనిముం దేవతయు నిందుకీర్తి కాదు. ఒక సూర్యగోళము నుండి తేజఃకణములు వెలువడుచున్న చందముగా ఒక యిందుకీర్తి నుండి సౌందర్య కణములు వెలువడి స్త్రీలను సృజించుచుండెను.

మలయమాలి యిటు లనెను: "ఓయమ్మా! నీ సౌందర్యమునకు నేను వైతాళికుఁడను. నీ విందుకీర్తికి కుడియెడమగా నుండుటచే విశేషించి గౌరవభాజనమవు. నీవు నాకుఁ జెల్లెల వగుచో నెంత బాగుండి యుండును? ఐనను మిగిలిపోయినది లేదు. నీకు ధనము కావలయునేని రేపే నీయిల్లు బంగారమగును. నీవిట నన్నొంటరిగా విడిచి వెళ్లుము."

"నాకు ధనమేల? వలపునకును, ముసుపునకును అత్తకోడలివరుస. నేను నిన్ను ప్రాణములతో వలచితిని. నేను నిన్ను జూచికొనుచు నీముంగలఁ బడియుందును."

"వలదు వలదు. నన్నుఁ జూచుచుఁ గూర్చుండుట పున్నెమా, పురుషార్థమా? దైవము ముందు గూర్చుండుము. అది పున్నెము, పురుషార్థము. ఈ బొమ్మకడ నేమిలేదు, మట్టిరే!'

"పరుల కుపదేశించునెడల నీకన్న నే నేడాకు లెక్కువ చదివితిని. నేను నీపాదములంటి చెప్పుచున్నాను-నిన్ను నే వలచితిని"

మలయమాలి ఒక వెఱ్ఱినవ్వు నవ్వి వడివడిగా మెట్లు దిగి వెళ్లిపోయెను.

ప్రక్కగదిలో పొంచియున్న విజయమాలి మనీషకడకు వచ్చి "వెఱపింపఁబోయి వెఱచినచందము చేసితివే" అనెను.

ఆతనిమాట వినిపించుకొనక మనీష — "భూమిచివర నున్నను సరే మలయమాలిని నేను వలతును." అని మేడదిగి వెడలి పోయెను.

"అయ్యవారిని చేయఁబోవ కోఁతియైనటు లున్నదే! వహ్వా! ఒక పిచ్చికి తోడు రెండవ పిచ్చి." అని విజయమాలి ఏమియు దోఁపక మేడ దిగివచ్చి వాకిట నిలువఁబడియుండఁగా కొంతసేపటికి భటులువచ్చి "మలయమాలి తోఁటలో సుఖముగా ఉన్నాఁ"డని చెప్పి పోయిరి. విజయమాలి అంత నొక నిట్టూరుపు విడిచెను.

౮

ఆమఱునాఁటిప్రొద్దున నారదుఁడు రమాదేవిని రచ్చసావడి కీడ్చెను. ఇరుగు పొరుగులవా రందఱును "మలయమాలి లేచిపోయె"నని చెప్పుకొనిరి. వారి యిరుగుపొరుగులవా రందఱును "మలయమాలికి పిచ్చిరెత్తిన" దని చెప్పుకొనిరి. కోటవాడ యంతయు కోటీశ్వరునియింటికి వచ్చి పరామర్శ చేసిపోవుచుండెను.

విజయమాలి ప్రాణములు ప్రాణములలో లేవు. గోరు చుట్టుపై రోకటిపోటువలె ఈజనఘోష యేమి? లోకులు మంచి కంజలి పట్టక చెడ్డ కిటులు చెవాకులు చేసికొందు రేమి!

"విజయమాలి లేచిపోయె" ననువార్త పామరులలో దుర్గంధమువలె వ్యాపించెను. "తండ్రియే వెడలనడచె" నని ఒక డం డనుకొనెను. "విజయమాలికి పిచ్చియెత్తె" నని ఇంకొక డం డనుకొనెను. దానిమీఁద చిలవలు పలవలు వికసించెను. "విజయమాలిని బ్రహ్మచర్యమునకు బంధించుట తలిదండ్రులదే త" ప్పని మహాజనము తీర్పిచ్చెను.

ఈతీర్పే విజయమాలికి నగవు పుట్టెను. తాను కొడుకునకు పెండ్లి చేయవలెనా? కొడుకు చిన్నవాఁడా చిక్కవాఁడా? చదివినవాఁడా చదువనివాఁడా? అతనికే వధువును నచ్చదు. తా నేమి చేయఁగలదు? ఈమాట లెవరు విందురు? లోకము మూయు మూఁకు డున్నదా? విజయమాలి తలుపులు మూసికొని మరణదండనమును నిరీక్షించుచు మంచ మెక్కెను.

విజయమాలితల్లి గ్రామదేవతలకు మ్రొక్కుబడులు చెల్లింపఁ జనెను. అచటివారందఱు నామెను గాంచి "చేతులు కాలిన పిదప ఆకులు పట్టుకొన్న నేమి లాభము? ఎన్నఁడు లేనిది ఇతరదేవతలను—ఈబుద్ధులను ప్రబుద్ధులను కొలుచుచో చెడిపికొట్టవా?" అని అనిరి. ఈవల కుమారునిమీఁది వాత్సల్యము, ఆవల రాజదండనమువలని భయము! ఇటు చూచిన

నూయియు, అటు చూచిన గోయియునుగా ఆమె ఏమియు మాటాడఁజాలక మ్రొక్కుబడు లచటనే విడిచిపెట్టి యిలు దూఱె సిద్ధ నంగడినుండి రావించి కుమారుని కనిపట్టియుండు టకుఁ దోఁటకుఁ బంపెను.

విజయమాలిగృహాంతరాళమున పగటిపూఁటనే రాత్రి దేవత కాఁపురము పెట్టెను. లక్ష్మీదేవి కలకలలాడుచుండఁగనే జ్యేష్ఠాదేవి సివాలాడఁజొచ్చెను.

“తలుపు.”

“ఎవరు వారు?”

“పలుకకువే పలుకకువే” యని విజయమాలి సన్నగా అనెను.

“నేను రాజ్యలక్ష్మిని.”

విజయమాలి తలుపు తీసెను. ‘నేఁడు కొట్టు తెఱవ లేదేమి?’ అని రాజ్యలక్ష్మి చిఱునగవును పెదవులలోఁ సణఁచి పట్టెను.

“ఔరా! మఱచితిని. నేను వచ్చి యిచ్చెద” నని విజయమాలి రాజ్యలక్ష్మిని వెంటఁ బెట్టుకొని అంగడికిఁ బోయి వలసిన ద్రవ్యములిచ్చి దానినిఁ బంపివయిచెను.

కొంటెకోమటులు కొందఱు విజయమాలికడకు వచ్చి “మామా! నీవు రాజుగారి వియ్యంకుఁడవు, ఇఁక నీ కీ యంగడి

"యొందుల" యని వెతగా నాతని నొవ్వఁజాడిరి. మఱికొందఱు "శుద్ధబొద్ధుఁడ" వని దూయఁబట్టుకొనిరి. కొందఱు "బలి వేయుఁడు" మని బెదరించిరి.

విజయమాలిగుండెలు రాలుగా మాఱెను. అతఁడు దంగడిమూసి యిలువోయూరెను. దారిలో అల్లరిపిల్లకాయలు "అదిగో రాజాగారి విదూషకుఁడు, రాజాగారి విదూషకుఁడు" అని అఱవఁదొడఁగిరి. విజయమాలి చెవులు మూసికొని యింటికిఁ బరుగెత్తెను.

అతఁడా పగలంతయు నెట్టులో గడపి రాత్రి విజయమాలిని ఉద్యానగృహమునందున్న బంధములో నుంచెను. తన యుంతయు నపటనవటం నేలలో పాతిపెట్టెను. స్థిరాస్తి యంతయు వారి వీరిపేరఁ బెట్టెను.

విజయమాలి దాఁచ మఱచిన రవ్వయో యన వేగుఁజుక్క పొడుపుకొండఁ బొడిచెను. తూర్పుతెలవాఱమున ఉషాదేవి రవ్వలదుకాణము తెఱచెను.

విజయమాలి మోఁకాలుదిగని కొల్లాయ యొకటి కట్టుకొనెను. వాకిట ధర్భలపాన్పు పఱచెను. దాని ప్రక్కనే వంకరకఱ్ఱ యొకటి పెట్టుకొనెను. భార్యను బోసి చేసెను. వేల కన్నులు గల ఉత్తరీయ మొకటి కప్పుకొని ఆ దర్భశయ్యన నలంకరించెను. భార్యను కాళ్లకాడఁ గూర్చుండు మనెను. ఊఁ రెగిరిపోవునటు లేడ్వు మనెను. దివాలాతీసెను.

౯

వెఱ్ఱివానిని చూడ వేడుక. కావున మలయమాలితోఁట మనుజాకీర్ణ మాయెను.

మలయమాలి కా వనమే నందన వనము. ఆ యుద్యాన కుటీరమే వైజయంతము. మలయమాలి కానందనమున స్వేచ్ఛగాఁ దిరుగాడ వీ లుండెను. ఐనను ఇప్పుడతఁ డా వైజయంతము దాఁటఁ దలఁచుకొనలేదు.

హంసపది యను దాది చాటుగా నాతనిఁ జూడఁబోయెను. మలయమాలి ధ్యానములో నుండెను. హంసపది కనుల నీరు పెట్టుకొని "కోటికి పడగెత్తిన కోమటి కొంటెబిడ్డవు. కన్న కడుపున చిచ్చుపెట్టితివి. చిన్నప్పుడు నే నిచ్చిన పాలిటులు వెఱ్ఱిపాలగునని కలలో నయినను అనుకొనలేదు నాయనా!" అని ఆక్రందించి వెళ్లలేక వెళ్లలేక వెళ్లి పోయెను.

బట్టుకవి బాలరాజు వచ్చి చూచి—

"బంగారువంటి కోమటి
సంగీతముచేత బేరసారము లుడిగెనూ"

అని దీర్ఘము తీసి వెళ్లెను.

కలకంఠి యను పేరు గల కలహాకంఠి యొకతె వచ్చి కొంచె మాచి చూచి నెటిక విఱిచి - "పిచ్చియఁట? డబ్బున్నచో సరి - అది లేకున్నచో?" అని గద్దరించెను.

అలివేణి వచ్చి "పిచ్చికి మం దేయుచున్నను వాడు చున్నారా?" అని అడిగెను.

"నీకు పిచ్చి. ఆయన కేమి పిచ్చియే? మదపిచ్చికి మం దేమిటే? లొట్టిపిటకూల రోకళ్లకు గాని లొంగదు." అని కలకంఠి యనెను.

అలివేణి నోటికి గుడ్డ అడ్డముపెట్టుకొని కలకంఠిని చేకొని వెనుదిరిగెను.

కులముమాలి సహాధ్యాయుఁ డొకఁడువచ్చి ఆకుటీరము ప్రదక్షిణించుచు—

"మా పిగుడుబావిలో నొక
చేద స్తపు హంస తపము చేసెడి;| అది దా
మోదరనాభీకాసా
రోదితపద్మినినిఁ దక్క నొల్లదు చేసిన్."

అని పఠించుచు వెడలిపోయెను.

ఇటులు గురువులును, సహాధ్యేతలును, మిత్రులును, బంధుగులును, పరిచితులును, పరిచారకులును వచ్చి చూచి నివ్వెఱను, కోపమును, దయను, విచారమును, అమర్షమును, విషాదమును పొంది యెవరి యిండ్లకు వారు వెడలిపోయిరి.

వెనుక రాజకుమారి యిచ్చిన యాజ్ఞ యిపుడు మంథరకున కర్థమాయెను. అతని కలమును, కుంచెయు రాజకుమారిని

పరివేష్టించెను. అతని హృదయభ్రమర మామె రూప కుసుమ గుచ్ఛములోఁ దిరిగినకొలఁదియు నతనికలము మధుపూరిత మగుచువచ్చెను. అతని లోఁజూపునకు బంటగు వెలిచూపు చూచినటులెల్ల నతని చేతిలోని కుంచె యాడెను. అతని మానస మామె రూపదేశమును ప్రదక్షిణించుచుండఁగా నతని కల మొక లావణ్యమ్మూర్తికను పటకిలశమున నింపెను. అతఁడంత రంగసముద్రమును మథించి తూలికాగ్రముచె రఁగరించి అపూర్వమగు నొక నేత్రాలంకారమును పటాగ్రమునకుఁ దెచ్చి పొడవుగా నొక నిట్టూర్పు విడిచెను.

విజనముగా నున్నపుడు మలయమాలి యేమి చేయునో చూడఁదలఁచి కాఁబోలు సూర్యుఁడు నేలమీఁద మోము మోపి తన కిరణములను నా కుటీరములోనికిఁ బంపుచు, ఇటు మంథరకుని ప్రతిభను గొనియాడఁ గాఁబోలు తన కరములచే నొకతూరి ఆ చిత్తరువు నంటి తిగుచుకొనెను.

మంథరకుఁ డాచిత్తరువును చేలము చాటునఁ బెట్టుకొని మలయమాలి కుటీరమునకుఁ గొంపోయెను. చూడవచ్చిన వారందఱును వెడలిపోయిన తరువాత మసకమసక చీఁకటిలో మెలకువగా అడుగులు వేసికొనుచు పిల్లివలె నతఁడు లోనికేఁగి మలయమాలి కూరుచున్న కుటీరముచుట్టును దిరిగి లోపలను, వెలుపలను బరీక్షించి చూచెను. మలయమాలి మహాసమాధిలో నుండుట గనుఁగొని కుటీరములోని కడుగు దీసి యడుగు

పెట్టుచుఁ జని యతని యెట్టయెదుట నా చిత్తరువును నిలిపి యట నుండి దొంగవలె మెలమెల్లగా వెడలిపోయెను.

౧౨

కృష్ణద్వితీయ ఆకాశమున మంచుదీప మెత్తెను. భూధేనువు నాక్రమించిన దోమలు చీకటులు పాఱిపోఁదొడఁగెను. కోటికోటి వెలుఁగుగుత్తులతో కలకలలాడు నాకాశము మానవులకు వస్తుప్రదర్శనశాలయో యన భాసించెను. వెన్నెలపులుఁగులు వెంపరలాడెను.

అప్పుడు మలయమాలి కనులు దెఱచెను అతఁ డెదుట జూచి—"సహస్రబోధి జ్యోతులకు కేంద్రమైనది నీమోము. ఒకసారి నాకడకురమ్ము. ఈ ప్రదేశ మలంకరించి యెంతసేపయినది! ఆహా! ఎన్నాళ్లకు నాతపము ఫలించినది!" అని యెదురుచూచెను. కాని ఆ యిందుకీర్తి అతనికిఁ బ్రత్యుత్తర మీయలేదు. దాన మలయమాలి కొంచెము వికలుఁడాయెను.

అప్పుడు దక్షిణ దిఙ్నాయక మలయమాలిని జూచి నిట్టూర్చినదో యన మలయానిలము ప్రసరింపఁ దొడఁగెను. లతలు మలయానిలుని రాకకు సంతసించి తామై బిగ్గన కౌఁగిలి గొనుట చేతనో యన నెత్తావు లుబికి నాసికా పుటములకు తలమునకలాయెను. ఆచిత్రపటము కొంచెము ముందులకు వూఁగి గాలికిఁ గొట్టుకొని వచ్చిన తావి తనవిగాఁ జేసికొనెను.

మలయమాలి సంతోషభరితుఁడై—"నేను సింహాళము నం దున్నపుడు బుద్ధుని త్రోవనుబట్టి సన్యాసదండమును చేఁబూని నిర్వాణనగరమునకు పోవఁ దలపోసికొంటిని. కాని యింద్రా! నేను మొదట నిన్నుఁ జూచినపుడు నిర్వాణమునే చూచితిని. నేనపుడు మఱచితిని. అది నిర్వాణము కాక మరేమి?

"కాని తరువాతఁదరువాత ననుభూతిచేఁగాని తృప్తి చెందని కామక్షుధ నా ప్రాణములలోఁ బ్రవేశించుట కనుఁగొంటిని. అగ్నిజ్వాల నావంటి నాలుగుమూల లంటుకొనెను. కొందఱు దానిని రోగ మనిరి. మఱికొందఱు వెఱ్ఱి యనిరి. నరకు మంచిది కాదని తెలుపుటకు లోకు లొక పాడుపేరుపెట్టి దానిని హింసింతురు. నా పని యటులే యయినది.

"తరువాత నే నా యగ్నిలో నాహుతి యగుదు ననుకొంటిని. కాని యటులు కాలేదు. న న్నది బూడిద చేయుటకు బదులు నాలోని మాలిన్యమును భస్మీకరించెను. ఇప్పుడు నాలో మహామైత్రి పదాఱువన్నె బంగారమై మెఱయుచున్నది. ఇంద్రా! ఇఁక రమ్ము. స్కంధపంచకము దాఁటి ఈ మైత్రీ భూమిలో మునిఁగిపోవుదము." అని అనెను.

మలయవాయు వతని మాటల నాలకించుటకో యన నిలుచుటచే ఆ ప్రకృతియు నిశ్చల మాయెను. మలయమాలి

యిందుకీర్తి ప్రతివచనమునకు కనిపట్టుకొని యుండెను గాని వృథా.

మలయమాలి నపు డనుమానపిశాచ మావహించెను. "ఇది యిందుకీర్తి ప్రతికృతియా ?"

అతఁడు కొంచెము దక్షిణమునకును, కొంచె ముత్తర మునకును వంగి చూచెను. ఆమె తనను చూచుచున్నటులు, మాటలాడఁ బోవుచున్నటులు, కదలుచున్నటులు అతనికిఁ గానిపించెను. అతఁ డెటు వంగి చూచినను ఆమె యతనినిఁ జూచుచునే యుండెను. ఈ దెస ఆ చిత్రపటము తన సృష్టికి సాఫల్యమును సంపాదించకొనెను.

ఇందుకీర్తి మౌనవ్రత మవలంబించెనా ? మలయమాలి మతి యాఁగక యాచిత్రపటమును సమీపించెను. మీఁదఁ జేయివైచెను!

౧౧

"ఈచిత్తరు విచటి కెటులు వచ్చెను ?"

ఈ ముడి అతనికి విడలేదు.

"ఇందుకీర్తియే పంపెనా ?"

ఏమో ఎటులో వచ్చెను. వచ్చెనుపోఁ జాలు. అది తన భాగ్యము. మలయమాలి ఆ చిత్తరువును తెచ్చి యెదుట నిడి

కొని కూరుచుండెను. కొంతసేపు కన్నులం గాంచెను. కొంతసేపు మోమును దిలకించెను. కొంతసేపు కంఠమును కనుంగొనెను. ఇటులు నఖశిఖాపర్యంతమును, శిఖానఖపర్యంతమును మరలమరలం గనుంగొనెను. అతం డిటు లవలోకించుచుండంగనే తెలవారెను.

అతం డా చిత్తరువుతోం బ్రసంగించును. ఆ నా చిత్తురువుమాటలం వినును. అతం డా చిత్తరువు నలంకరించును తాను దాని తృష్ణతృప్తుల గమనించును. అతండు వలయు వస్తువులం గనుంగొనును. వానిని సమర్పించును.

అతని కిందుకీర్తితోం బ్రణయకలహములు సంభవించెను. వెంవేంకి జరించెను. మసిపోయెను. అతం డిందుకీర్తిని బతిమాలెను బతిమాలించుకొనెను. మాటలాడక కూరుచుండెను. మాటలాడెను. ఆమె బదులుమాటలు వినెను. ఈరీతిగా నతని కా చిత్తరువే యిందుకీర్తి యయిపోయెను.

అతని కిందుకీర్తికింగాను సత్యప్రపంచమునుండి కావలసిన వస్తువులు లేవు. సంకల్పముచే సృజింపంబడిన వస్తువులే యామె కుపాయనములు. కాని ఒకానొకనాండు ఇందుకీర్తి నలంకరించుటకు చెట్లు పూచిన పూవులే మలయమాలికం గావలసివచ్చెను. అంతట నామెతో వనవిహారము చేయం దలంపు కలిగెను. అతండు వెంటనే యిందుకీర్తితో కుటీరము వీడి వనము లోనికిం జనెను.

ఆ యుద్యానమున నున్న ఆ వృక్షస్తంబపర్యంత మిందు కీర్తికొఱకే మొలిచినటు లతనికిఁ గానిపించెను. అతడు కనఁబడిన చెట్టుక్రిందనెల్ల ఇందుకీర్తిని దింపి అచట నామె కుపచారము లు చెప్పెను. అచట నొకొక్క పిట్టనే చూపెను. ఆ పిట్టకూఁత లిందుకీర్తిసుం దొక గానసభగా నానందించెను.

ఇటులు వనవిహారము చేసిచేసి మలయమాలి యిందు కీర్తి నొక సురపొన్ననీడ డించి యామె నలంకరించుటకు పూవులు కోయఁబోయెను.

రాజకుమారిచేఁ బ్రేరితుడై వినయజ్యోతి మలయమాలిని కనిపట్టియుండెను. మలయమాలి పూఁకని అటు వెళ్ళఁగనే వినయజ్యోతి యిటు వచ్చెను. అతఁ డా చిత్రరువును దీసి యావల నుంచి దానికి బదులుగా నచట మఱియొక చిత్రపు నుంచి తా నొక చెట్టుచాటున దాఁగియుండెను.

ఈ చిత్తరువున బ్రహ్మాండమైన ఒక నల్లత్రాఁచు. అది పడగ విప్పి యిందుకీర్తిని గాటువేసెను. ఇందుకీర్తి నేల కొఱ గెను. ఆమె పెదవులును, దంతములును, మోమును నల్లఁ బాఱెను.

మలయమాలి తోఁట యంతయుఁ దిరిగి తిరిగి వసంతుని పంట యంతయుఁ గోసెను. ఆపటము ముందుఁకు వచ్చి రంభా పలాశములఁ బఱచి వానిమీఁద నాపూలఁ గుప్పించెను.

పలుమాఱులు కోసికొనివచ్చిన ఆ పూలన్నియు నచట నుండఁగా అవి యొక పూలయంగడి యాయెను.

ఆ పుష్పరాశినుండి దోసిళ్లకొలఁది పూలతో నతఁడిందుకీర్తి నభిషేకింపఁదొడఁగెను. అవి ముత్తియములవలె నెగసి నక్షత్రములవలె నేల రాలెను. క్రింద రాలిన పూలన్నియు నొక పాలమడుఁ గాయెను.

పూలతావిచే నతఁ డున్మాదము చెందెను. ప్రేమచే సుడ్డుగుడుచు కొనెను. ఏకాంతతచే నితర మంతయు మఱచెను. అతఁ డిందుకీర్తిని కౌఁగిలించుకొనఁబోయి మోమెత్తి చూచెను. ఈ పటములో ఇందుకీర్తి చచ్చిపడియుండెను. ఆమెప్రక్క బ్రహ్మాండమైన నల్లత్రాఁచు. అతని మేనిచర్మ మంతయు చలించెను. కనుల నీరు గ్రమ్మెను. అతఁ డెగడిగఁ జూచెను. అతని మతి చెదరెను. అతని కనులు ముకుళించెను. అతని యవయవములు పట్టుదప్పెను. అతఁ డెగురవయిచిన మట్టిముద్దవలె చదికిలఁ బడెను. మూర్ఛలో మునిఁగెను.

మలయమారుత మాతని వదన మండలమందలి స్వేదబిందువులను తుడిచివైచెను. గరువముతో నిట్టనిలిచిన ఆసురపొన్న పట్టని గోడు గాయెను. మలయమాలి కొంతసేపటికిప్రక్క నుండి యా ప్రక్కకు దొరలెను. మాఁగువాఱిన మోముతో లేచి యిందుకీర్తిని జూచెను. బాష్పప్రవాహ మతని నంధు నొనరించెను.

"ఇందుకీర్తి అస్తమింపఁగా, ఓరి మలయమాలీ! నీ జీవ మేల పోదు ?" అని అతఁడు కనులు తెరుచుకొని రివ్వున నా సురపొన్న నెక్కఁదొడఁగెను.

దానిచాటుననే దాఁగియున్న విమలజ్యోతి రాఁబోవు నాపదను ఊహించి వెంటనే కొంతమంది భటులను సైగచే రావించి ఆ యాపదను నివారించు ప్రయత్నమునం దుండెను.

మలయమాలి స్కంధము లన్నిటిని దాఁటెను. ఇంత మును జారుపాటుకుఁ బ్రయాణము కట్టినటు లున్న యొక కొమ్మ కతఁడు చేతులను, కాళ్లను లంకెవైచి తల క్రిందుల పిట్టవలె వ్రేలాడి యిందుకీర్తిని ధ్యానించుచు చేతులను, కాళ్లను వదలివైచెను.

మలయమాలి కనులఁ దెఱచి చూడఁ గలిగినంతలో తాను బ్రతికియున్నటులు తెలిసికొనెను. మలయమాలి రిచ్చపడి యిటు లనెను: "అయ్యా, నా కుపకార మనుకొని అపకార మొనరించితిరి."

"ఎటులు ?"

"ఇందుకీర్తి చనిపోయినపిదప నా బ్రతుకేల ?"

"ఓయి మూఢుఁడా! నీ వలెనే బ్రతికియున్న యిందుకీర్తిని చచ్చిన దనుచున్నావు. నీ వెవరిని పూలఁ బూజించుచుంటివో, నీవెవరిని ముద్దాడుచుంటివో, నీ వెవరిని కౌఁగిలించు

కొనుచుంటివో అది చిత్తరువు. నీవు రాగివి. ఇది యిల్లుగాదు కల్ల. ఇది నీ సంకల్పసృష్టి. నీ కను భ్రాంతి. వట్టిమాయ."

"ఇందుకీర్తి బ్రతికియుండుట కల్ల."

"ఓరి మూర్ఖుడా, అదిగో! చూడు, వేణువనమున బుద్ధుని విహారమును బరికించి తన ప్రాసాదమున కదె పోవుచున్నది."

మలయమాలి కరికంతలలోనుండి యిందుకీర్తిని జూచెను. వెంటనే యతనికి పూర్వస్మృతి కలిగెను. తల వంచుకొనెను.

"నాయనా, నీవు ధ్యానసిద్ధుడవు. నీ ధ్యానమును సిద్ధిపొందజేయుట కిందుకీర్తి ఆచార్య. నీవీ ధ్యానబలముచే దత్త్వమును దెలిసికొన గోరుదువేని అభ్యుత్థుడవయ్యెదవే. పామరులు పైదలులకొఱకు శరీరమునైన నొడ్డుదురు. తత్త్వముకొఱకే శరీరము నొడ్డుదురేని మఱి శరీరము నెఱుగరుకదా. మనోబలము నుపయోగించి నీ వెవరికొఱకు ప్రాణముల నొడ్డితివో ఆమనోబలమునే యుపయోగించి తత్త్వముకొఱ కిపుడు ప్రాణముల నొడ్డగలవేని కోటికోటి యిందుకీర్తుల మూలమును కనుగొనజాలుదువు" అని వినయజ్యోతి యనెను.

"ఏమేమి?" అని మలయమాలి డిల్లపడెను. అతని కనుబొమ లుత్క్షేపము లాయెను. ఒడలు గజ్జబాఱెను. కొంచెము సేపటిలో నతని మోము పిండిన వలువయై వెంటనే సగము

విఱిగి ప్రేలాడు నాకువలె నేలకు వ్రాలెను. కనులు నీటికాల్వ లయిపోయెను. అతని మానస మేకాగ్రతచే కరడుగట్టెను. ఇంతవఱకును శిశువువలె వినయజ్యోతిచేతులలో నున్న మలయమాలి యిపుడు లేచి అతనిముందు శిష్యునివలె నిలువఁబడి “కుండచిల్లిని వజ్రపుఁబోడిచే నతుకుచుంటిని” అని మోఁకారించెను.

‘త్రిశరణములు నిన్ను రక్షించుఁగాక’ అని వినయ జ్యోతి దీవించెను.

౧౨

తలిదండ్రులు మలయమాలి పునర్జన్మమెత్తినటులు సంతసించిరి. గురువులు “చదువుల కిది ఫల”మని తృప్తి సనిరి. “కుఱ్ఱవానితిక్క తిరిగిన” దని ప్రజ శాంతి పొందెను. మిత్రులందఱును ప్రత్యక్షమయిన దైవమును స్తోత్రముచేసినటులు ఇందుకీర్తియౌదార్యమును స్తోత్రముచేసిరి, ఇందుకీర్తి వినయజ్యోతిని ప్రశంసించి మలయమాలికి మంగళము కలుగవలయు నని మనసులో కోరుకొనెను.

మలయమాలి యిటు లందఱను సంతోషసముద్రమున ముంచి మాయ మయిపోయెను. ఇతని సంగతి యిటు లయి పోఁగా మనీష ప్రేమను పాథేయముగాఁ గొని మలయమాలి కొఱకు గృహాత్యాగ మొనరించెను.

మనీష కాలుపెట్టిన యొకటి యూరి సందులో నొక యింటిముంగల సందడిగా నుండెను. ఆ యిల్లొక మంగల వానిది. అతఁడు తాగి కొంచెము మత్తుగానుండెను. ఆ యింటి యెదుటి వేము క్రింద దారినరికట్టి పలువు రొక గుంపుగా కూర్చుండిరి. ఆ గుంపులో నొకఁడు "ఒరీ, తల తడిపిపోతివి, తొందరగా రా" అనెను. ఇంకొకఁడు 'ఒరే నాకు సగము గొఱిగి పోతివి ; నీ వాకిలే తిరుపతి చేసితివి' అనెను. 'ఈవేళ యెవరి అదృష్టమును తిన్నగా లే' దని ఒకఁడనెను. ఇటు లందఱు నిన్ని మాట లనుచుండఁగా ఆమంగలవాఁడు- "కోటీస్వరుడి కొడుకు నిన్న సొగరం చేపించుకోని, ఇదుగో! ఈ బంగార మ్మొలతా డిచ్చిపోయిండు. నీవుకూడా తే ఓతాడు. నీకూ చేత్తా నున్నగా సొగరం" అని యనెను.

మనీష యీ మాటలు వినుచు వారిని తప్పించుకొని వెళ్లి ఊరబసిని కతిథియాయెను.

ఆ పగ లంతయు నామె రాత్రివలె వెడలఁబుచ్చెను. గూండ్లకుఁ జేరు పిట్టల కలకలారావములు ఆమెస్వప్న సేతువును శిథిల మొనరించెను. పడమటికొండమీఁది సూర్యుని చరమ కాంతి ఆమెమనసుమీఁద రక్తాక్షరముల ముద్రించిపోయెను.

మనీష యపుడు ఆ మంగలవాని యింటికేఁగి పది దీనార ములచే నాతని ఆశ్చర్యమునముంచి ములయమాలికేశపాశమును గొని మిళనతీర్థమునకు మహాప్రస్థాన మొనరించెను.

మనీష గ్రామసీమ దాఁటి దానిని దీసిచూచెను. చంచలమయినను నిబిడమయిన రేయి మదిరానుభవ మామె మానసమును స్పృశించిపోయెను. సుఖకరమై పోటు పొడిచిన మున్నీటి యుత్తరంగలపై ప్రసరించిన బుద్బుదమై, గిరగిరఁ దిరుగు మహాకాలుని రథచక్రమునుండి తునిసిపడిన మణిదీప్తియై మలయమాలి యామె కా కేశపాశమునఁ గనఁబడెను. ఆమె దానిని ముద్దిడుకొని కనుల కద్దుకొని తన కేశపాశములో కలిపి చుట్టుకొనెను. కృష్ణరాత్రి నక్షత్రమండలమును భేదించుకొని వచ్చిన రోమాంచమో యనునున్న నక్షత్రకాంతిలో "ఇటు పో, ఇటు పో" అని చెప్పి చూపుచున్న భూదేవితర్జనిలోఁ బాలుఁబడి యామె తెలవాఱు నడకకు నడచెను. ఉషాదేవి కావిచీరలతో నామె కెదురాయెను. సంసార భారముచే కుఱుఁగిన ప్రకృతిమాతబిడ్డలు చెట్టుచేమలు అయత్నపాలితములైనను ఆమె గుప్తవాత్సల్యమును పొందిరోయన ఛాయాతపముల నిత్యక్రీడలో పాలుగొని అడ్డదిడ్డముగా తెగఁబెరిగి ఆకసముదెస దేనినో చూచుచు నామెకుఁ గనఁబడెను. వానిని దాఁటినతరువాత ఎత్తయిన మేడలు, మిద్దెలు, నాలుగిండ్ల బవంతులు, రాజవీథులు.

మనీష ఆ నగరపు రచ్చచావడిముందునుండి చనుచు నచట వెనుకటి విటులకుజూచి తల వంచుకొనెను. ఒకానొకపుడు పూవులవలె తనమీఁదఁ బడిన వేనవేల చూపులిపుడు ముండ్లవలె నామెకు గ్రుచ్చుకొనెను. ఒకానొకపుడు విషమే

యమృత మగును, మఱియొకానొకపుడు అమృతమే విష మగును గదా.

ఆమె యున్న యీ యునికికిని, ఆ రాకకును అచటివా రందఱును ఆశ్చర్యపడిరి. ఒకరొకరే యామెకు స్వాగత మిడిరి. అది యటుండ ఏలికయే రమ్మని ఆమెకు వార్తపంపెను. కాని యామె యచటఁగల విహారమునఁ బ్రవేశము సంపాదించెను. అందు ధర్మభగిని యాయెను. కాని యామె యెందుల కచటఁ బ్రవేశించెనో దానికి ఇసుమంతయు ఫలము కానరాలేదు.

ఆమె కచటఁ దాను చేయుచున్న పని తనకే విపరీతముగాఁ దోఁడగట్టెను. మఱియు తాను తిరిపె మెత్తుకొని తిని యుండుమలు గుడుచుచున్నను తన సౌందర్యభాండారమునకు పెంపేకాని టాం పేదను కానఁబడుటలేదు. విహారమున తాను ధర్మభగినిగా నున్నను పురుషసంఘమునుండి తనకు నిర్భయత లేదు, అందుదానికి స్వేచ్ఛగా బ్రతుకుటకు వీలే లేదా?

ఆమె యిటులు సముద్రమున తెప్పవలె నటు నిటు కొట్టుకొనుచుండఁగా బౌద్ధసన్న్యాసుల మారజయోత్సవము వచ్చెను. వెనుక నొకానొకనాఁడు బుద్ధుఁడు కామక్రోధాదులకు నెలవగు మారుని జయించెను. దానికీ పండువు గుర్తు.

శ్రమణు లందఱును ముండనము చేయించుకొనిరి. అఱ వయించిన కావి వలువలఁ దాల్చిరి. త్రిశరణములకు శరణు

జొచ్చిరి. పిమ్మటఁ గామాదిదుర్గుణములను చిత్రించి ఆచిత్తరువులను దెచ్చి ఒకటొకటే తగులఁబెట్టిరి.

అటుపిమ్మట "సర్వం దుఃఖం దుఃఖ" మ్మనియు, "సర్వం శూన్యం శూన్య"మ్మనియు దిక్కులు మారుమ్రోఁగెను.

ఈ భావనామంత్రముల నవగతము చేసికొని కాంచోలు పశ్చిమదిశ కాషాయాంబరములు కట్టి సూర్యకముండలువు చేకొని బౌద్ధధర్మ మవలంబించెను. నాయికాహృదయ మెఱుఁగని దుష్టవటువువలె చంద్రుఁ డామెను వెంటాడవచ్చెను. ఈ విద్దూరమును జూడవచ్చిన జనసమూహమాయమో యన నాకసమునఁ జొక్కలు కిటకిటలాడెను.

మారోజయమువలనఁ గలిగిన శాంతిచేతంబోలె విహారవాసు లందఱును బడలు మఱచి నిదురించిరి. మనీషమాత్రము మారునకు జయవెట్టుచు కల్పశాపలాయమునఁ గూరుచుండి మలయమారుతిని ప్రతీక్షించుచుండెను. ఆమె భావనాపటము ద్రౌపదికోకలవలె గుట్టలు పడుచుండెను. కొంతవడి కామె లోలోపల నిటు లనుకొనెను :

"నవ్వుచున్నటు లున్న యీనడికిరేయి
నేలచివరను మేటిమున్నీటిమిుండు
వలపుదేవతగా బిట్టు వెలసిన నను
వింతవింతగ నెవ్వరే వెదకువాఁడు ?"

ఆమె యిటులు ఎవరిచేతనో వెదకించుకొనుచుండఁగా అటు మారునిఁ దగులఁబెట్టిన చేయి యొకటి యిటు మనీషపాదమును వెదకుచు ఆమెకుఁ దగిలెను. ఆమె మలయమాలియే యని భ్రమసెను. ఆమె సంతోషముతో సాపున్నమువెలుఁగున నోరగంట నాచేతిని జూచెను. క్రమక్రమముగా నాచేయి తీఁగవలె నామెశరీరమును పెనఁగొనెను.

మనీష చివాలున లేచి కూరుచుండెను. ఆచేయి యామెను గట్టిగా దాపునకు లాగుకొనెను. ఆమె మెల్లఁగా "అయ్యా, ఇది మారుని తగులఁబెట్టిన చేయియే...!" అని యనెను.

"నీ స్త్రీ చేయి మైత్రీమయ మయిన కారణభూమిలోనికిఁ గొంపోవఁగలదు" అని ఆ శ్రమణాచార్యుఁ డనెను.

"కారణభూమియా, మారణభూమియా?" అని మనీష అతని నోకతాపు తన్ని తన దుర్గతికి వగచుచు మలయమాలిని తలఁచుకొనుచు అచటనుండి లేచిపోయెను. ఆమెను మృత్యు వొకవంకను మానభంగ మొకవంకను పట్టుకొని శూన్యము ముందు నిలువఁబెట్టెను. ఆమె హృదయము ఫట్టని పగిలెను. ఒకకిరణ మచట వెలిఁగెను.

౧౩

వేణువనమున విహారనిర్మాణము సంపూర్ణ మాయెను. సున్నముచే గారచేయఁబడిన గోడ లన్నియు సర్వజ్ఞుని మానస

మునకుఁ బ్రతిసిద్ధులవలె నుండెను, వేదిక మీఁద నెలకొలుపఁబడిన బుద్ధుఁ డందఱకును ధ్యానముద్ర నుపదేశించుచు నెదుటఁగల తటాకమునఁ బ్రతిబింబించి సాధకుల భావనాతటాకమునఁ బ్రతిబింబించిన చందముగాఁ గనుపట్టుచుండెను.

విహారమునందు నిలువఁబడిన ప్రతివాని హృదయమపార మగాధమగు నొకానొక శాంతిలోఁ బ్రవేశించెను. అట్టి మహాశాంతికి మూలమగు నొక మహారహస్యమునఁ బ్రవేశించి లోకులకు వాని దెలుపఁగలము నని దీక్ష పట్టిన మహాపురుషుఁడు బుద్ధుఁ డెట్టెదుటఁ గానిపించి మౌనముద్రతో నిష్ఠుఁ డాతత్త్వమును మనల నెల్లర కాదేశించుచున్నటు లుండెను.

ఆ మహాపురుషుని జూచిన వృద్ధుఁ డొకఁడు బాలుఁడై పోయెను. ఒక బాలుఁడు వృద్ధుఁ డాయెను.

మధ్యము వృద్ధుఁ డొకఁడు బుద్ధుని జూచుచుఁ జూచుచు జందెములు పుటుక్కునఁ దెంపివయిచెను, ఒక యువతి యలంకారముగాఁ బెట్టుకొనిన నగతోఁ గలిపి కొప్పును కోసివైచికొనెను. శ్రమణుఁ డొకఁడు తన వేసమునకు రోసెను. ఒక వేదసన్న్యాసి ధ్యానముద్ర దాల్చి మఱొక బుద్ధవిగ్రహమువలె నాయెను.

వినోదమును విలోకింపవచ్చిన వైదికోత్తములకు మంత్రతంత్రములుగాని పూజాప్రతిష్ఠలుగాని లేని యావిహారము

తోసి నోరివలె నుండెను. ఆలోచనలో మునిఁగి తేలుచున్న యొక వైదికోత్తముఁడు 'ఇఁకముందు కలియుగమంతయు నిట్టి యేడూకములచేతనే నిండిపోవునని పురాణములలో నుండెన'ని పరిహాసించెను. యజ్ఞము చేయుటకు ధనధాన్యములు లేని కర్మఠుఁడొకఁడు 'యెటులయినను బుద్ధుని యహింసామతము సుమండీ' అని యనెను. 'అహింసామత మన నేమో నే నెఱుఁగనుగాని కడుపుకుంటకు బుద్ధుఁడే సూకరమాంస మారగించె'నని వేద ధర్మ ప్రవక్త యొకఁ డనెను.

భక్తుఁడగు వైదికుఁ డొకఁడు నోరు కఱచుకొని 'బుద్ధ దేవుఁ డొక యవతారము సుమండీ' అని అనెను. విహారము నాలుగుమూలలును విహరించివచ్చిన ద్వైతవాది యొకఁడు 'సగుణము నంగీకరింపని బౌద్ధులకు బుద్ధుఁడే సగుణమై కూర్చుండె'నని యుద్ఘోషించెను. 'అద్వైతము ప్రచ్ఛన్న బౌద్ధ' మని మఱియొకఁ డనెను.

'శూన్యవాది యశూన్యము నంగీకరించుచున్నాఁడ'ని తార్కికుఁ డొకఁడు బుద్ధుని వ్రేలఁ జూపఁదొడఁగెను. 'కర్మయే తెలియకుండ నిటులు చేయించుచున్నద'ని జకస్మీమాంసకుఁ డొకఁడు ముక్కుమీఁద వేలు వేసికొనెను.

ఇటు లెవ రేమనుకొన్నను ఆ రాతివిగ్రహ మందఱకు— 'నీ వెచటినుండి వచ్చితివి? మఱి నీ వెచటి కేఁగుచుంటివి?' అని నిలఁబెట్టుచుండెను.

దూరమునుండి కోలాహలధ్వని యొకటి వినఁబడఁదొడఁగెను. క్రమక్రమముగా నది మూఁడు విరామములతో వీను మిగిలెను కొంతవడికి.

బుద్ధం శరణం గచ్ఛామి
ధర్మం శరణం గచ్ఛామి
సంఘం శరణం గచ్ఛామి

అను ఘోషము వాయుతరంగములలోఁ బ్రవహించెను. దిక్కులన్నియు నీ త్రిశరణములచేఁ బ్రతిధ్వనించెను.

జనులంద ఱెదురేఁగిరి.

మహారాజాధి రాజ పరమేశ్వరుఁ డిందు కేసరియు నతని ప్రక్క నిందుకీర్తియు వారిముంగల విజయజ్యోతియు పాదచారులయి వచ్చిరి. వారి వెనుక మానవారణ్యము

సాధకు లందఱును విహారమునఁ గూర్చుచుండిరి. అచట సనాయి లేదు డోలు లేదు మేళము లేదు తాళము లేదు. ధ్యానమునఁ బ్రవేశించుటయే నచటఁ గర్తవ్యము.

సాధకు లందఱును ధ్యానసాగరమునఁ బడిరి. ఏకాగ్రత లేని సాధకుఁ డొకఁడు తన ప్రక్క వానిని జూచి కనులు గట్టిగా మూసికొనెను. విహారమును జూడవచ్చిన బాలకు లందఱును వినోద మేమియు లేమిఁ గొలఁకునఁ బడి 'నీట మునిఁగి యెవ రెక్కువసే పుందురో' యని పన్నిదము చఱచికొనిరి.

క్రమక్రమముగా నందఱును పోఁజొచ్చిరి. సాయంతన జ్యోతి వెలిఁగెను. దేవాలయము ఘంటానాదము నగరమునుండి వినఁబడెను.

అచట ధ్యానసముద్రమున మునిఁగినవారిలో ముందట తేలినవాఁడు వినయజ్యోతి. అతఁడు లేచి మిగిలినవారి నుద్దేశించి మోకరించెను.

కొంతవడి కిందుకేసరి మెలఁకువఁ గనెను. అతఁడు లేచి మిగిలినవారి నుద్దేశించి మోకరించెను.

పిదప ఇందుకీర్తి కనులు విప్పెను. పిదప దమనీయ కనుదమ్ములఁ దెఱచెను. వారిరువురును లేచి నిలుచఁబడి ధ్యానసిద్ధుఁడును తన్మయుఁడు నగు నొక యువకునిముందు మోకరించిరి.

అతఁడు మలయమారుతి.

---

112-పుట. 2-వ పంక్తిలో 'భావించెను' అనుటకు బదులు 'భావింపఁజొచ్చెను' అని దిద్దుకొనునది.

చెన్నపురి: వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్‌వారి
'వావిళ్ల' ప్రెస్సున ముద్రితము—1949